


# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక





ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక:96:- గురువారం 20 నవంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




## మారేడుమిల్లిలో.. మరో ఎన్‌కౌంటర్

### మృతుల్లో మావోయిస్ట్ కీలక నేతలు అజాద్, దేవ్‌జీ..!

దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతున్నది. మంగళవారం ఏపీలోని అల్లూరి జిల్లాలో పీఎల్‌జీఏ చీఫ్ హిడ్మా, అతని భార్య మరో నలుగురు హతమవ్వగా, అది జరిగిన 24 గంటల్లోపే తాజాగా, ఆంధ్రా-ఒడిశా బోర్డర్ (ఏఓబీ)లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టుల వేట కొనసాగుతూనే ఉంది. అదే ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ కొనసాగించిన భద్రతా బలగాలు మరోసారి పైచేయిగా నిలిచారు. మారేడుమిల్లి అడవుల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్న క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల విరమణ తర్వాత భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రి లభించాయి.

మిగతా 2



## తక్షణమే ప్రజాక్షేత్రంలోకి రావాలి

▸▸ లేదంటే ఇన్ ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పిస్తా ▸▸ కొడాలి నాని, వంశీ లకు వైఎస్ జగన్ అల్టిమేటం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ పునర్నిర్మాణంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. ఈ క్రమంలో కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన మాజీ మంత్రి కొడాలి నాని, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌ల తీరుపై జగన్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. బుధవారం వాళ్లిద్దరినీ తాడేపల్లికి పిలిపించుకున్న జగన్.. నియోజకవర్గాల్లో యాక్టివ్‌గా ఉండాలని, లేకుంటే మీ స్థానాల్లో వేరే వారికి బాధ్యతలు అప్పగించాల్సి వస్తుందని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే, జగన్ చేసిన ఈ హెచ్చరికలు క్షేత్రస్థాయి వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. వీళ్లను కాదని కొత్తవారికి బాధ్యతలు ఇస్తే వైసీపీకి లాభమా? నష్టమా? అన్నదే ఇప్పుడు చర్చ జరుగుతోంది.

**అమరావతి (మనసులో మాట), నవంబరు 19** : గత ఐదేళ్లలో ప్రతిపక్ష టీడీపీపై మాటల తూటాలు పేల్చిన కొడాలి నాని, వల్లభనేని వంశీ.. 2024 ఎన్నికల ఓటమి తర్వాత పూర్తిగా స్తబ్దుగా మారిపోయారు. గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉండకపోవడం, ప్రజా సమస్యలపై స్పందించకపోవడం వంటి అంశాలు అధిష్టానం దృష్టికి వెళ్లాయి. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేతలు ప్రజల్లో ఉండకపోతే క్యాడర్ ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నది జగన్ ఆవేదన. అందుకే, తక్షణమే ప్రజాక్షేత్రంలోకి రావాలని, లేదంటే ఇన్ ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పిస్తానని ఆయన అల్టిమేటం జారీ చేసినట్లు తెలుస్తోంది.

జగన్ హెచ్చరికలు సిద్ధాంతపరంగా బాగానే ఉన్నా, ఆచరణలో అవి బెడిసికొట్టే ప్రమాదమే ఎక్కువని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. గుడివాడలో నాని, గన్నవరంలో వంశీలకు మించిన ప్రత్యామ్నాయం వైసీపీలో లేకపోవడమే. ఈ రెండు నియోజకవర్గాల్లో వైసీపీ ఓటు బ్యాంకు కంటే.. నాని, వంశీల వ్యక్తిగత ఓటు బ్యాంకే బలంగా ఉంది. వారు పార్టీలో ఉన్నా, లేకున్నా వారి వెంటే నడిచే వర్గం అక్కడ పెద్ద ఎత్తున ఉంది. దశాబ్దాలుగా వీరిద్దరూ తమ నియోజకవర్గాల్లో ఏకఛత్రాధిపత్యం వహిస్తున్నారు. వీరి నీడలో మరో నాయకుడు ఎదిగే అవకాశం రాలేదు. ఇప్పుడు హఠాత్తుగా వీరిని పక్కనపెడితే, ఆ ఖాళీని భర్తీ చేసే సత్తా ఉన్న నేతలు వైసీపీలో కనీసం కనిపించడం లేదు.

ప్రస్తుతం వైసీపీ అధికారంలో లేదు. ఇలాంటి క్లిష్ట సమయంలో, బలమైన ఆర్థిక వనరులు, క్యాడర్ బలం ఉన్న నాని, వంశీలను కాదని కొత్తవారికి పగ్గాలు ఇవ్వడం ఆత్మహత్యా సదృశమే అవుతుంది. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో, అధికార కూటమిని ఢీకొట్టాలంటే ఆర్థికంగా, సామాజికంగా బలమైన నేతలు కావాలి. కొత్తవారు వచ్చి ఇప్పుడు బాధ్యతలు చేపట్టినా, క్యాడర్ వారిని నమ్మే పరిస్థితి లేదు. ఒకవేళ జగన్ కొత్తవారిని నియమిస్తే, అది

మిగతా 2



## కరుణ, శాంతి, కర్మ అనే అంశాలపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి


- ▸▸ భుజ్ భూకంపం సమయంలో సత్యసాయి బాబా చేసిన సేవలను మరువలేను : ప్రధాని మోదీ
- ▸▸ సత్యసాయి బోధించారు... చదివించారు... సేవలందించారు: సీఎం చంద్రబాబు
- ▸▸ మానవ సేవే మాధవ సేవ అని ఆచరించారు : సీఎం
- ▸▸ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్
- ▸▸ శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూ.100 విలువైన స్మారక నాణేన్ని విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

పుట్టపర్తి, నవంబర్ 19: సేవ పరమో ధర్మః అనేది మన మూల జీవన విధానంలోనే ఉందని... లవ్ ఆల్ సర్వ్ ఆల్ అని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధించారని... బోధించడమే కాకుండా తాను ఆచరించడంతో పాటు ఆయన సంస్థలూ అదే పాటించేలా శ్రీ సత్యసాయి బాబా అందరిలోనూ స్ఫూర్తి నింపారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శ్రీ సత్యసాయి బాబా 100వ జయంత్యుత్సవాలకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు హాజరయ్యారు. వీరితో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, కిషన్ రెడ్డి,

మిగతా 2


## బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో ఆర్వో ప్లాంట్లు

- ◆ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- ◆ రూ.20.29 కోట్లు మంజూరు
- ◆ రూ.16.85 కోట్లతో 922 బీసీ హాస్టళ్లలో
- ◆ రూ.3.44 కోట్లతో 55 గురుకులాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- ◆ 45 రోజుల్లో ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తికి ఆదేశం : మంత్రి సవిత



అమరావతి : బీసీ సంక్షేమ హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాల విద్యార్థుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోంది. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు రూ. 20.29 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియను 45 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు. ఈ మేరకు బుధవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ సంక్షేమ హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాల విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే నాణ్యమైన భోజనం అందించాలన్న

మిగతా 2






## అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు అమలుతో రైతే రాజు


- ▸▸ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అంశాలపై ఫోకస్
- ▸▸ రైతు మీసం మెలేసే రోజులు రాబోతున్నాయి
- ▸▸ మొంథా తుఫాన్ బాధిత రైతులకు త్వరలో రూ.390 కోట్లు ఇస్తాం
- ▸▸ రెండో విడత అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- ▸▸ రెండో విడతలో రూ. 3135 కోట్ల మేర చెల్లింపులు
- ▸▸ 46,85,838 మంది రైతులకు రూ.3,135 కోట్ల మేర లబ్ధి

మిగతా 2



### కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటన

- కుప్పం ద్రవిడ యూనివర్సిటీ విద్యార్థులతో నారా భువనేశ్వరి సమావేశం
- యూనివర్సిటీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన భువనేశ్వరి
- జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన భువనేశ్వరి
- మీ అందరినీ చూస్తుంటే నేను విద్యార్థిగా ఉన్నప్పటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి
- భవిష్యత్తులో మీరంతా ఉన్నత స్థాయికి ఎదగాలి.
- పట్టుదలతో అనుకున్న లక్ష్యానికి ఎదగాలంటే కఠోర కృషి అవసరం.
- అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన భువనేశ్వరి
- భువనేశ్వరికి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, సిబ్బంది సన్మానం
- మహిళా ఎంట్రపెన్యూర్‌లతో భేటీ అయిన భువనేశ్వరి



## అభివృద్ధిలో చంద్రబాబు అన్ స్టాపబుల్



- నూతన విధానాలు, ప్రమాణాలే ఆయనకు కొలమానాలు
- ఎక్స్ లో ట్వీట్ చేసిన దిగ్గజ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర
- అది తన బాధ్యత అంటూ వినమ్రంగా సమాధానమిచ్చిన సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 19: సామాజిక మాధ్యమాల్లో అత్యంత క్రియాశీలకంగా ఉండే దిగ్గజ పారిశ్రామికవేత్త మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా చేసిన ట్వీట్ వైరల్ గా మారింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధిలో అన్ స్టాపబుల్ అంటూ ట్వీట్ చేశారు. ఆయన్ను ఆపగలిగేవారు ఎవరూ లేరని కొనియాడారు. ఈ మనిషి తిరుగులేని శక్తి ..దశాబ్దాలుగా ఆయన అభివృద్ధి విధానాలకు ఆకర్షితుడిని అవుతున్నాను అంటూ పేర్కోన్నారు. ఎప్పటికప్పుడు నూతన విధానాల్ని తీసుకురావటంతో పాటు తనతో పాటు తన చుట్టూ ఉన్నవారందరి ప్రమాణాలనూ ఎప్పుడూ పెంచుతూ ఉంటారని ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. అభివృద్ధి పట్ల చంద్రబాబు తన ఆసక్తిని ఏమాత్రం సడలనివ్వకుండా నూతన విధానాలు, ప్రమాణాలతో అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారని ఆనంద్ మహీంద్రా తన ట్వీట్ లో పేర్కొన్నారు. విశాఖలో ఈ నెల 14,15 తేదీల్లో జరిగిన 30వ భాగస్వామ్య సదస్సులో పెట్టుబడులకు సులభతరమైన వాతావరణం కల్పించేందుకు ఎస్క్రో విధానం ప్రవేశపెడతామంటూ సీఎం చంద్రబాబు మాట్లాడిన వీడియోను దీనికి జత చేశారు. ఆనంద్ మహీంద్రా ప్రశంసలపై సీఎం చంద్రబాబు కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. భారత్ అద్భుతమైన వృద్ధి దశలోకి ప్రవేశిస్తోందని.. ఈ సమయంలో విధానాల రూపకర్తగా భారతీయుల్లోని పారిశ్రామిక వ్యవస్థాపక శక్తిని వెలికి తీయటమే తన బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటు దిశగా కొత్త మార్గాలను, నూతన ప్రత్యామ్నాయాలను వారి ముందు ఉంచుతూ వాటిని అన్ లాక్ చేయటమే కర్తవ్యంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. దేశ ప్రగతిలో తన వంతు పాత్రను పోషిస్తున్నానని తెలిపారు. గత కొన్ని దశాబ్దాలుగా మహీంద్రా గ్రూప్ దేశానికి అందిస్తున్న సేవలు, భాగస్వామ్యం అమూల్యమైనవని .. ఆంధ్రప్రదేశ్ కు స్వాగతించేందుకు ఎదురుచూస్తున్నానంటూ ఎక్స్ లో సీఎం స్పందించారు. భారత పారిశ్రామిక రంగంలో అత్యంత ప్రభావవంతమైన పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఎక్స్ వేదికగా చేసే పోస్టులు నిత్యం చర్చనీయాంశం అవుతాయి. ఆనంద్ మహీంద్రా చేసిన ట్వీట్ తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిస్పందనపై దేశవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు, నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందించారు.




మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# తక్షణమే ప్రజాక్షేత్రంలోకి రావాలి

మొదటి పేజీ తరువాయి... నియోజకవర్గంలో అంతర్గత కుమ్ములాటలకు దారితీస్తుంది. నాని, వంశీ వర్గీయులు కొత్తవారికి సహకరించే ప్రసక్తే ఉండదు. ఇది అంతిమంగా పార్టీని మరింత బలహీనపరుస్తుంది. కొడాలి నాని, వంశీలు ఓటమి భారంతో, కేసుల భయంతో లేదా మరే ఇతర కారణాలతో సైలెంట్‌గా ఉండి ఉండవచ్చు. కానీ, వారికున్న మాస్ ఇమేజ్, పొలిటికల్ గ్రిప్ ఇంకా చెక్కుచెదరలేదు. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, జగన్ చేయాల్సింది వారిని బెదిరించడం కాదు, వారిని తిరిగి యాక్టివేట్ చేయడం. మిమ్మల్ని తప్పిస్తాం అని చెప్పడం కంటే, వారికి భరోసా ఇచ్చి, మళ్లీ జనంలోకి వెళ్లేలా ప్రోత్సహించడమే ఇప్పుడున్న ఏకైక మార్గం. వారిని కాదని వేరే ప్రత్యామ్నాయం వెతుక్కుంటే, కృష్ణా జిల్లాలో వాళ్లిద్దరి వల్ల కంచుకోటలుగా ఉన్న ఆ రెండూ వైసీపీ చేజారినట్లే.మొత్తానికి, జగన్ తీసుకున్న ఈ నిర్ణయం లేదా ఇచ్చిన హెచ్చరిక.. ఆయన అసహనాన్ని చూపిస్తోంది తప్ప, వ్యూహాత్మక ఎత్తుగడగా కనిపించడం లేదు. గుడివాడ, గన్నవరం లాంటి చోట్ల నేనే రాజు.. నేనే మంత్రిగా వ్యవహరించే నాని, వంశీ లాంటి వారి దగ్గర ఈ హెచ్చరికల మంత్రం పనిచేయదు. వారిని బుజ్జగించి, మళ్ళీ రణక్షేత్రంలోకి దించడమే వైసీపీకి తక్షణ అవసరం. మరి జగన్ తన శైలి మార్చుకుంటారా? లేక మొండిగా ముందుకెళ్లి కొత్త ప్రయోగాలు చేస్తారా? అన్నది వేచి చూడాలి.

# మారేడుమిల్లిలో మరో ఎన్‌కౌంటర్

మొదటి పేజీ తరువాయి...


**అల్లూరి/విజయవాడ (మనసులో మాట), నవంబరు 19:** మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోనే మరోసారి ఎదురుకాల్పులు జరిగినట్లు ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ ధృవీకరించారు. అల్లూరి జిల్లా జి.ఎం.వలస సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు హతమైనట్లు వెల్లడించారు. మృతుల్లో మావోయిస్టు కీలక నేతలు అజాద్, దేవ్‌జీ ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి మరికాసేపట్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ లడ్డా తెలిపారు. కొన్నాళ్లుగా కేంద్ర బలగాలతో పాటు వివిధ రాష్ట్రాల పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన హిడ్మా.. మంగళవారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో హిడ్మా భార్య రాజక్క తోపాటు మరో నలుగురు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఘటన మరువక ముందే మరో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోనే మరోసారి ఎదురుకాల్పులు జరిగినట్లు ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ ధృవీకరించారు. అల్లూరి జిల్లా జి.ఎం.వలస సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు హతమైనట్లు వెల్లడించారు. మృతుల్లో మావోయిస్టు కీలక నేతలు అజాద్, దేవ్‌జీ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఘటనకు సంబంధించి మరికాసేపట్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ లడ్డా తెలిపారు. మంగళవారం మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ తర్వాత కొందరు మావోయిస్టులు పారిపోయారని లడ్డా తెలిపారు. వారిని పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. ఈ క్రమంలోనే ఎదురు కాల్పులు జరిగినట్లు తెలిపారు.

# బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో ఆర్వో ప్లాంట్లు

మొదటి పేజీ తరువాయి... ఉద్దేశంతో సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామన్నారు. పరిశుద్ధమైన తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకోసం రూ.20.29 కోట్లు మంజూరు చేశామన్నారు. వాటిలో 922 బీసీ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.16.85 కోట్లు విడుదల చేశామన్నారు. 109 ఎంజేపీ గురుకులాలకు గానూ 54 గురుకులాల్లో ఇప్పటికే ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన 55 గురుకులాల్లో ఆర్వో ప్లాంట్ల కోసం రూ.3.44 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఆయా గురుకులాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ రాబోయే 45 రోజుల్లో పూర్తి చేయాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలతను ఆదేశించినట్లు మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

## కరుణ, శాంతి, కర్మ అనే అంశాలపై

# ప్రతి ఒక్కరూ ఆలోచించాలి






మంత్రి నారా లోకేష్ సహా పయ్యావుల, సవిత, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రూ.100 స్మారక నాణేన్ని విడుదల చేశారు. సత్యసాయి స్మారక తపాళా బిళ్లల్ని ప్రధాని, సీఎం ఆవిష్కరించారు. మొదట శ్రీ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి చేరుకున్న ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు స్వాగతం పలికారు. ఆ తర్వాత కుశ్వంత్ హాల్లో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన శతజయంతి ఉత్సవాల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ..."సత్యసాయి బాబా మన మధ్య భౌతికంగా లేనప్పటికీ ఆయన స్థాపించిన సంస్థలు గ్రామీణ అభివృద్ధి, ప్రజలకు వైద్యం లాంటి సేవల్ని అందిస్తున్నారు. శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు జరుపుకోవటం మనకు ఓ వరం. బాబా పాటించిన ప్రేమ, సేవ భావన ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేస్తోంది. బాబా జీవితమే వసుధైక కుటుంబకం అనే భావనతో ఉండేది. మన భారతీయుల జీవన విధానమే సేవ, భక్తి, జ్ఞానం. కోట్ల మంది బాబా భక్తులు దేశవ్యాప్తంగా మానవ సేవే మాధవ సేవ అని భావించి సేవలు అందిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకృతి వైపరీత్యం వచ్చినా శ్రీసత్యసాయి సేవా దళ్ సభ్యులు ప్రజలకు సేవలందిస్తున్నారు. భుజ్ భూకంపం సమయంలో సేవాదళ్ చేసిన సేవలు నాకు బాగా గుర్తున్నాయి. 3 వేల కిలోమీటర్లకు పైగా తాగునీటి పైపుల్ని ఏర్పాటు చేసి ప్రజలకు దాహార్తి తీర్చారు. వైద్యం ఉచితంగా అందిస్తున్న సంస్థలను బాబా నిర్మించారు. సుకన్య సమృద్ధి యోజన కోసం వేల మంది బాలికలకు ఆర్థిక సాయం అందిస్తోంది ట్రస్టు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 4 కోట్లకు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు ఉన్నాయి. రూ. 3.25 లక్షల కోట్లకు పైగా నిధులు ఈ ఖాతాల్లో ఉన్నాయి. వారణాసి ఎంపీగా అక్కడ 27 వేల మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన కింద నిధులు జమ చేయించాను. సోషల్ సెక్యూరిటీ కవరేజ్ కోసం దేశంలో చాలా పథకాలను ప్రారంభించాం. వీటిపై విదేశాల్లో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. శ్రీసత్యసాయి ట్రస్టు తరపున వంద గిర్ జాతి గోవులను పేదవారికి నా చేతుల మీదుగా అందించటం సంతోషంగా ఉంది. పేద ప్రజల జీవితాలు ఈ గోవుల ద్వారా పెను మార్పు వస్తుంది. రాష్ట్రీయ గోకుల్ మిషన్ లో భాగంగా వారణాసిలో 480కి పైగా గిర్ జాతి ఆవులను పేదవారికి అందించాం. ఇప్పుడు వెయ్యికి పైగా గిర్ ఆవులు ఆ ప్రాంతంలో తయారు అయ్యాయి. రువాండాలో 200కు పైగా గిర్ ఆవులు ఉన్నాయి. గోవుల దానం లాంటి సంప్రదాయం అక్కడ కూడా ఉంది. గోసంపద ద్వారా పాల ఉత్పత్తి, పోషకాహారం, సోషల్ ఇమ్యూనిటీ లాంటివి పెరుగుతాయి. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం ముందుకు వెళ్తోంది. ఇందులో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. వోకల్ ఫర్ లోకల్ అనే మంత్రాన్ని అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను. స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేస్తే ఆత్మనిర్భర్ భారత్ తయారైనట్టే. శ్రీ భగవాన్ సత్యసాయి ప్రేరణతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రతీ వ్యక్తి ఆలోచనలో కరుణ, శాంతి, కర్మ అనే విధానాల ద్వారా ముందుకు వెళ్లాలి. "అని ప్రధాన మంత్రి సూచించారు.

**బంగారూ... అంటూ భక్తులను పిలిచే శ్రీ సత్యసాయి బాబా సేవలు ఆదర్శనీయం: ముఖ్యమంత్రి**

ఈ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.."ఈ భూమిపై మనకు తెలిసిన, మనం చూసిన దైవ స్వరూపం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా. ప్రేమ, సేవ, ప్రశాంతత, పరిష్కారానికి బాబా ప్రతిరూపం. లవ్ ఆల్ సర్వ్ ఆల్ హెల్ప్ ఎవర్ హర్ట్ నెవర్ అనేది శ్రీసత్యసాయి మనకు చూపిన దారి. విశ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంతోషం అనే భావనతో బాబా జీవించారు. భగవాన్ నడిచిన ఈ పుణ్యభూమిలో ఇవాళ ఆయన శతజయంతి వేడుకలు జరుపుకుంటున్నాం. మానవ సేవే మాధవ సేవ అని నమ్మిన సత్యసాయి బాబా దాన్నే బోధించారు... ఆచరించారు... ఫలితం చూపించారు. ప్రేమ ఒక్కటే మతం, హృదయం ఒక్కటే భాష, మానవత్వమే కులం, అన్నిచోట్లా దైవం ఉన్నారని బాబా బోధించారు. నాస్తికుల్ని సైతం ఆధ్యాత్మికత వైపు నడిపించారు. వేర్వేరు దేశాలు వేర్వేరు ప్రాంతాల ప్రజలను మనో దర్శనంతో ప్రభావితం చేశారు మానవ సేవే మాధవ సేవ అనే ఆయన భావనతో శ్రీసత్యసాయి భక్తులు మానవాళికి సేవలు అందిస్తున్నారు. భక్తుల్ని ఎంతో ప్రేమగా 'బంగారూ'... అంటూ ఆయన పిలిచే పిలుపు ఎప్పటికీ గుర్తుంటుంది. బాబాతో నాకు ఎన్నో అనుభవాలు ఉన్నాయి. ట్రస్ట్ కార్యక్రమాలపై పలుమార్లు నాతో చర్చించారు. విలువలతో కూడిన విద్యను 1వ తరగతి నుంచి ఉన్నత విద్య వరకూ ఉచితంగా అందించారు. 102 సత్యసాయి విద్యాలయాలు...60,000 మందికి ఉత్తమ విద్యను అందిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ, జనరల్ ఆస్పత్రులు, మొబైల్ ఆస్పత్రుల ద్వారా రోజూ రోగులకు సేవలందుతున్నాయి. రాయల సీమ ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రశాంతి నిలయాన్ని తాకట్టుపెట్టి అయినా ప్రాజెక్టును పూర్తి చేయాలనుకున్నారు. ఈ విషయం తెలిసి భక్తులు ముందుకు వచ్చి కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చారు. రూ.550 కోట్లు ఖర్చు పెట్టి ఏపీ, తెలంగాణ, తమిళనాడులో 1600 గ్రామాలు, 30 లక్షలకు పైగా జనాభాకు నీరిచ్చారు. చెన్నై డ్రింకింగ్ వాటర్ మోడర్నైజేషన్ స్కీంకు రూ.250 కోట్లు ఖర్చు పెట్టారు. సత్యసాయి స్ఫూర్తిని, ఆయన చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి. రాష్ట్రప్రభుత్వం భగవాన్ శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోంది. "అని సీఎం చంద్రబాబు వెల్లడించారు

## ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల

# మూలాలపై పరిశోధన

- ఐసీఎంఆర్ ఆమోదం-రూ. 6.2 కోట్లు మంజూరు
- ఆంధ్ర వైద్య కళాశాలలో ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు
- కిడ్నీ వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలోనే గుర్తించేలా పరీక్షలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి

శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో అధికంగా ఉన్న కిడ్నీ వ్యాధుల మూలాలపై పరిశోధన చేపట్టేందుకు ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మూడేళ్ల కాల వ్యవధిలో ఈ పరిశోధన పూర్తిచేసేందుకు మూడు దశల్లో ఐసీఎంఆర్ రూ.6.2 కోట్లను గ్రాంటు రూపంలో ఇస్తుందని ప్రకటించారు. సీఎం శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలనుసరించి వైద్య ఆరోగ్య శాఖ ఉద్దానంలో పరిశోధన నిమిత్తం ఐసీఎంఆర్ తో ఈ ఏడాది మార్చి నుంచి జరిపిన సంప్రదింపులు ఫలించాయని మంత్రి తెలిపారు. ఐసీఎంఆర్ 'డిపార్టుమెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్' కింద పరిశోధన నిర్వహణకు ఇటీవల ఆమోదం తెలపడాన్ని మంత్రి సత్యకుమార్ స్వాగతించారు.

**ఒకటి, రెండు ఏళ్లల్లో కిడ్నీ వ్యాధుల బారిన పడేవారిని గుర్తించేలా..**

'శ్రీకాకుళం కిడ్నీ రీసెర్చ్ ప్రాజెక్ట్" పేరుతో జరిగే ఈ పరిశోధనలో భాగంగా పరీక్షించే వారిలో ఒకటి, రెండు సంవత్సరాల్లో కిడ్నీ వ్యాధుల బారినపడే వారిని గుర్తించి, ముందుగానే చికిత్స అందించేందుకు అవకాశమేర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు. అలాగే కిడ్నీ వ్యాధుల మూలాలు కనుగొనడం ద్వారా ఉద్దానం ప్రాంతంలో అవసరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి వివరించారు. అతి త్వరలోనే పరిశోధన ప్రారంభమవుతుందని తెలిపారు.

**తొలి విడతలో 5,500 మంది నుంచి రక్త, మూత్ర నమూనాల సేకరణ**

వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, సీనియర్ నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రవిరాజ్ మార్గదర్శకంలో ఆంధ్ర వైద్య కళాశాల ద్వారా నెఫ్రాలజీ హెచ్ఓడి ప్రొఫెసర్ జి.ప్రసాద్ పంపిన ప్రతిపాదనలు పరిగణనలోనికి తీసుకుని పరిశోధనకు ఐసీఎంఆర్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఉద్దానంలో శాస్త్రీయ విధానంలో 18 ఏళ్లకు పైబడిన వారి నుంచి రక్త, మూత్ర నమూనాలు సేకరిస్తారు.

ఉద్దానం ప్రాంతంలో ర్యాండం కింద తొలి విడదలో 5,500 మందిని ఎంపిక చేసి వారికి రక్త, మూత్ర పరీక్షలు చేస్తారు. మూత్ర నమూనాలను ఆధునిక బయోమార్కర్స్ విధానంలో పరీక్షిస్తారు. దీనివల్ల బాధితులకు ఒకటి, రెండు సంవత్సరాల్లో కిడ్నీ సమస్య ఏ స్థాయిలో రావచ్చున్నది స్పష్టంగా తెలుస్తుంది. ప్రస్తుతం కొత్త మందులు కూడా అందుబాటులోనికి వచ్చాయి. దీనివల్ల బాధితులు ముందుగానే మేల్కొని వ్యాధులు ముదరకుండా (డయాలసిస్, కిడ్నీ మార్పిడి వంటి) జాగ్రత్తపడే అవకాశం ఉందని, ఉద్దానంలో గతంలో అధ్యయనం చేసిన డాక్టర్ రవిరాజ్ తెలిపారు.

**జన్యు పరీక్షలు కూడా..**

ఆర్ఎన్ఎ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు. దీనివల్ల బాధితులకు జన్యుపరంగా కిడ్నీ వ్యాధులు వస్తాయా? రావా? అని కూడా తెలుస్తుందని పేర్కొన్నారు. ఉద్దానంలో ప్రతి వంద మందిలో 18% మంది కిడ్నీ పనితీరు సక్రమంగా లేదని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడ కూడా ఇక్కడ మాదిరిగా కేసులు లేవన్నారు.

**ఆంధ్ర మెడికల్ కళాశాలలో ప్రత్యేక ల్యాబ్**

రక్త, మూత్ర నమూనాలు పరీక్షించేందుకు ఐసీఎంఆర్ ఆంధ్ర వైద్య కళాశాల(%ూవీజ%)లో ప్రత్యేక ల్యాబ్ ను ఏర్పాటుచేయబోతుంది. ఇందుకు సంబంధించిన పరికరాలు/యంత్రాలు ఐసీఎంఆర్ ద్వారా వైద్య కళాశాలకు రానున్నాయి. కొత్తగా సాంకేతిక నిపుణులు, రీసెర్చ్ నిపుణులను నియమిస్తారు. తొలి ఏడాది రూ.3.04 కోట్లు, రెండో ఏడాది రూ.1.75 కోట్లు, మూడో ఏడాది రూ.1.21 కోట్లు చొప్పున ఐసీఎంఆర్ నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులతోనే ల్యాబ్ ఏర్పాటవుతుంది. వేతనాలు చెల్లింపులు జరుగుతాయి. ఇతర ఖర్చులు కూడా ఈ నిధుల నుంచే వినియోగిస్తారు. ఉద్దానంలోని వేరువేరు ప్రాంతాల్లో మట్టి, నీరు, గాలి, వరి, చేపలు, కూరగాయల నమూనాలు సేకరించి కూడా పరీక్షిస్తారు. వీటి ఫలితాలనుసరించి తదుపరి చర్యలు ఉంటాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అర్ధాంతరంగా ఆగిన పరిశోధన**

గత తెదేపా ప్రభుత్వ (2014-19) హయాంలో జార్జ్ ఇన్స్టిట్యూట్ కు పరిశోధన బాధ్యతలు అప్పగించారు. కానీ వైకాపా ప్రభుత్వ నిర్వాకంవల్ల పరిశోధన పూర్తి స్థాయిలో జరగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తిరిగి శ్రద్ధ పెట్టడంతో ఉద్దానం కిడ్నీ వ్యాధి మూలాల పరిశోధనలో మళ్లీ కదలిక వచ్చింది. ఉద్దానం ప్రాంతంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, ఇతర మండలాలు ఉన్నాయి.

# అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు అమలుతో...






కమలాపురం/కడప జిల్లా, నవంబర్ 19: వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు... అన్నదాతకు అండగా నిలిచేందుకు.. పంచసూత్ర ప్రణాళికతో వెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలుగు ఐటీ నిపుణులకు ఎంత మంచి పేరు ఉందో... ఏపీ రైతులు కూడా ప్రపంచ వ్యాప్తంగా అదే స్థాయిలో గుర్తింపు రావాలని సీఎం చంద్రబాబు చెప్పారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రిలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. రెండో విడత చెల్లింపుల్లో భాగంగా రూ.7 వేల చొప్పున 46,85,838 మంది రైతుల ఖాతాలకు రూ.3,135 కోట్లను జమ చేశారు. రచ్చబండలో పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు విధానాలు అవలంభించాలి. సాగులో టెక్నాలజీ వినియోగంపై దృష్టి పెడితే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. మనది రైతు ప్రభుత్వం. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో భాగంగా తొలి విడతలో రూ.3,175 వేల కోట్ల సొమ్మును ఈ ఏడాది ఆగస్టులో జమ చేశాం. రెండు విడతలు కలిపి మొత్తం రూ.6,310 కోట్లు అన్నదాతకు అందించాం. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారం నిధులు జమ చేయడం రైతు సంక్షేమంపై ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం"అని సీఎం చంద్రబాబు అన్నారు.

**పంచ సూత్రాల అమలుతో రైతే రాజు**

"నీరు సమృద్ధిగా ఉన్నచోటే అభివృద్ధి జరిగింది. రాయలసీమ వాసుల కష్టాలు నేను కళ్లారా చూశాను. కరువు రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేసి ప్రతి ఎకరాకు నీరివ్వాలన్నదే నా సంకల్పం. భూగర్భ జలాలు పెంచాలి. ఒకప్పుడు సీమలో 100 అడుగుల కింద నీరు ఉండేది. ఇప్పుడు 7.3 మీటర్లకే నీరు వస్తోందంటే మన దూరదృష్టి వల్లే సాధ్యమైంది. ఆనాడు నా నియోజకవర్గం కుప్పంలో ఇజ్రాయిల్ టెక్నాలజీ తీసుకొచ్చి మైక్రో ఇరిగేషన్ కు వెళ్లాం. భూగర్భ జలాలు పెరిగితే పర్యావరణం కూడా బాగుంటుంది. రాష్ట్రంలో నీటిభద్రత కల్పించేందుకు నిరంతరం పని చేస్తున్నాం. పట్టిసీమ పూర్తిచేసి కృష్ణా డెల్టాకు నీరందించాం. సముద్రంలోకి వృథాగా పోయే వరద నీటిని రాయలసీమ వైపు మళ్లించి రిజర్వాయర్లు నింపాం. హంద్రీనీవా ద్వారా సీమకు నీరిచ్చాం. రాష్ట్రంలో 95 శాతం జలాశయాలు నిండాయి. చెప్పిన విధంగా నదుల అనుసంధానం చేసి చూపిస్తాం. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉండబట్టే రైతులకు మేలు జరుగుతోంది."అని సీఎం అన్నారు.

**ప్రకృతి సేద్యం చేయాలి... డిమాండ్ ఉన్న పంటలు పండించాలి**

"ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ఇందుకు అనుగుణంగా మన సాగు పద్ధతులు మారాలి. ప్రకృతి సేద్యం వైపు రైతులు మళ్లాలి. డిమాండ్ ఉన్న పంటలను పండించాలి. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోంది. ఇంకో 6 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం పరిధిలోకి తీసుకువస్తున్నాం. మొత్తంగా 18 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసే ఏకైక రాష్ట్రం దేశంలో ఏపీనే. ఒకప్పుడు దేశానికే అన్నం పెట్టిన పంజాబ్ లో ఎరువుల వాడకం విపరీతంగా పెరగడంతో ప్రజలు క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం రసాయనిక రహిత పంటలకే విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. టెస్టింగ్, ట్రేసబులిటీ వంటి అంశాలనేవి ఇప్పుడు దేశ, విదేశాల్లో కీలకంగా మారాయి. అందుకే రైతులు క్రిమిసంహారక మందులు, ఎరువుల వాడకం తగ్గించాలి."అని చంద్రబాబు పేర్కొన్నారు.

**సాగులో సాంకేతికత పెరగాలి**

"వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగాన్నే అగ్రిటెక్ అంటారు. సాగులో సరికొత్త విధానాలను ఎప్పటికప్పుడు రైతులకు పరిచయం చేస్తాం. ఏ పంటకు డిమాండ్ ఉందో ముందే వివరిస్తాం. అన్నదాతలు వ్యవసాయంలో పాత విధానాల్ని వదిలి కొత్త మార్గాల్ని అన్వేషించాలి. టెక్నాలజీ వినియోగంతో సాగు వ్యయం తగ్గుతుంది. ప్రధాని మోదీ చెప్పినట్టు ప్రకృతి సేద్యంలో ముందుండే రాష్ట్రానిదే భవిష్యత్. నేనూ రైతు బిడ్డనే. వ్యవసాయంలో రాత్రికి రాత్రి మార్పు తెచ్చేస్తామని నేను చెప్పడం లేదు. కానీ సాగు తీరు మారాలనే ఉద్దేశంతో పని చేస్తున్నాం. భూసార పరీక్షలు.. గాలుల గమనాలు... పంటలకున్న డిమాండ్... వాతావరణంలో వస్తున్న మార్పులను, క్రిమీ సంహారక వాడకం,

సాగులో డ్రోన్లు, శాటిలైట్ల వినియోగం ద్వారా రైతుల ఆదాయం పెరిగేలా చూస్తున్నాం.



రాయలసీమలో డ్రోన్, స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. స్పేస్ సిటీ ద్వారా శాటిలైట్లను అద్దెకు తీసుకుంటాం. వీటి ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తాం. రైతుల ఆదాయాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా చూస్తున్నాం. అందుకే రైతుల అభివృద్ధికి పంచసూత్రాలు తీసుకొచ్చాం. అలాగే గత ఐదేళ్లలో భూసార పరీక్షలు నిలిపేశారు. మళ్లీ వాటిని మొదలు పెట్టాం.

నేను డ్రిప్ ఇరిగేషన్ కింద రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తే గత ప్రభుత్వం రద్దు చేసింది. డ్రిప్ ఇరిగేషన్ రాయితీని ఎస్సీ, ఎస్టీలకు 100 శాతానికి, రాయలసీమ-ప్రకాశం జిల్లాలో 90 శాతానికి, కోస్తాలో 70 శాతానికి పెంచాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**రైతుల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు**

"రైతులకు మరింత ఆదాయం చేకూరేలా రూ.13 వేల కోట్ల పెట్టుబడులతో 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సీఐఐ సదస్సులో ఎంఓయూలు కుదుర్చుకున్నాం. అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈల ఏర్పాటుతో ఫుడ్ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం ఇస్తున్నాం. మన రాష్ట్రంలో పండని పంట లేదు. అగ్రికల్చర్, ఆక్వాకల్చర్, హార్టికల్చర్, సెరీకల్చర్‌లో మనకు తిరుగులేదు. పశుపోషణ, పాల ఉత్పత్తి, మాంసం ఉత్పత్తిలో మనం ముందున్నాం. రాయలసీమ హార్టికల్చర్ హబ్ గా, కోస్తా ఆక్వా హబ్ గా తయారవుతోంది. అరకులో కాఫీని ప్రోత్సహిస్తున్నాం. మనం తీసుకున్న చర్యలతో కోకో ఉత్పత్తి చేసే ఏకైక రాష్ట్రంగా ఏపీగా నిలిచింది. కోనసీమలో కొబ్బరి సాగు జరుగుతోంది. మనం పండించే ఉత్పత్తులకు ప్రపంచ స్థాయి డిమాండ్ వస్తోంది."అని సీఎం తెలిపారు.

**సర్కారీ సాయంతో వ్యవసాయాభివృద్ధి**

"ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు తక్షణం స్పందిస్తున్నాం. మార్కెట్ ఇంటర్వేన్షన్ ద్వారా రైతులను ఆదుకుంటాం. పంటలకు మద్దతు ధర లేకున్నా... విపత్తులు సంభవించినా... వెంటనే స్పందిస్తున్నాం. ఆ మేరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం వచ్చాక విపత్తులకు నష్టపరిహం నిమిత్తం రూ. 310 కోట్లు చెల్లింపులు జరిపాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల నుంచి రూ.15,955 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశాం. 24 గంటల్లోనే డబ్బులు చెల్లిస్తున్నా మొంథా తుఫానుకు నష్టపోయిన రైతులకు రూ.390 కోట్ల పరిహారాన్ని త్వరలో చెల్లిస్తాం"అని ముఖ్యమంత్రి తెలిపారు.

**సంక్షేమం అందిస్తాం... అభివృద్ధి చేస్తాం**

"2024 సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే తల్లికి వందనం, స్త్రీ శక్తి-ఉచిత బస్సు, దీపం %-%2, ఎన్టీఆర్ భరోసా పించన్లు, మెగా డీఎస్సీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశాం. విధ్వంస, ఆటవిక పాలన ఎలా ఉంటుందో గత పాలనలో చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీకి కట్టుబడి ఉన్నాం. విశాఖ భాగస్వామ్య సదస్సులో 613 ఎంఓయూలు చేసుకున్నాం. వీటి ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షల ఉద్యోగాలు వస్తాయి. రాయలసీమను పారిశ్రామిక హబ్ గా తయారుచేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా అడుగులు వేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం



# ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి

**- అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ -**



**అనకాపల్లి, నవంబర్ 19 (మనసు లో మాట):** అనకాపల్లి రింగ్ రోడ్డు లోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం అనకాపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను అనకాపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ స్వీకరించారు. సమస్యలను శ్రద్ధగా విన్న మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించి, అతి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే రామకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమం లో అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థాన ఛైర్మెన్ పీలా నాగశ్రీను, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కరణం ధర్మ శ్రీ, బొడ్డేడ ప్రసాద్

**మునగపాక, (మనసులో మాట) నవంబర్ 19,** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు వై.యస్. జగన్మోహన్ రెడ్డి ని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మ శ్రీ,మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు అరుకు పార్లమెంట్ పరిశీలకులు & అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి అనకాపల్లి జిల్లా సమస్యలపై కొద్దిసేపు చర్చించుకున్నారని తెలిసింది.

## చెరకు రైతుల ఆందోళన అర్ధం చేసుకోండి : భీశెట్టి

**రాష్ట్ర చక్కెర కమిషనర్ కి వినతిపత్రం అందచేసిన లోక్ సత్తా!!**



**విజయనగరం: (మనసులో మాట) నవంబర్ 19:** ఉత్తరాంధ్ర లోని తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, చోడవరం, భీమసింగి సహకార చక్కెర ఫ్యాక్టరీ ల పరిధిలోని చెరకు రైతుల ఆందోళన వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అర్ధం చేసుకోవాలని రాష్ట్ర లోక్ సత్తా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి రాష్ట్ర చక్కెర శాఖ కమిషనర్, వి.వెంకటరావు ని కోరారు బుధవారం తాడేపల్లి లోని కమిషనర్ కి వినతిపత్రం అంద చేసిన అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర లోని అన్ని చక్కెర ఫ్యాక్టరీ లు మూతపడిపోతే చెరకు పండిరచిన రైతుల పరిస్థితి ఏమిటని గతంలో తాండవ,ఏటికొప్పాక,అనకాపల్లి, భీమసింగి చెరకు ఫ్యాక్టరీల పరిధిలోని చెరకు చోడవరం ఫ్యాక్టరీ కి పంపేవారని,విజయనగరం జిల్లాలోని చెరకు పాలకొండ ఈఐడి ఫ్యారి ఫ్యాక్టరీకి పంపేవారని ఇప్పుడు వారుకూడా తీసుకోనని చెపుతున్నారని,చెరకు రైతుల తమ పంటని ఏమి చెయ్యాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారని,ఫ్యాక్టరీల పరిధిలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ముఖ్యమంత్రి చంద్రబాబు ద ృష్టికి చెరకు రైతుల సమస్యలను తీసుకువెళ్లాలని భీశెట్టి కోరారు,ఫ్యాక్టరీలు మూత పడటం బాధాకరమని, చెరకు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోతే మరింత నష్టమని భీశెట్టి అన్నారు,ఎమ్మెల్యేలు మౌనం చెరకు రైతులకు శాపంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, మూత పడ్డ ఫ్యాక్టరీల కార్మికుల, ఉద్యోగుల కు నేటికీ పిఎఫ్,గ్రాట్యుటీ, చెల్లించలేదని,చాలామంది కార్మికులు ఆందోళన తో చనిపోయారని ఆయన అన్నారు, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని భీశెట్టి కోరారు.

## రేపు చూచుకొండ ఉపకేంద్రంపరిధిలో విద్యుత్ సరపరాకు అంతరాయం

**మునగపాక, నవంబర్ 19, మనసులో మాట..** మండలం చూచుకొండ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి గ్రామాలకి చూచుకొండ సబ్ స్టేషన్ మారమ్మత్తుల చేయు కారణముగా చూచుకొండ, గణపర్తి,పల్లపు ఆనందపురం,కుమారపురం,రామ గిరి,నరేంద్రపురం మరియు పరిసర గ్రామాలకు తే. 21.11.2025దీ న ఉదయం 10 గంటల నుండి మధ్యాన్న 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడును. కావున గ్రామ ప్రజలు ఈ విషయం గమనించవలసినది గా తెలియచేటున్నాము.

# అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ విడుదల

**- అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ -**



**అనకాపల్లి, నవంబర్ 19 (మనసు లో మాట):** అనకాపల్లి గుండాల జంక్షన్ లోని శంకర్ ఆర్వో హాల్ లో వ్యవసాయ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు చే నిర్వహించిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా హజరైన మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తదితరులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ల లైవ్ ప్రసంగం వీక్షించారు. అనంతరం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి బృహత్తర కార్యక్రమంతో రైతులకు ఒక ఆధారం చూపించాలన్న ఉద్దేశంతో, రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా సరే ప్రతిష్టాకరంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. సూపర్ 6 లో భాగంగా రైతులకు అండగా ఈ ప్రభుత్వం నిలబడుతుందన్నారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 14000 రూపాయలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 6000 రూపాయలు కలిపి సంవత్సరానికి 20000 చొప్పున ఆర్థిక సహాయం రైతులు అందజేస్తున్నారన్నారు. సూపర్ 6 లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చే 21 విడతగా పిఎం కిసాన్ నిధులు 2000 రూపాయలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లచే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 5000 రూపాయలు కలిపి రెండవ విడతగా మొత్తం 7000 రూపాయలు అందజేయడం జరిగిందన్నారు. అనంతరం అనకాపల్లి నియోజకవర్గ 14.56 కోట్ల రూపాయల చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, ఎపీయుఎఫ్ఐడి కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఇతర సంస్థల ఛైర్మన్లు, అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, వ్యవసాయ శాఖ అధికారులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఆదర్శ సోలార్ గ్రామంగా బొద్దాం ఆమోదం

**కోటిరూపాయల వ్యయంతో నెడ్కాప్ ద్వారా అభివృద్ధి - జిల్లా స్థాయి కమిటీ లో కలెక్టర్ రాంసుందర్ రెడ్డి**




**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 19:** జిల్లా లో సోలార్ యూనిట్లు స్థాపన లక్ష్యాలు సకాలంలో సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి సూర్యాఘర్ పథకం అమలు పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్ లో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ స్థాపన చేసిన తదుపరి మనం సాధారణ విద్యుత్ తో సమాంతరంగా సోలార్ విద్యుత్ వినియోగించుట వలన సోలార్ ద్వారా పొందిన విద్యుత్ తో తిరిగి ఆదాయం పొందవచ్చని అన్నారు. గ్రామస్థాయి లో సోలార్ విద్యుత్ వినియోగం పెరిగేందుకు జిల్లా లో 5వేల మంది జనాభా ఉన్న 6 గ్రామాలను ప్రయోగాత్మకంగా తీసుకుని వాటిలో ప్రజా ప్రయోజనార్థం ఎక్కువ సోలార్ పానన్లు అమర్చిన బొద్దాం గ్రామాన్ని ఆదర్శ సోలార్ గ్రామంగా కమిటీ గుర్తించిందని అన్నారు.నెడ్కాప్ ద్వారా సమగ్ర నివేదిక అందినతదుపరి కోటిరూపాయల వ్యయంతో ఉచితం గా సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు.ప్రతి మండలానికి 10 గ్రామాలను ఎంపికచేసుకుని విద్యుత్ శాఖ, పంచాయతీ శాఖ సోలార్ విద్యుత్ వినియోగం అందువలన కలిగే ప్రయోజనం ప్రజలకు చేరవేసేందుకు ఇంటింటికీ వెళ్లి వివరించాలని అన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 3307 సోలార్ యూనిట్లు అమర్చడం జరిగిందని అదేవిధంగా మొదటి విడత గా 19814 ఎస్ సి/ ఎస్ టి గ ృహాల పై విద్యుత్ శాఖ అమర్చిన సోలార్ పానల్లకు అడుగుకు రూపాయి చొప్పున రెండువందల అడుగుల పానల్లకు నెలకు రెండువందల రూపాయలు అద్దెరూపం లో చెల్లిస్తారని సూపరిటెండెంట్ ఇంజనీర్ లక్ష్మణ రావు కమిటీకు వివరించారు.బ్యాంకర్లు నిర్ణీత సమయంలో లబ్ధిదారులకు రుణాలు అందించాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు , జిల్లా పరిషత్ సి.ఈ.ఓ సత్యనారాయణ, డి పి ఓ మల్లికార్జున రావు,బాంక్ అధికారులు, హౌసింగ్ అధికారులు, సోలార్ విద్యుత్ వెండర్స్, ఏ.డి లు, ఏ.ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి పట్టణ సమస్యల పై ప్రజా సంఘాల ఐక్య వేదిక ఏకరవు

**తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కి వినతి**



**అనకాపల్లి, నవంబర్ 19 (మనసులో మాట):** అనకాపల్లి పట్టణంలో తిష్టవేచిన అనేక సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ విల్లూరి పైడారావు, నూకాంబిక దేవస్థానం మాజీ ఛైర్మన్ బొడ్డేడ అప్పారావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక అనకాపల్లి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిన్నియాదవ్, అంబేద్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు,దళిత బహుజన ఆదరణ సేవాసమితి జిల్లా అధ్యక్షులు కొల్లి చిన్నప్పారావు, ఆర్యవైశ్యుల సంఘం నాయకులు బొడ్డు సోమరాజు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, రైతు సంఘం నాయకులు ఆడారి బుచ్చి రాము, మత్స్యకారుల సంఘం నాయకులు వాసుపల్లి తాతయ్యలు తదితరులు విన్నవిస్తున్నారు. బుధవారం జివిఎంసి జోనల్ కార్యాలయం ప్రాంగణంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నిరసనలు వ్యక్తం చేయడం జరిగింది.


జీఎంసీ జోనల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడం వల్ల ఫోన్ ద్వారా సమస్యలను వివరించి, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్టు ప్రజాసంఘాల నేతలు తెలిపారు. ఎంతో విలువైన మున్సిపాలిటీ స్థలాలు కబ్జాలకు గురవుతున్నందున

బోర్డులు పెట్టి చర్యలు తీసుకోవాలని వారన్నారు. అలాగే పట్టణానికి ప్రధానంగా మంచినీటి సమస్య రోజుకి గంట మాత్రమే ఇవ్వడం సరైందికాదన్నారు. కనీసం ఉదయం రెండు గంటలు, సాయంత్రం మరో రెండు గంటలు స్వచ్ఛమైన మంచినీళ్లు ప్రజలకు సరఫరా చేయాలన్నారు. అలాగే

పట్టణంలో ఉన్న మినీ వాటర్ ట్యాంక్ కనీసం నెలకు ఒకసారి అయినా క్లీనింగ్ చేసే చర్యలు తీసుకోవాలన్నారు. చాలా ప్రాంతాల్లో ఇచ్చిన గంట్లైన కొళాయిలు సరిగ్గాలేక వృధాగా నీరు పోతుందన్నారు.

ఇదిలావుంటే కుక్కలు బెడదను అరికట్టేందుకు సరైన చర్యలు తీసుకోవాలన్నారు . అలాగే బైపాస్ నూకాలమ్మ ఆర్చి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వరకు 60 అడుగుల రోడ్డుకి మోక్షం కల్పించాలన్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే టట్టు కృషి చేయాలన్నారు. అన్నిటికంటే పట్టణంలో నుంచి తరలించుకువస్తున్న చెత్త ను జివిఎంసి జోనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న కంపోస్ట్ యార్డు లో వేయడం వల్ల విపరీతమైన దుర్గాంధం వెదజల్లుతుందన్నారు. దీంతో చుట్టు ప్రక్కల నివసిస్తున్న వారు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద సబ్వే లో లైట్లు ఏర్పాటు చేయాలని వారు అన్నారు. పట్టణంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల షాపింగ్ కాంప్లెక్స్ ల ఎదుట అడ్డదిడ్డంగా వాహనాలు పార్క్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. పైగా కొన్ని షాపింగ్ కాంప్లెక్స్ లకు సెల్లార్ లు లేకపోవడం వల్ల మెయిన్ రోడ్డు పైనే వాహనాలు పార్కింగ్ చేయడం జరుగుతుంది. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కారానికి కృషిచేసి అనకాపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది ఉత్తమ కమిషనర్ గా పేరు తెచ్చుకోవాలని జోనల్ కమిషనర్ ని ప్రజా సంఘాల ఐక్య వేదిక కోరుతోంది.



## రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షం

**- స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**నర్సీపట్నం ,నవంబర్ 19 (మనసులో మాట)** రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మంగళవారం నాతవరంలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి రైతుకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగా నేడు కేంద్ర ప్రభుత్వం వాటా రూ. 2వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 5వేలు కలిపి మొత్తం రూ. 7వేలు అందించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతులకు గాను ఈ ఒక్కరోజే రూ. 3,135 కోట్లు విడుదల చేసినట్లు స్పీకర్ తెలిపారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా 2,42,480 మంది రైతులకు సుమారు రూ. 158.40 కోట్లు జమ అయ్యాయన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని 35,040 మంది రైతులకు గాను రూ. 23.10 కోట్లు విడుదలయ్యాయని, నాతవరం మండలంలోని 10,780 మంది రైతులకు నేడు రూ. 7.12 కోట్లు వారి ఖాతాల్లో పడ్డాయన్నారు. రైతులు ఈ పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని, తద్వారా ఆరోగ్యాన్ని నేల సారాన్ని కాపాడుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ ఛైర్మన్ కరక సత్యనారాయణ, జడ్పిటిసి సుకల రమణమ్మ, ఆర్డీవో వివి రమణ, ఏ డి ఏ శ్రీదేవి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోన్న కూటమి ప్రభుత్వం



పెందుర్తి( మనసులోమాట) నవంబరు 19బీ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తూచ తప్పకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడరు రెడ్డి నారాయణరావు స్పష్టం చేసారు. పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకంలో భాగంగా అన్నదాతలకు అగ్రిటెక్ డిమాండ్ ఉన్న పంట సాగు, మార్కెటింగ్ సౌకర్యం పెంపు, ప్రకృతి సేద్యం, భూసార పరీక్షలు, పంట ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా అధిక ధర వచ్చేలా చేయడం వంటి అంశాలపై రైతాంగానికి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామన్న సూపర్ సిక్స్ హామీని నిలబెట్టుకుంటూ... మొదటి విడత కింద ఒక్కో రైతుకు రూ.7000 చొప్పున 2025 ఆగస్టు 2వ తేదీన రైతు ఖాతాల్లో జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం... నేడు రెండో విడత నిధులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల,మీదుగా కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ప్రారంభించారని రెడ్డి నారాయణరావు పేర్కొన్నారు.

## పిల్లల ఆరోగ్యం బాగానే ఉంది

**- అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరిశీలించిన ఏటీడబ్ల్యూఓ**

**- ముగ్గురు పిల్లలను రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేయనున్నట్లు తెలిపిన ఏటీడబ్ల్యూఓ క్రాంతి కుమార్**



**కొయ్యూరు నవంబర్ 19 (మనసులో మాట):** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోని రాజేంద్రపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరు విశాఖపట్నం కేజీహెచ్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఈరోజు కొయ్యూరు ఏటిడబ్ల్యూఓ క్రాంతి కుమార్ కేజీహెచ్ హాస్పిటల్ కి వెళ్లి ముగ్గురు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ సంపత్ ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లల తోనూ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో చరవాణి ద్వారా మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని అన్నారు. రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని ఏటీడబ్ల్యూఓ క్రాంతి కుమార్ తెలిపారు.



## అర్హులైన వారందరికి పక్కా గృహాలు మంజూరు

**కోటవురట్ల(మనసులో మాట) నవంబర్ 19:** అర్హులైన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు కోటవురట్ల మండలం గృహ నిర్మాణ శాఖ ఏఈ వరప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక హౌసింగ్ ఏఈ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సొంత స్థలాలు కలిగి ఉన్నవారు పక్క గృహాల కోసం ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవాస్ 2.%వా%లో కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క ఇంటికి రూ.1.59 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. మండలంలో ఇప్పటివరకు పక్కా గృహాల కోసం వెయ్యి వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు.

### శ్రీ సాంబశివుని సూలాలకు, గుమ్మటం కు

## అభిషేకం చేస్తున్న పురోహితుడు



**మునగపాక, నవంబర్ 19, మనసులో మాట...** మునగపాక శ్రీ సాంబమూర్తి సోలాల మహోత్సవం నవంబర్ మూడో తారీఖున జరిగిన సోలాల మహోత్సవం సందర్భంగా ఆరోజు రాత్రి వర్షం కారణంగా వాతావరణం అనుకూలించక, మేము దేవస్థానం ఉత్సవ కమిటీ మరియు గ్రామ ప్రజలందరూ కూడా ఉత్సవము సరిగా జరగక చింతిస్తూ ఆరోజు వర్షంలో తడిసిన సోలాలు,గుమ్మటం తడిసిన కారణంగా పురోహితులు చెప్పిన ప్రకారముబుధవారం ఉదయం 10 గంటలకు సోలాలకు గుమ్మటానికి అభిషేకం చేయబడినది. సోలాల మహోత్సవం దిగ్విజయంగా జరగడానికి సహకరించిన ఉత్సవానికి గ్రామ ప్రజలందరికీ కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మనీ ఉత్సవ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాస్ రావు తెలిపారు.

## మంచినీటి పంపు హౌస్ కు మరమత్తులు చేయించిన సర్పంచ్

### గ్రామ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు



**మునగపాక, నవంబర్ 19, మనసులో మాట** మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లి గ్రామంలో పోలిపల్లి అమ్మవారి గుడి వద్ద మంచినీరు పంప్ హౌస్ మరమ్మత్తుల గురి అవ్వడంతో గ్రామంలో మంచినీటికి ఇబ్బందులు లేకుండా సర్పంచ్ దొడ్డి మంగ వేణి కోటేశ్వరరావు తక్షణమే స్పందించి రిపేరు చేయించి గ్రామానికి తక్షణమే మంచినీరు అందేలాగా చర్యలు తీసుకున్నారు. చీకటి పడిపోయిన సరే దగ్గరుండి మంచి నీటి పంపును రిపేర్ చేయించారు. సర్పంచ్ దగ్గరుండి పనులు చేయించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్లు మల్ల మహాలక్ష్మి నాయుడు. పోల్నాటి మహాలక్ష్మి నాయుడు ఎం ప్రసాదు పిగంగాజీ ఏవెంకట్రావు పాల్గొన్నారు

## తహశీల్దార్ లేక ఇబ్బందులు

**గొలుగొండ, నవంబర్ 19,(మనసులో మాట):** మండలంలో తహశీల్దార్ రెండు నెలలుగా లేకపోవడం వల్ల మండల వాసులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆగస్టు నెలలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రిటైర్డ్ కావడం తో ఆ పోస్ట్ ఖాళీ ఏర్పడింది. పలు రకాల పనులతో వస్తున్న వారు సకాలంలో పనులు పూర్తికాక ఇబ్బందులు ప డుతున్నారు. నర్సీపట్నం తహసీల్దార్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన కు రెండు మండలాల్లో భాద్యతలు నిర్వహణ కష్టసాధ్యంగా మారింది.కలెక్టర్ ఇక్కడ పరిస్థితులు పరిశీలించి పూర్తి స్థాయి తహసీల్దార్ ను నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

## అన్నదాత-సుఖీభవ చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు



**విమాడుగుల నవంబర్ 19 (మనసు మాట)...** మండల కేంద్రమైన మాడుగుల శ్రీ తులసి కళ్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నదాత సుఖీభవ పథకం చెక్కును రైతులకు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ రెండో విడతలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ?7, 000 రూపాయలు ఒక రైతుకు అందించడం జరుగుతుందన్నారు ఈ పథకం కింద 45 వేల 345 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా లాభసాటు ఉండే ఆధునిక ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల యంత్రాలను పనిముట్లను రాయితీలపై రైతులకు అందిస్తున్నా మన్నారు నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేయడంతో పాటు వాటిని ఆధునికరించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు ఎన్డీఏ పాలనలో మరిన్ని పథకాలను ప్రజలకు అందించడానికి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ సంఘం చైర్మన్ పి వి జి కుమార్ మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, చీడికాడ మండల పార్టీ అధ్యక్షులు పోతల చిన్నమనాయుడు కింతలి పిఏసిఎస్ అధ్యక్షులుఉండూరు దేముడు, టిడిపి మండల అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు, మండల సత్యజిత్తూరై రైతులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభం



**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 19:** విజ్జి స్టేడియం ప్రధాన రూపకర్త, హానర్బల్ గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ముందుకు వెళ తుందని, వారి స్ఫూర్తితో గ్రామాలలో ప్రతిభ ఉండి ఆడటానికి అవకాశాలు,వేదిక లేక క్రికెట్ పై ఆసక్తి ఉండి నైపుణ్యం ఉన్న చాలా మంది యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నారని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక విజ్జి స్టేడియం వేదికగా విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్, విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో డిఎస్ రాజు మెమోరియల్ ట్రోఫీ స్పాన్సర్షిప్ తో రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ , విజయనగరం శాసన సభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతి రాజు ముఖ్య అతిథులుగా బుధవారం అండర్ 19 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ వేదిక ఒక అవకాశంగా గ్రామం నుంచి వచ్చినా, పేద కుటుంబం నుండి వచ్చినా అవకాశాలు అందితే వారు కూడా జాతీయ స్థాయి క్రీడాకారులుగా గుర్తింపు పొందుతారని సదుద్దేశంతో విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామాల నుండి అనేకమంది యువతకు ప్రోత్సాహం, అవకాశం ఇచ్చి 12 టీములుగా విభజించి అండర్ 19 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని అన్నారు. క్రీడాకారులందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన ప్రదర్శనతో రాణించి వారి జీవిత లక్ష్యాలను అందుపుచ్చుకుంటారని ఆశిస్తూ క్రీడాకారులు అందరికీ శుభాశీస్సులు తెలియజేశారు. క్రీడాకారులకు, ఎంతోమంది యువతకు వారి లక్ష్యాలను అధిగమించే క్రమంలో గత సంవత్సరాలుగా ప్రోత్సహిస్తున్నటువంటి విజ్జి స్టేడియం అభివృద్ధి కొరకు విజయనగరం ఎమ్మెల్యే రిప్రెజెంటేషన్ మేర ఎంపీ తన ఎంపీ లాడ్స్ నుంచి పది లక్షల రూపాయలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ టాస్ వేసి మ్యాచ్‌ను ఓపెన్ చేయగా, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బ్యాటింగ్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పంచకర్ల



**పెందుర్తి (మనసులోమాట) నవంబరు 19..** జీవీఎంసీ 94 వ వార్డు కృష్ణానగర్ ప్రాంతంలో గల శ్రీ దుర్గా మల్లేశ్వర సహిత శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బుదవారం ప్రృతేక పూజలు చేసారు. కమిటీ సభ్యులు ఎర్ర నాగరాజు ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఏఎంసి డైరెక్టర్ గొంతిన హైమావతి, సంతోష్, పెందుర్తి పిఏసిఎస్ డైరెక్టర్ ఉగ్గిన అచ్చి బాబు, వార్డు అధ్యక్షులు తమాడా ఆది బాబు, డి బి ఎల్ సంతోష్,పార్టీ సీనియర్ నాయకులు జుత్తాడ శ్రీనివాసరావు, తనకాల శ్రీనివాసరావు, మోటూరు చైతన్య, ఉగ్గిన దేవుడు, సదరం భీమేశ్వరరావు, రాపర్తి కిషోర్, బంటు సురేష్, త్రిబుల్ ఎస్ రమేష్, ఆలయ కమిటీ సభ్యులు జీవీఎంసీ 94 వ వార్డు ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు



**పాయకరావుపేట నవంబర్ 19 మనసులో మాట.** పాయకరావుపేట శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఇన్చార్జ్ అధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ మరియు ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.గ్రంథాలయ కమిటీ సభ్యుల సమక్షంలో ఇరువురి చిత్రపటాలకు విద్యార్థుల చేత పూలదండలు వేయించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్ గేమ్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వై.అచ్యుతరావు, ఎస్. సీతారామమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏ150 పాదయాత్ర - సర్దార్ జీకి నివాళి



**విజయనగరం: (మనసులో మాట) నవంబర్ 19:** మేర యువభారత్ , కేంద్ర యువజన వ్యవహారాల శాఖ మరియు క్రీడా మంత్రిత్వ శాఖ విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మై భారత్ ఆధ్వర్యంలో జరిగిన సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్ జిల్లా యంత్రాంగం, పోలీస్, ఎన్.ఎస్.ఎస్, మరియు అనేక కళాశాల యువతతో మొత్తంగా వెయ్యమందితో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు సర్దార్ వల్ల భాయ్ పటేల్ యూనిట్ మార్చ్ ఏ150 బుధవారం పాదయాత్ర చేయడం జరిగింది.ఈ పాదయాత్రను టి. డి. పి స్టేట్ సెక్రెటరీ కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ప్రారంభించారు.దీనికి ముందు యువతతో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ , నష ముక్త్ అభియాన్ ప్రతిజ్ఞ తీసుకోవడం జరిగింది. సర్దార్ విగ్రహానికి పాల్గొన్న అతిథులు అందరూ కూడా పూల మాలలు వేయడం జరిగింది.ఈ పాదయాత్ర విజయనగరం ఎచ్చర్ల శాసనసభ్యులు నుడుకుదిటి ఈశ్వరరావు, భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ, మై భారత్ రిప్రెజెంట్ మణిపూరి శ్రీనివాసురావు, స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ గెద్ద బాబురావు, చీపురుపల్లి డి.ఎస్.పి రాఘవులు, ఏ.ఎం.సీ చైర్మన్ చీపురుపల్లి, ఏ.ఎం.సీ చైర్మన్ మెరకముడుదాం, డి.రామచంద్ర నాయుడు ఆర్. ఈ. సి ఎక్స్ చైర్మన్, వీరందరూ ముందుండి పాదయాత్రను నడిపించారు. యువత సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు నుడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ గెద్ద బాబురావు గారు మాట్లాడుతూ విడివిడిగా ఉన్న మన దేశాన్ని ఒక్క దేశానిగా చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం భారత్ ప్రతిజ్ఞ చెయ్యడం జరిగింది.ఈ యూనిటీ మార్చ్‌ని విజయంతం చేసిన ప్రతి ఒక్కరికి జిల్లా మై భారత్ టీమ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి లో ఉన్న అనేక కళాశాల యువత, కళాశాల యాజమాన్యం, చీపురుపల్లి పోలీస్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## కడురమ్యంగా భోగలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవం



**అనకాపల్లి, నవంబర్ 19 (మనసు లో మాట):** అనకాపల్లి శ్రీ సర్వకామకాంబ సమేత భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం కార్తీక మాస శివరాత్రి సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహ వచనం,గోపూజ పంచాంగయ ప్రాసన మహాన్యాస రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కళ్యాణం, రుద్ర హోమం, సహస్ర జ్యోతిర్లింగార్చన స్వామి వారి కళ్యాణోత్సవం కడురమ్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, వేద పండితులు చంద్రమౌళి ప్రభాకర, చంద్రమౌళి ప్రభాకర సత్యనారాయణ శర్మ, ఎలమంచిలి శ్రీనివాస శర్మ, కొత్తలంక పల్లం దాసు శర్మ, దేవస్థాన అర్చకులు పేరూరు చిన్నస్వామి, పేరూరి సాత్విక్ శర్మ, పేరూరు సూర్యనారాయణ, ధర్మకర్తలు యలమంచిలి బంగారురాజు, మల్ల సూరిబాబు, మద్దాల నారాయణరావు, పెంటకోట గణేష్, కొట్ర హరి, దూలం సత్యవతి, అధికసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



### పెందుర్తి స్టేషన్ లో

## తెగిపడిన విద్యుత్ వైర్లు..

### టాటా - యశ్వంతపూర్ రైలుకు తప్పిన ప్రమాదం

పెందుర్తి (మనసులోమాట) నవంబరు 19.. పెందుర్తి రైల్వే స్టేషన్ లో టాటా - యశ్వంత్ పూర్ ఎక్స్ ప్రెస్ రైలుకు పెద్ద ప్రమాదం తప్పింది. స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం వైర్లపైకి వాలిపోవడంతో అవి తెగి రైల్వే లైనుపై పడ్డాయి. దీంతో ఆ పక్కనే పనులు చేస్తున్న ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో పెందుర్తి రైల్వే స్టేషన్ కు చేరుకుంటున్న టాటా =యశ్వంతపూర్ ట్రైను డ్రైవరు ప్రమాద పరిస్థితిని గమనించి రైలును నిలిపేసాడు. లేకుంటే రైల్లో ప్రయాణం చేస్తున్న వందలాది మంది ప్రయాణికులు ప్రమాదంలో చిక్కు కునేవారు. కాగా ఈ ఘటనలో గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ ఆరిలోవ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరినీ పెందుర్తి లో ఉన్న 30 పడకల హాస్పిటల్ లో చేర్పించారు. పెందుర్తి రైల్వే స్టేషన్లో గత కొంతకాలంగా విద్యుత్ పనులు జరుగుతున్నాయి. విశాఖ, కొత్తవలస రైల్వే పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

## దుర్గాలమ్మ చెట్టు వద్ద భారీ అన్న సమారాధన



**పాయకరావుపేట నవంబర్ 19 మనసులో మాట..** పాయకరావుపేట దుర్గాలమ్మ చెట్టు వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 5000 మంది భక్తులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఆచంట దొర,జనసేన నాయకులు తోట నగేష్ ,రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యాల్ల వరహాలుబాబు,ధనిశెట్టి బాబురావు, యాళ్ళ సన్యాసిరావు,గూటూరు శ్రీను, మండల తెలుగు యువత అధ్యక్షులు గొల్లపల్లి నాగు,వార్డు సభ్యులు జగతా శ్రీను,దేవు వినోద్,మైలవరపు రమేష్,గొంతిన అనిల్ పాల్గొన్నారు.

### బాడీ బిల్డింగ్, ఫిజిక్స్ స్పోర్ట్స్ లో అసియా లో

## గోల్డ్ మెడల్ సాధించిన పవన్

### అనకాపల్లి జిల్లా బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ అభినందన




**అనకాపల్లి, నవంబర్ 19 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ కి చెందిన బాడీ బిల్డర్ పవన్ కుమార్ ఆసియా లో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని అనకాపల్లి జిల్లా బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ ప్రతినిధులు నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబి, అమరపల్లి కృష్ణాజీ అన్నారు. అలాగే జిల్లా బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్. పి చంద్రశేఖర్, చిన్ని, కరణం చినబాబు, జనపరెడ్డి శ్రీను, ఎ. ప్రసాద్, శ్రీరామ్, శిలపరశెట్టి ప్రసాద్, నరేంద్ర తదితరులు ఇండియా టీమ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా ఇటీవల 16 వ ప్రపంచ బాడీ బిల్డింగ్ మరియు ఫిజిక్స్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ 2025 పోటీలు ఇండోనేషియా (బాటమ్ సిటీ)లో ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో మిస్టర్ యూనివర్స్ గా (ఛాంపియన్) చెన్నై కి చెందిన భారతదేశపు (ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ ) కి చెందిన బాడీ బిల్డర్ శర్వనన్ మణి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని వారన్నారు. అలాగే 11 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్ అండ్ 5 బ్రాంజ్ మెడల్స్ తో 715 పాయింట్లు సాధించి మెన్స్ టీం ఛాంపియన్షిప్, అలాగే 245 పాయింట్లు తో వుమెన్ ఛాంపియన్షిప్ లను సాధించడం చాలా సంతోషంగా ఉందని భారత దేశపు ఫెడరేషన్ అధ్యక్షులైన స్వామి రమేష్ కుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గా ఉంటూ రాష్ట్ర బాడీ బిల్డర్స్ ను, భారత దేశపు బాడీ బిల్డర్ లను ఆర్థికంగా ప్రోత్సహిస్తూ, క్రీడలను ప్రపంచ స్థాయిలో భారతదేశపు ఖ్యాతి పెంపొందేలా శ్రమించిన స్వామి రమేష్ సారథ్యం ఇండియా టీం మెడల్స్ సాధించడం ఆనందదాయకమని అనకాపల్లి జిల్లా బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అయిన నేషనల్ బాడీ బిల్డర్ లు అమరపల్లి కృష్ణాజి, శిలపరశెట్టి బాబి, ఎన్.పి చంద్రశేఖర్, చిన్ని, కరణం చినబాబు, జనపరెడ్డి శ్రీను, ఎ.ప్రసాద్, శ్రీరామ్ , శిలపరశెట్టి ప్రసాద్, నరేంద్ర తదితర సభ్యులు ఆనందం తో ఇండియా టీం కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## గిరిజన రైతులకు పశువుల ఆరోగ్యంపై సూచనలు సలహాలు...



**పెదబయలు (మనసులో మాట) నవంబర్ 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం పశుసంవర్ధక శాఖ అధికారి ఆదేశాల మేరకు పెదబయలు మండలం గోమంగి పంచాయితీ కుమ్మరి వీధి గ్రామంలో ఈరోజు అక్కడ రైతులకు కృత్రిమ గర్భధారణ కోసం అలాగే పాల ఉత్పత్తి పెరుగుదల కోసం వివరించడం జరిగింది అలాగే పశువులకు సకాలంలో టీకాలు వేయటం పాముల మందులు పట్టించడం పశువులకు ఇన్సూరెన్స్ ట్యాగులు వాటికోసం అక్కడ ఉన్న గ్రామ ప్రజలకు డాక్టర్ ఏ డి నాతి కిషోర్ వివరించి తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఎం ఏ వి సి 1962 పారాస్టప్ కుమారి అలాగే ఇంజరీ గ్రామపంచాయతీ ఏ హెచ్ ఏ బుచ్చిరాజు , రాజు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## 2,42,480 మంది రైతుల ఖాతాలలో
# రూ.158.4 కోట్లు

### జిల్లాలో అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ రెండవ విడత
### జాయింట్ కలెక్టర్ ఎ. జాహ్నవి - స్థానిక శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు



**సబ్బవరం,నవంబర్ 19, (మనసులో మాట) :** రైతులు పండించే పంటలకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ - పి.యం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోందని జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి అన్నారు. బుధవారం మధ్యాహ్నం సబ్బవరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండవ విడత నిధులు విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి మరియు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. ముందుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ ప్రసంగాలను వీక్షించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అటవీ భూమి సాగుదారు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ -పి.ఎం కిసాన్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 14000 రూపాయలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 6000 రూపాయలు కలిపి సంవత్సరానికి 20000 చొప్పున పెట్టుబడి సహాయం రైతులకు అందజేస్తామన్నారు. సూపర్ 6 కార్యక్రమం లో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చే 21 వ విడతగా పిఎం కిసాన్ నిధులు 2000 చొప్పున మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ చే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రెండవ విడతగా 5000/- రూపాయలు కలిపి మొత్తం 7000/- రూపాయలు జిల్లాలో 2,42,480 మంది రైతుల ఖాతాలో రూ 158.4 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే విధంగా వ్యవసాయ యాంత్రికరణ లో భాగంగా 2025- 26 సంవత్సరం గాను 50% రాయితీపై వివిధ రకాల వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు రైతులకు రాయితీతో పారదర్శకంగ అందజేసేమన్నారు. ఈ వ్యవసాయ యాంత్రికరణ ను ప్రతి రైతు సద్వినియోగం పరుచుకునే లాగా ఉండాలని అలాగే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

స్థానిక శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ రైతు సోదర సోదరీమణులకు చేతులెత్తి నమస్కారం తెలుపుతూ రైతే రాజు కావాలని అని కొనియాడారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండవ విడత నిధులు కింద పెందుర్తి నియోజక వర్గంలో 18,606 మంది లబ్ధిదారులు గాను 12.35 కోట్ల రూపాయలు నిధులు రైతులు బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు.

ఖరీఫ్ సీజన్లో పెట్టుబడి సహాయంగా అన్నదాత సుఖీభవ పథకం ఉద్దేశం అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రెండవ విడతలో అర్హత గల ప్రతి రైతుకు రూ.7,000 జమ చేసిందన్నారు.మూడు విడతల్లో రూ.20,000 రైతులు ఖాతాలకు జమ చేయడల జరుగుతుందన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ బృహత్తర కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాం. వ్యవసాయ అనుబంధ శాఖలో పరిజ్ఞానం రైతులకు అందిస్తూ క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రతి మంగళ, బుధవారాల్లో రెండు రోజులు రెండు గ్రామాలు చొప్పున రబీ లో 4 నెలలు నిర్వహిస్తున్నాం అన్నారు.

అనంతరం జిల్లా మరియు పెందుర్తి నియోజకవర్గం స్థాయి రెండు నమూనా చెక్కు లను జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి స్థానిక శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త, సహాయ సంచాలకులు ఎం. ఆశాదేవి, సి.హెచ్ సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు రామామణి, అనిత, తహసీల్దార్ చిన్ని కృష్ణ, ఎంపీడీఓ పద్మజ, ఎం.పి.పి బి.సూర్య కుమారి, ఏవో పోతల సత్యనారాయణ స్థానిక ప్రజా ప్రతినిధులు, వైస్ ఎంపీపీ సర్గడం జాన్సీ రాము, ఎం లక్ష్మీ కొండాజి,ఇందలి వెంకటరమణ, రాష్ట్ర కనీస వేతనాలు డైరెక్టర్ బలిరెడ్డి అప్పారావు, కన్నూరు వెంకటరమణ, కర్రి కనకరాజు, గొంప నర్సింగరావు, గొర్లి కుమార్ స్వామి, బంతికోళ్ల పద్మ,కొల్లి కృష్ణ, పల్ల వెంకట రమణ, ఆకుల గణేష్,పెద్ద ఎత్తున రైతులు, మహిళలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



## చొంపి అప్పలస్వామి మృతి కుటుంబానికి తీరని లోటు

### సిపిఎం,గిరిజన సంఘం నేతలు నాయకుల సానుభూతి

**హుకుంపేట నవంబర్ 19 (మనసులో మాట)..** హుకుంపేట మండల కేంద్రంలోని సిపిఎం కాలనీలో నివసిస్తున్న చొంపి అప్పలస్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విచారకరమని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో అప్పలస్వామి ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోవడం స్థానికులలో కూడా తీవ్ర దిగ్భ్రాంతి నెలకొల్పింది. గురువారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన పార్థివ దేహానికి పలువురు నాయకులు, ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్పిటిసి ఈసరి గంగరాజు, విజయనగరం జోనల్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం తదితరులు పాల్గొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ అప్పలస్వామి మృదుస్వభావి, మంచి మనసున్న వ్యక్తి అని, సామాజిక సేవ పట్ల ఎల్లప్పుడూ ఆసక్తి చూపేవారని గుర్తుచేశారు. ముఖ్యంగా 2002%-%2003 కాలంలో సిపిఎం పార్టీ కార్యకర్తగా అనేక ఉద్యమాల్లో, ప్రజాపోరాటాల్లో చురుకుగా పాల్గొన్నట్టు చెప్పారు. హుకుంపేట మండలంలో రైతుల సమస్యలు, భూ హక్కుల పోరాటాలలో ఆయన భార్యతో కలిసి ఆద్యంతం శ్రమించి పనిచేశారని పేర్కొన్నారు.

అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ అప్పలస్వామి అకాల మరణం కుటుంబానికి మాత్రమే కాదు, పార్టీకి, గ్రామానికి కూడా తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. జీవితంలో ఎంతో కష్టపడి కుటుంబాన్ని ముందుకు నడిపిన సమయంలో ఈ విషాదం సంభవించింది అనడం బాధాకరం అన్నారు. స్థానికులు కూడా ఆయన మరణాన్ని సంతాపంతో స్మరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి కృష్ణారావు, గిరిజన సంఘం నాయకులు కిల్లో రామారావు, దురు కృష్ణమూర్తి,జి ఆనంద్ నాయకులు ఉపాధ్యాయులు. అభిమానులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ..మా గ్రామాలకు తారు రోడ్డు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్న గ్రామస్తులు..




**పెదబయలు (మనసులో మాట) నవంబర్ 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం,ఇంజరి పంచాయతీ,గబుడు పుట్టు,గ్రామంలో నేటికీ స్వాతంత్రం వచ్చినప్పుడు నుండి తారు రోడ్డు లేకపోవడంతో,చాలా ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నప్పటికీ రాష్ట్రపతి ద్రౌపతి మురుము ఆధ్వర్యంలో పి టి జి గ్రామాలకు రోడ్డులు వేయాలని ప్రభుత్వాలకు ఆదేశించడంతో. ఈరోజు మా గ్రామానికి తారు రోడ్డు వెయ్యటానికి ప్రధాన కారణమైన లిరాష్ట్రపతి మురుము మా గ్రామస్తులందరూ కూడా రుణపడి ఉంటామని చెప్తూ ఆనందము వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,కె. కేశ్వరరావు మాజీ వర్డ్, నెంబర్ , కె.జీవన్ మాజీ సర్పంచ్ వి.కామేశ్వరావు. వీఆర్పీ పి కె.విజయ్ ఇంజరి వైస్సార్సీపీ యూత్ విభాగం కమిటీ సభ్యులు పి.కిరణ్, సీఎంల్ నాయకులు .రత్నం టీడీపీనాయకులు. వి.సుభాన్,నూకరాజు,భూపతి, వి జగన్,ఇంజరి ఎంపీటీసీ పి.సత్యవతి వైయస్సార్సీపి నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జడ్పీ టీసీ నిధులతో డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన


### ప్రారంభోత్సవ పనులకు కూటమి నాయకులు, వివిధ పార్టీల నాయకులు



**గూడెం/సీలేరు నవంబర్ 19:(మనసు లో మాట)..** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం, రింతాడ పంచాయితీ.గొడిచింత గ్రామం లో జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు. రింతాడ పంచాయితీ అధ్యక్షులు. కొయ్యం. ఇమ్మానుయేల్. (సిద్దు) ఆధ్వర్యంలో గ్రామంలో కొత్తగా మంజూరు అయిన జడ్పీటీసీ నిధులతో డ్రైనేజ్ ప్రారంభోత్సవ పనులకు శంకుస్థాపన చేయటం జరిగింది గొడిచింత గ్రామంలో 75 మీటర్లు . 3 లక్షలతో మంజూరు చేయటం జరిగింది డ్రైనేజీ మంజూరు చేసినందుకు కూటమి ప్రభుత్వం నికి గ్రామ ప్రజాలు ధన్యవాదములు తెలుపుకున్నారు . ఈ కార్యక్రమం లో సర్పంచ్. బొబ్బిలి లక్ష్మి. కూటమి నాయకులు టీడీపీ మండల అధ్యక్షులు పొత్తురు. కొండలరావు.రింతాడ పంచాయితీ ప్రధాన కార్యదర్శి గబులంగి. గణేష్ టీడీపీ ప్రధాన కార్యదర్శి.పసుపులేటి నాగమణి.మార్కెట్ డైరెక్టర్. మొట్టడం.శర్బన్నదొర.టీడీపీ పంచాయితీ క్లస్టర్ ఇంచార్జ్ . వాడేలా. పాండు.సాగిన బ్రాహ్మజీ పాడల్. జనసేన పార్టీ. యువనాయకులు.కొర్ర రాజు. జనసేన పార్టీ యూత్ అధ్యక్షులు.గుండ్ల రఘువంశి జనసేన పార్టీ. ఉపాధ్యక్షులు. వంచుల.పాంగి శ్రీను జనసేన పార్టీ వంచుల.పంచాయితీ. ప్రధాన కార్యదర్శి. సాగిన. భీమేష్ పాడల్. టీడీపీ.గబ్రియేల్ టీడీపీ. సీనియర్ నాయకులు బూడిద. సోమలింగం. టీడీపీ సీనియర్ నాయకులు.బొబ్బిలి వెంకట్రావు.ఎంపీపీ. బోయిన కుమారి.వైసీపీ అరుణ్ కుమార్. బాబీ.కొయ్యం లక్ష్మణరావు.వార్డ్ (మెంబర్.) కొయ్యం. రాంబాబు. సత్యారావు. సతీష్. ధనర్జున్. శివాజీ ధరబాబు. గ్రామస్తులు పాల్గున్నారు.

## గోమంగి కేంద్రంగా
# నూతన మండలం ఏర్పాటు చేయాలి

### జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన గోమంగి మండల సాధన సమితి...



**పెదబయలు నవంబర్ మనసులో మాట:** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గోమంగి పంచాయతీ వన్నడ గ్రామంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సందర్శించిన సందర్భంగా గోమంగి కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని గోమంగి మండల సాధన సమితి నాయకులు వినతి పత్రం మర్యాదపూర్వకంగా అందజేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తెలియజేస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గోమంగి పంచాయతీ సర్పంచ్ కొర్ర జెట్టో( సత్తిబాబు), ఎంపిటిసి పురుషకరి భాస్కరరావు, గోమంగి పంచాయతీ టీడీపీ అధ్యక్షులు గంపరాయి ధనుంజయ్, గోమంగి మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం, గోమంగి ఉపసర్పంచ్ కూడా మత్య కొండబాబు, గోమంగి వైసిపి యువ నాయకులు గంపరాయి రవి వర్మ, పాంగి అన్నాజీ, కామేష్, టిడిపి నాయకులు కుంబిడి మేఘరాజు, వైసీపీ యంగ్ లీడర్స్ గంపరాయి అచ్చిబాబు, గంపరాయి కార్తీక్ రాజ్, కూడా మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక స్పృహతోనే బంగారు భవిష్యత్తు




**డుంబ్రిగుడ, నవంబర్ 19 (మనసులో మాట):** సామాజిక స్పృహ కలిగి నడుచుకుంటే బంగారు భవిష్యత్తుకు పునాదులు ఏర్పరచుకోవడానికి దోహదపడుతుందని అరకు సీఐ హిమగిరి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల్లో అప్రమత్తతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అన్నదమ్ములు, బంధువులను ప్రోత్సహిద్దామన్నారు. కళాశాల స్థాయిలో సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి తల్లిదండ్రులను చైతన్య పరచాలని ఆయన కోరారు ఎస్సై పాపినాయుడు ప్రిన్సిపల్ వెంకటస్వామి నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నవసమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి

### కర్రోతు సత్యం

**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 19:** నేటి యువత మహాత్మా గాంధీ ఆశయాలను అంది పుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి పట్టణ అధ్యక్షులు కర్రోతు సత్యం అన్నారు.బుధవారం కలెక్టరేట్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళు లార్పించారు. డి ఈ ఒ కార్యాలయంలో మధ్యాహ్నం భోజన పథకం ఇంచార్జి అధికారిగా పనిచేస్తున్న కర్రోతు సత్యం ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి, విజయనగరం పట్టణ శాఖ కు అధ్యక్షులుగా ఎంపిక అయినందుకు సంస్థ సభ్యులు ఏడిద వీర్రాజు, చింత నాగేశ్వరావు, శొంఠి కామేశ్వరరావు, బాల భాస్కరరావు, తోటి ఉద్యోగస్తులు, దుస్సాలువతో సత్కారం చేసారు.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సత్యం, శాంతి, అహింస వైపు నడవాలని, స్వాతంత్ర సమరయోధుల ఆశయాలను అలవార్చుకుని నవ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు.ఈ సంస్థకు ప్రధాన కార్యదర్శిగా మజ్జి కాంతారావు, ఉపాధ్యక్షులుగా ఏడిదా వీర్రాజు, కోశాధికారిగా బి వి రామనా రావు, తదితరులు ఎంపిక అయ్యారు.

## తుపాన్‌తో కొట్టుకుపోయిన రహదారి ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆవేదన



**హుకుంపేట నవంబర్ 19 (మనసులో మాట)..** హుకుంపేట మండలం లోని బూర్జ పంచాయతీ మారుమూల పటకదవడ పిటిజీ గ్రామ రహదారి తుపానుకు తీవ్రంగా దెబ్బతింది. అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్ బియ్యం తెచ్చుకోవడం, అత్యవసర సేవలు పొందడం, గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో వయ్యా%-%జాకరవలస%-%తుంబనవలస%- %పటకదవడ పిటిజీ వరకు రహదారి నిర్మాణానికి కోట్లు రూపాయలు మంజూరు చేసినప్పటికీ, ఇంజినీరింగ్ అధికారుల అజాగ్రత్త, గుత్తేదారుల నిర్లక్ష్యం వలన పనులు మధ్యలోనే ఆగిపోయాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సుమారు 8 కిలోమీటర్ల రహదారి పూర్తయితే పటకదవడ పిటిజీ గ్రామానికి శాశ్వత రహదారి దొరకడంతో పాటు, బూర్జ పంచాయతీ కేంద్రంతో అనుసంధానం సులభమయ్యేదని వారు చెబుతున్నారు. బూర్జ పంచాయతీ హుకుంపేట మండల కేంద్రానికి 60%-%70 కిలోమీటర్లు, జిల్లా కేంద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అభివృద్ధిలో తీవ్ర వెనుకబాటు ఎదురవుతోందని గ్రామస్థులు వేదన చెందుతున్నారు. పంచాయతీలో సచివాలయం, సీసీ రోడ్లు, సెల్ టవర్లు, త్రాగునీటి పథకాలు, ప్రభుత్వ భవనాలు వంటి అనేక సదుపాయాల లోటు ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు పర్యటించిపెండింగ్ ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### శ్రీ మత్స్య మాడుగులమ్మ తల్లి చెరువును కబ్జాకు గురికాకుండా
# అధికారులు దృష్టి సారించాలి



**జి మాడుగుల, నవంబర్ 19 (మనసులో మాట )..** జి మాడుగుల. మండల కేంద్రంలో శ్రీ మత్స్య మాడుగులమ్మ తల్లి చెరువు ద్వారా పంట పొలాలకు గ్రామంలో గల బోరు బావి లకు నిత్యం నీరు ఉండడం కోసం గ్రామ పెద్దల సమక్షంలో తీర్మానం చేసి ఉన్నారు. ఆ చెరువులో నీరు నిల్వ చేయడం ద్వారా దిగువ పొలాలకు పండించుటకు ఉపయోగపడేది. ఇటీవల కాలంలో చెరువు పూడిక తీయకపోవడం వల్ల నీరు నిల్వ ఉండటం లేదు. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది గిరిజనేతరులు ఎవరి అనుమతులు లేకుండా చెరువు ఇరువైపులా కబ్జా చేయడం జరుగుతుంది.దీనిని గమనించిన గ్రామస్తులు, యువత సర్పంచ్ కిముడు రాంబాబు , ఎంపీటీసీ మత్స్య రాస విజయ కుమారి ద్వారా ఎమ్మార్వో గారికి ఫిర్యాదు చేశారు. తక్షణమే వారిని అక్కడ నుండి ఖాళీ చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో. ఎం. నాగరాజు. కెవిఎస్ఎస్ వరప్రసాద్ ఎం నారాయణ రాజు, కిముడు వరహాల దొర, ఎల్. నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పదిమంది విద్యార్థినులు డిశ్చార్జ్

### అబ్జర్వేషన్ లో నలుగురు విద్యార్థినిలు ఏటీడబ్ల్యూఓ వెల్లడి



**కొయ్యూరు నవంబర్ 19 (మనసులో మాట):** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోని రాజేంద్రపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు ఇటీవల నాలుగు రోజుల క్రితం అస్వస్థతకు గురై ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స నిమిత్తం జాయిన్ అయ్యారు. వారిలో నిన్న 34 మంది డిశ్చార్జ్ అవగా ఇంకా 14 మందిని అబ్జర్వేషన్ లో ఉంచారు. వీరిలో ఈరోజు 10 మందిని డిశ్చార్జ్ చేయడం జరిగిందని ఇంకా హాస్పిటల్ లో నలుగురు విద్యార్థినిలు అబ్జర్వేషన్ లో ఉన్నారని ఏటీడబ్ల్యూఓ క్రాంతి కుమార్ తెలిపారు.

## అంతకాపల్లి నేచర్ రిసార్ట్స్ లో అఘోర రుద్రుడు, వెంకటేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ట



**సబ్బవరం, నవంబర్ 19,( మనసులో మాట):**పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి. అదీప్ రాజ్ కు చెందిన అంతకాపల్లి పంచాయతీ పరిధిలో గల నేచర్ రిసార్ట్స్ లో మహాశివుని రూపమైన అఘోర రుద్రుడు, శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి పార్లమెంట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకు రాలు మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి హాజరయ్యారు. వేద పండితులు మాత్రం చేరినల మధ్య ముందుగా హెూమాలు నిర్వహించారు.

అనంతరం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు అన్నమరెడ్డి అదీప్ రాజ్ దంపతులు, చేతులమీదుగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మీడియాతో అదీప్ రాజు మాట్లాడుతూ కార్తీక మాసం ఆఖరి అమావాస్య ఎంతో పవిత్రమైందని, ఈ లగ్నంలో మహాశివుని కార్యక్రమాలు నిర్వహిస్తే పుణ్యం , హుషార్ధం లభిస్తుందని భావిస్తున్నామన్నారు.

ఆ సంకల్పంతోనే ఇక్కడ మహాశివుని ప్రతిరూపమైన అఘోర రుద్రుడు విగ్రహాన్ని, కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టమన్నారు.

శోభా హైమావతి మాట్లాడుతూ, ఎంతో మంచి సంకల్పంతో మాజీ అదీప్ రాజ్ చేపట్టిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరవటం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, దంతులూరి దిలీప్ కుమార్, , చొప్ప నాగరాజు, ఎంపీపీ బో కం సూర్య కుమారి రామునాయుడు, కోటాన రాము,కర్రి బాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజు,మాజీ ఎంపీపీ ఎస్ ముత్యాల నాయుడు, ఆ గ్రామ సర్పంచ్ ఎస్ నారాయణమూర్తిలు పాల్గొన్నారు.

అనంతరం స్వామి అయ్యప్ప దీక్ష భక్తులకు, అతిథులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.



## కలకలంలో జనసేన పార్టీ నాయకుడు
# సుందరపు విజయ్ కుమార్

**అచ్చుతాపురం (మనసులో మాట)నవంబర్ 19 :** ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీకి 2019 ఎన్నికల కంటే కొద్దిరోజుల ముందు చేరారు. అయితే 2024 విజయం తర్వాత పార్టీ కోసం రోజుల నుంచే శ్రమించిన కార్యకర్తలను పక్కన పెట్టినట్టుగా సీనియర్ జనసేన నాయకులు, క్యాడర్ బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కష్టపడ్డ వారిని విస్మరించి, ఇటీవల వైసీపీకి చెందిన నాయకులను చేర్చుకోవడం వలన క్యాడర్‌కు మింగుడు పడలేదు. టిడిపిలోకి రావాలని ఎదురు చూసిన కొన్ని వైసీపీ నాయకులను చేర్చొద్దని కూటమి అధినాయకత్వం స్పష్టంగా చెప్పినప్పటికీ, జనసేన ఎమ్మెల్యే సుందరపు చేర్చుకోవడం జనసైనికుల్లో తీవ్ర అసహనం కలిగించింది. “ముందు వచ్చిన చెవుల కంటే వెనక వచ్చిన కొమ్ములు పెద్దవయ్యాయా?” అన్నట్టుగా వారు విమర్శిస్తున్నారు. పవన్ కళ్యాణ్ 2019లో పోటీకి సుందరపుకు బీ-ఫారం ఇచ్చారు. ముక్కోణపు పోటీలో ఆయనకు సుమారు 19,500 ఓట్లు వచ్చాయి. ఆ సమయంలో టిడిపి అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు, వైసీపీ అభ్యర్థి యువి రమణమూర్తి రాజుతో ఎన్నికలు ఉత్కంఠభరితంగా జరిగాయి. పంచకర్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. జనసేన మూడో స్థానానికి పడిపోయింది. 2024లో కూటమి భాగంగా పవన్ కళ్యాణ్ ఎలమంచిలి జనసేన అభ్యర్థిగా సుందరపును ప్రకటించడంతో టిడిపి-బిజెపి-జనసేన మూడు పార్టీలు కలిసి పోటీలో నిలిచాయి. కూటమి వేవ్‌తో సుందరపు విజయ్‌కుమార్ 48 వేల మెజార్టీతో గెలుపొందారు. గెలుపు తర్వాత మాత్రం పరిస్థితి వేరేలా మారిందని క్యాడర్ ఆరోపిస్తుంది. కూటమిలో ఉన్న టిడిపి, బిజెపి నాయకులను, మొదటి నుంచే పనిచేసిన జనసేన కార్యకర్తలను పక్కన పెట్టి, వైసీపీకి చెందిన కొంతమందిని కండువా వేసి గ్రామాల్లో నాయకులుగా ముందుకు తెస్తున్నారని అంటున్నారు. దీంతో గతంలో పార్టీ కోసం కష్టపడ్డవారిలో తీవ్ర నిరాశ నెలకొంది.

ఇటీవలి భోగాపురం భూ వివాదాల నేపథ్యంలో జనసేన క్యాడర్‌లో మరింత అనుమానాలు తలెత్తాయి. వైసీపీ నాయకులను చేర్చుకోవడం వల్లనే ఇంటిగుట్టు లంకకు చేరినట్టుగా, ఈ భూ వివాదాల్లో ఎమ్మెల్యే సుందరపును ఉద్దేశపూర్వకంగా లాగుతున్నారని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇలా కొనసాగితే స్థానిక ఎన్నికల్లో పార్టీకి నష్టం తప్పదని సీనియర్ నాయకులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే సుందరపు భూ వ్యవహారాల్లో ఉండడం వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోందని కార్యకర్తలు స్పష్టంగా చెబుతున్నారు. సెటిల్‌మెంట్లు, గ్రావెల్ తవ్వకాల విషయంలో ఆయన సోదరులు సతీష్‌కుమార్, రవికుమార్ పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల నియోజకవర్గ ప్రజల్లో భయం, ఆందోళన పెరిగింది. వీరిని ఎదిరిస్తే కేసులు పెడతారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల సీఐ నమ్మి గణేష్, మండల తహసీల్దార్ ఏస్. సత్యనారాయణకు జరిగిన బదిలీ కూడా ఇదే నేపథ్యంలో జరిగిందని ప్రజలు అనుకుంటున్నారు. పవన్ కళ్యాణ్ స్పందన కారణంగా పరిణామాలు వేగంగా మారుతున్నాయని స్థానికులు భావిస్తున్నారు.

## తిరుమల శ్రీవారి సేవలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ



**మునగపాక, నవంబర్ 19, మనసులో మాట...** బుధవారం ఉదయం తెల్లవారుజామున తిరుమల శ్రీ వారి సన్నిధిలో తోమాల సేవలో పాల్గొని స్వామి వారికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలు అందరూ బాగుండాలని ప్రజలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ వేంకటేశ్వర స్వామి ని వేడుకోవడం జరిగిందని సాయి కృష్ణ తెలిపారు

# గ్రంథాలయంలో పాటల పోటీలు

**దుంబ్రిగుడ, నవంబర్ 19, (మనసులో మాట):** బాలల దినోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాఖ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గ్రంథాలయ అధికారిణి శెట్టి, సునీత ఆధ్వర్యాన బుధవారం పాటల పోటీలను నిర్వహించారు. బాలికల పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల ఆధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థినికులు దేశభక్తి పాటలను పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యాపకులు కమలాకర్, దివాకర్, ఉపాధ్యాయిని సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా
# మామిడి బాబురావు,సూర్రెడ్డి జగ్గుబాబు ఏకగ్రీవ ఎన్నిక



**అనకాపల్లి, నవంబర్ 19 (మనసులో మాట):** అనకాపల్లి, సిఐటియు కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అనకాపల్లి మండల శాఖ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గా మామిడి బాబురావు, సూర్రెడ్డి జగ్గుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి అధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో ఎన్నికలాధికారిగా జిల్లా కోశాధికారి జోగా రాజేష్, ఎన్నికల పరిశీలకులు గా రొంగలి అక్కునాయుడు వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిరంతరం పోరాటాలు చేస్తుందని, పిఆర్సి కమిషన్ వేయించడానికి ప్రస్తుతం పోరాటం చేయవలసి వస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితి గత 50 సంవత్సరాల్లో ఎప్పుడూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ప్రస్తుత ప్రభుత్వం బకాయిలను దప దపాలుగా క్లియర్ చేస్తున్నప్పటికీ ఇంకా వేల కోట్ల బకాయిలు ఉపాధ్యాయు లకు రావలసినవి పెండింగ్లో ఉన్నాయని అన్నారు. అదేవిధంగా బోధనేతర పనులు ఉపాధ్యాయులకు దూరం చేయాలన్నారు. తదనంతరం మండల కార్యవర్గాన్ని, మండల కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా మల్లారెడ్డి శంకర్ ప్రసాద్, అధ్యక్షులుగా సూరెడ్డి జగ్గు బాబు, సహధ్యక్షులుగా వందనాల పావని, వై. రాము, ప్రధాన కార్యదర్శిగా మామిడి బాబురావు, కోశాధికారిగా కొమ్మిజు సత్యవేణి , ఆడిట్ కమిటీ కన్వీనర్ గా తేజ్ వర్ధన్ , మండల కార్యదర్శిలు గా పి. రమణ, రాజేశ్వరి, శ్రీనివాస్, జగన్నాథం, జిల్లా కౌన్సిలర్లుగా సూచికొండ ఝాన్సీ, బి.వి సత్యనారాయణ, అర్జున్, రామాంజనేయులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వ అధ్యక్షులు జికెఆర్ స్వామి, అలివేలు, ఆశ, చింతాడ వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆక్యుపంక్చర్ వైద్యంపై అవగాహన
# 33వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**చింతపల్లి. నవంబర్.19 (మనసులో మాట)** జాప్ ఫౌండర్ ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు రవితేజ,వారి ఆధ్వర్యంలో 33వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం నాడు అల్లూరి సీతారామరాజు జిల్లా, జి. కె. వీధి (మండలం) పరిధిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్( ప్రభుత్వ హాస్పిటల్) ఆర్. వి. నగర్ వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో నాడీ వైద్యాన్ని (ఆక్యుపంక్చర్) గురించి మరింత అవగాహన కల్పించడానికి, ఈ ప్రాచీన వైద్య విధానం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హాస్పిటల్ లో రోగులకు రొట్టెలు, పళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆక్యుపంక్చర్ అనేది ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) లేకుండా అనేక దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే సమర్థవంతమైన వైద్య విధానమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా, స్థానిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది,ప్రజలకు ఆక్యుపంక్చర్ ద్వారా లభించే ప్రయోజనాలు, చికిత్సా విధానాలు, మరియు ఆరోగ్య సంరక్షణలో దాని పాత్ర గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు స్థానిక పత్రికేయులు పనసల చిట్టిబాబు, సాగిన లక్ష్మణరావు, గబ్లంగి హనుమాంతురావు,రీమల సాగర్, వార్త పత్రిక శివ, లంబసింగి రాజు, ప్రజాశక్తి పత్రిక చిన్న, రాజు,మరి కొందరు పత్రికేయులు, హాస్పటల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఆరోగ్య కేంద్ర సిబ్బందికి, అల్లూరి జిల్లా యూనియన్ పత్రికేయుల నుండి హాస్పిటల్ సిబ్బంది కి కృతజ్ఞతలు తెలిపారు.

# దేశాభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశంపై అవగాహన



**నర్సీపట్నం ,నవంబర్ 19 (మనసులో మాట)** నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని దేశాభివఅద్ధిలో మహిళల పాత్ర అనే అంశంపై మహిళలతో అవగాహన సదస్సును గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ హాజరై ముందుగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇందిరమ్మ జీవితం ఎంతో ఆదర్శమన్నారు. యుక్త వయసులోనే యువత ఉన్నతంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బివి. పద్మావతి మాట్లాడుతూ మహిళ సర్వత అభివఅద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు) ప్రిన్సిపల్ ఎ.శోభమాట్లాడుతూ భారతదేశ మహిళా ప్రధాని ఇందిరాగాంధీ స్త్రీ శక్తికి నిదర్శమని, ఎన్నో రంగాలలో రాణించగలుగుతున్నారంటే ఇందిరాగాంధీ జీవితమే వారికి ఆదర్శమన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు) హిందీ ఉపాధ్యాయురాలు ఎం.రాఘవ కుమారి మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి రాజ్యాంగంలో ఎన్నో అవకాశాలు కల్పించబడ్డాయన్నారు. మహిళా పోలీస్ సిహెచ్. భవాని మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలను వినియోగించుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. పోటీ పరుక్షలకు సిద్ధపడుతున్న కుమారి కావ్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధి పథంలో స్త్రీ శక్తి ఎంత విలువైనదో ఉదాహరణలతో వివరించింది. గ్రంథాలయాధికారి పి.దమయంతి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థినులకు రంగపల్లి పోటీలు నిర్వహించారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
## మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాం



**మునగపాక,(మనసులో మాట) నవంబరు 19..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇచ్చిన హామీలు మేరకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదును క్రమం తప్పకుండా రైతులు ఖాతాలకు వేయడం జరుగుతుందని, రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రైతులకు సేవలు అందిస్తుందని మునగపాక పిఎసిఎస్ అధ్యక్షులు నర్సింగరావు అన్నారు. అన్నదాత సుఖీభవ రెండవ విడత రూ. 5000 మరియు పిఎం కిసాన్ 21 వ విడత రూ.2000 రైతుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుంది. ఈ యొక్క కార్యక్రమాన్ని మునగపాక గ్రామ సచివాలయం నందు ప్రసారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాము, మునగపాక గ్రామ టిడిపి అధ్యక్షుడు దాడి శివ, రైతు సంఘం నాయకుడు ఆడారి లక్ష్మణరావు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు, పెంటకోట శ్రీరామమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు బిలాలక్ష్మణరావు రైతులు, రైతు సంఘం నాయకులు, కూటమి నాయకులు, గ్రామస్తులు అందరూ వచ్చి ఈ యొక్క కార్యక్రమాన్ని వీక్షించడం జరిగింది. మరియు పొందడం ఈ యొక్క డబ్బులు రైతులకు అందిన తరుణంలో రైతులు తమ యొక్క సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# అనకాపల్లి సాహితీ మిత్రుల అధ్వర్యాన కవి సమ్మేళనం



**అనకాపల్లి, నవంబర్ 19 (మనసులో మాట):** అనకాపల్లి శాఖవీధి లోని శాఖా గ్రంథాలయ ప్రాంగణంలో బుధవారం 58వ జాతీయ గ్రంథాలయవారోత్సవా లలో భాగంగా అనకాపల్లి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ముందుగా ప్రముఖ కథా రచయిత సంస్థ కన్వీనర్ గొంతిన రంగబాబు అధ్యక్షతన సాహితీ సమావేశం జరిగింది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గ్రంథాలయ ఉద్యమం సాగిందని,అందరిని ఒక చోట చేర్చి నిర్ణయాలు తీసుకొనే అవకాశం కలగజేసేది గ్రంథాలయమని శారదా గ్రంథాలయం అధ్యక్షులు కోరుకొండ బుచ్చిరాజు విశదపరిచారు. గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకుల మనో వికాసానికి కృషిచేస్తూ జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రోత్సహించటం జరుగుతుందని జిల్లా గ్రంథాలయాల కార్యధర్శి బుర్రి కుమారరాజు అన్నారు. అనంతరం శాఖాగ్రంథాలయాధికారి కె. శ్రీనివాసరావు వారోత్సవాల నివేదిక సమర్పించారు. తదనంతరం సాహితీ మిత్రుల గౌరవ కార్యదర్శి కోరాడ అప్పలరాజ కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాధికారి కె. శ్రీనివాసరావు కవులను ఘనంగా సత్కరించారు. గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ, వారోత్సవాల నిర్వాహకులు, సిద్దార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బళ్ళా నాగభూషణం తదితరులు హజరయ్యారు. కవి సమ్మేళనం లో కవులు పి.అమరజ్యోతి, భీశెట్టి అనంతరావు జి.ఎల్.ఎన్.శాస్త్రి, డాక్టర్ చక్రపాణి, మాధవీ సనారా, జి.రంగబాబు, కర్రి మల్లీశ్వరి, జి.ఎస్.కె.సాయిబాబా, కోరాడ అప్పలరాజు, వజ్రపు త్రినాథరావు, అంజనా సాత్విక, ఆర్.వి.ఎల్. గాయత్రి,కె.ఎన్.ఇ. శ్రీనివాసరావు, పెతకంశెట్టి ఆదికోటి, స్వాతికృష్ణ సన్నిధి,ఘాలి లలితా ప్రవల్లిక, శ్లిష్టా తమ్మిరాజు, బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



## తుఫాన పోయి నెల అవుతున్న
# అందని పరిహారం

అచ్చుతాపురం నవంబర్ 19 మనసులో మాట : తుఫాన్ ప్రభావంతో కొండకర్ల గ్రామానికి చెందిన దొడ్డపూడి వరహాలమ్మ తాటికమ్మల మిద్దిల్లు పూర్తిగా కూలిపోయింది. అధికారులు వచ్చి వివరాలు నమోదు చేసి వెళ్లారు. కానీ ఇప్పటికీ ఎలాంటి నష్టపరిహారం అందలేదు. ప్రజా సంఘాలు ఈ నిర్లక్ష్యాన్ని నేరుగా ఎత్తిచూపుతూ, వెంటనే పరిహారం విడుదల చేయాలంటూ డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రీ అప్పారావు, నిర్వాసితుల సంఘం నాయకుడు బుద్ధ రంగారావు, సిఐటియు మండల కన్వీనర్ కొండ్రపు సోము నాయుడు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయి బాబా జయంతి వేడుకలు



చీడికాడ నవంబర్ 19, (మనసులో మాట) మండలంలో అప్పలరాజు పురం శ్రీ లలితాదేవి వృద్ధాశ్రమంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా సి డి సి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం వృద్ధాశ్రమం నిర్వాహకురాలు యాళ్ల వెంకటలక్ష్మి దుప్పట్ల కంచాలు సమకూర్చారు వీటినిగ్రామానికి చెందిన 50 మంది నిరుపేదలకు గ్రామానికి చెందిన నిరుపేదలకు సి డి సి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు కోప్షన్ సభ్యులు ఫేక్ సూర్యనారాయణ వైసీపీ నాయకులు సుంకర కొండబాబు పాల్గొన్నారు

## మునగపాక లో డంపింగ్ యార్డ్ లో చెత్తను రీసైక్లింగ్ పరిశ్రమలకు తరలించండి మహాప్రభో



**మునగపాక, నవంబర్ 19, మనసులో మాట...** మునగపాక మండలం మునగపాక గ్రామంలో యాతపేట డబ్బింగ్ యాడ్ ఉన్నది. గ్రామపంచాయతీ కార్మికులు గ్రామంలోని అన్ని వీధుల నుండిచెత్తను సేకరించి డబ్బింగ్ యాడ్లో వేయడం జరుగుతుంది. ఆ చెత్తను రీసైక్లింగ్ పరిశ్రమలకు పంపించకుండా ఆ చెత్తను ఇక్కడే కాల్చివేస్తున్నారు. అలా కాల్చడం వల్ల చాలా కాలుష్యం జరుగుతుంది. యాతపేట వాసులంతా ఊపిరాడక చాలా ఇబ్బందులు పడుతున్నారు. శ్వాస కోస వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు. చాలా ఇబ్బంది పడడం జరుగుతుంది . పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ అధికారులువీటిపై తగు చర్యలు తీసుకునేలా అందరూ సహకరిస్తారని శెట్టిబలిజ కాలనీవాసులు వేడుకుంటున్నారు.

## ఘనంగా రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్
# మహేష్ జన్మదిన వేడుకలు
## కే.కోటపాడు టిడిపి పార్టీ కార్యాలయంలో సంబరాలు

**కే కోటపాడు, నవంబరు 19 ( మనసులో మాట)..** రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్, కోటపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రొంగలిమహేష్ జన్మదిన వేడుకలు బుధవారం ఉదయం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల మధ్య ఘనంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తరలి వచ్చి జన్మదినం శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు.



అనంతరం కేక్ కటింగ్ జరిపారు. మండల తెలుగుదేశం పార్టీ యూత్ అధ్యక్షుడు కర్రినాయుడు సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్క కార్యకర్తకు అందుబాటులో ఉంటూ తగిన సహకారం అందిస్తానని చెప్పారు.

# మర్యాద పూర్వకంగా...



**గూడెం/సీలేరు నవంబర్ 19:(మనసు లో మాట).** ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ వారికి అభినందిస్తూ గిరిజన ప్రాంతానికి మీరు చేస్తున్న సేవలు గొప్పవని అన్నారు. యువత మార్పు కోసం మీరు చేస్తున్న కృషి ఎన్నలేనిదని కొనియాడారు సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న మీలాంటి అధికారులను గౌరవించడం స్థానిక నాయకులుగా మా బాధ్యత అని అన్నారు సమాజ మార్పు కోసం చేస్తున్న మీ పనిలో మా సహకారం ఎప్పుడూ ఉంటుంది అని అన్నారు సర్కిల్ ఇన్స్పెక్టర్ గారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో యువత ఆ సాంఘిక కార్యపాలపాలకు బానిసలై (జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు ) వివిధ రంగాలలో గిరిజన యువతీ యువకులు ముందుకు రావాలని పోలీస్ శాఖ వారు అనేక విధాలుగా ప్రోత్సహిస్తున్న మాన్నారు. భవిష్యత్తు మీద మరియు సమాజం మీద బాధ్యత యుతంగా యువత ఉండాలని కోరుతున్నన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
గురువారం 20 నవంబర్ 2025


# మళ్లీ వణికిన మన్యం!

- మారేడుమిల్లిలో మళ్లీ కాల్పులు
- ఏడుగురు మావోయిస్టులు మృతి
- ఎన్ కౌంటర్ ను ధ్రువీకరించిన ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేష్ చంద్ర లడ్డా
- మృతుల్లో మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ ఉన్నట్టు సమాచారం
- మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న కూంబింగ్





**మారేడుమిల్లి (మనసులో మాట), నవంబరు 19:** తూర్పు మన్యం మరోసారి వణికింది. బుధవారం తెల్లవారుజామున మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. వీరంతా చత్తీస్‌గఢ్ కు చెందిన వారుగా తెలుస్తోంది. మృతిచెందిన వారిలో మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ ఉన్నట్టు ప్రచారమైతే జరుగుతోంది. అయితే దీనిపై పోలీసులు స్పష్టమైన ప్రకటన చేయలేదు. కాకపోతే ఎన్ కౌంటర్ జరిగిన విషయాన్ని మాత్రం ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేష్ చంద్ర లడ్డా విజయవాడలో ధృవీకరించారు. కాగా మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**మావోయిస్టులను ఏరివేసేందుకు ప్రత్యేక ఆపరేషన్లు..**
రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని, వారిని ఏరివేసేందుకు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని ఏడీజీ మహేష్ చంద్ర లడ్డా తెలిపారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోవాలని ఆయన సూచించారు. నిన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో సెంట్రల్ కమిటీ సభ్యుడు హిడ్మా మద్వీతో పాటు మరో ఐదుగురిని మట్టుబెట్టినట్లు డీజీ వివరించారు. హిడ్మా ఎదురు కాల్పుల్లోనే మరణించారని, ఆయనను పట్టుకుని చంపారనే ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్నట్లు డీజీ తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో మొత్తం 50 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. వీరిలో ముగ్గురు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, 23 మంది ప్లాటూన్ సభ్యులు, డివిజన్ కమిటీ సభ్యులు అయిదుగురు, ఏరియా కమిటీ సభ్యులు 19 మంది ఉన్నారని చెప్పారు. అరెస్టయిన వారి నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో దాడులు పెరగడంతో మావోయిస్టులు ఏపీలోకి ప్రవేశిస్తున్నారని, ఈ క్రమంలోనే పట్టుబడుతున్నారని ఆయన తెలిపారు.

**మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ ఏమయ్యారు?**
పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి ఉన్నారా, ఎన్‌కౌంటర్‌లో చనిపోయారా అనే విషయంపై క్లారిటీ లేదు. ఇంతకు ముందు దేవ్‌జీ.. పోలీసుల అదుపులోనే ఉన్నట్లు ప్రచారం జరిగినా.. ఆయన వివరాలు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. అయితే ఆయన పోలీసుల అదుపులోనే ఉన్నాడని పౌర హక్కుల, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు వాదిస్తున్నారు. తమ అదుపులోకి తీసుకున్న తిప్పిరి తిరుపతి సహా మిగతా మావోయిస్టులను.. పోలీసులు వెంటనే కోర్టులో హాజరుపరచాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పీ సూర్యం డిమాండు చేశారు.



## దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత ఇందిరా

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే యువతకు భవిత
- ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ106 వ జయంతి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** దేశంలో మత సామరస్యం కోసం, యువత భవిత కోసం మళ్ళా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ నాయకులు ఆకాంక్షించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బెజవాడ రంగారావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దేవత సుధాకర్, బీసీ సెల్ చైర్మన్ తాడి సూరిబాబు ఆధ్వర్యంలో బుధవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 106 వ జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళవారపు పేట సాయికృష్ణ థియేటర్ సమీపంలోని పార్కులో ఉన్న ఇందిరా విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇందిరా గాంధి ధైర్యం, త్యాగం అందరికీ ఆదర్శమని కొనియాడారు. దేశంలో అన్ని మతాలు కలిసి మెలిసి ఉండాలంటే దేశంలో మళ్ళీ కాంగ్రెస్ పాలన రావాలని, అప్పుడే అందరికీ సమన్యాయం జరుగుతుందని, యువతకు ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ పార్కును సుందరీకరణచేసి అభివృద్ధి చేయాలని రుడా చైర్మన్ ను కోరుతామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి, సూర్య కుమారి, మాజీ కార్పొరేటర్ భోగిరెడ్డి రాంబాబు, కే ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



**ఏలూరు (మనసులో మాట), నవంబరు 19:** నవంబరు 19 స్థానిక జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్ ను బుధవారం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఈవియం గోడౌన్ వద్ద సిసి కెమేరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఈవియం యంత్రాలు బి.యులు, సియులు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవియం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవియం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామన్నారు.ఎప్పటి కప్పుడు గౌడౌన్ ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవియం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.

## కలవర పడుతున్న 'కోనసీమ'

- రావులపాలెం లో హిడ్మా అనుచరుడు అరెస్ట్ అంటూ ప్రచారం
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలో మావోయిస్టు ల అరెస్ట్ లతో ఆందోళనలో ప్రజలు

**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 19:** ఎంతో ప్రశాంతం గా ఉండే కోనసీమ లో మావోయిస్టు లు సంచరిస్తున్నారన్న ప్రచారం తో ఒక్కసారి గా కోనసీమ వాసుల్లో భయాందోళన లు చెలరేగాయి. ఏపీలో వరుస మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు, గోదావరి జిల్లాల్లో ఊరూర జల్లెడ పడుతున్నారు. విజయవాడ, కాకినాడ, ఏలూరు, కోనసీమ ప్రాంతాల్లో మొత్తం 50 మంది మావోయిస్టులు అరెస్ట్ కావడంతో.. ఇంకా ఎంతమంది ప్రజల్లో ఉన్నారన్న దానిపై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో మావోయిస్ట్ అగ్రనేత హిడ్మా అనుచరుడిని పోలీసులు అరెస్ట్ చేసారనే ప్రచారం జరుగుతుంది. హిడ్మా అనుచరుడు మాధవిహండా సరోజ్ రావులపాలెంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. అతన్ని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారని ప్రచారం జరుగుతుంది. ఛత్తీస్ గఢ్ కు చెందిన సరోజ్ రావులపాలెం ఎందుకు వచ్చారు? ఆపరేషన్ కగార్, తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాటు నేపథ్యంలో షెల్టర్ కోసమే మావోయిస్టులు గోదావరి జిల్లాలకు వచ్చారా? లేక మరేదైనా కారణం ఉందా? అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా.. నిన్న మారేడుమిల్లి టైగర్ రేంజ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో హిడ్మా సహా.. ఆరుగురు మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే.



## చర్చలకు సిద్ధమన్నా చంపేస్తారా?

- మారేడుమిల్లి ఘటనపై సీపీఐ రామకృష్ణ
- మారేడుమిల్లిలో హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సీపీఐ ఆగ్రహం
- ఇది ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని రామకృష్ణ విమర్శ
- ఘటనపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని డిమాండు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా సహా ఆరుగురిని ఎన్‌కౌంటర్ చేయడం దుర్మార్గమని సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం వారిపై దమనకాండ కొనసాగించడం దారుణమని ఆయన బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి కానీ, ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను నిర్దాక్షిణ్యంగా హతమార్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని రామకృష్ణ స్పష్టం చేశారు. ఆంధ్ర-తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఈ కాల్పుల ఘటనపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా హింసాత్మక విధానాలను విడనాడాలని రామకృష్ణ హితవు పలికారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా మావోయిస్టులతో చర్చలు జరిపి, సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనాలని సీపీఐ తరఫున డిమాండు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


## విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకున్న విశాఖ ఎంపీ భరత్



**అయినవిల్లి (మనసులో మాట) నవంబరు 19:** అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక స్వామి వారిని విశాఖపట్నం ఎంపీ మతుకుమెల్లి భరత్ దర్శించుకున్నారు. బుధవారం ఆలయానికి విచ్చేసిన ఎంపీ భరత్ కు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేషవస్త్రములతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆయన వెంట అంబాజీపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వ్యాప్తంగా 46 లక్షల మంది అన్నదాతలకు రెండవ విడత సాయంగా రూ.3,135 కోట్ల నిధుల జమ
- జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు
- తూర్పు గోదావరి రైతులకు రూ.76.99 కోట్లు జమ : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి
- రైతుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



**గోపాలపురం (మనసులో మాట), నవంబరు 19:** ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నిధుల పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,135 కోట్లు రెండవ విడతలో జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా అన్నదాత సుఖీభవ ద్వారా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వ వాటాగా పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేలు జమయ్యాయని చెప్పారు. మొదటి విడతలో రూ.7 వెలను ఆగస్టులోనే అందించామని, రెండు విడతల ద్వారా మొత్తం రూ.6,310 కోట్లు జమ చేశామని వివరించారు. త్వరలోనే మూడో విడత కూడా జమ చేస్తామని మంత్రి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో రెండో విడతలో 1,14,991 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.7 వేలు చొప్పున రూ.76.99 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, మైక్రో న్యూట్రియంట్స్ సబ్సిడీలు, ధాన్యం కొనుగోలు, యాంత్రీకరణ, కాలువల పూడికతీత వంటి అంశాలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వ సమయంలో జరిగిన లోపాలను సరిదిద్దుతున్నామని మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, పెట్టుబడి సాయం రైతులకు నిజమైన బలోపేతమని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు నాలుగేళ్లపాటు విస్తృత సహాయం అందిస్తున్నాయని చెప్పారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. యూరియా కొరత ఏ విధంగానూ లేదని, అవసరమైన దాని కంటే ఎక్కువ అందుబాటులో ఉందని తెలిపారు. పచ్చిరొట్ట వేస్తే యూరియా వినియోగం తగ్గుతుందని వివరించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ మొత్తం 33,133 మంది రైతులకు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథక లబ్ధి చేకూరడం సంతోషకరమని చెప్పారు. గత ప్రభుత్వంలో వ్యవసాయం దయనీయ స్థితిలో ఉండగా, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు, ఉద్యాన శాఖ అధికారి ఎన్ మల్లికార్జునరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పీ భాగ్యవతి, గ్రామ సర్పంచ్ అన్నపూర్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.


## సేవకు పర్యాయపదం భగవాన్ సత్యసాయి బాబా

-సత్యసాయి గురుకులం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సేవకు పర్యాయ పదం, ప్రతిరూపమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం ఆల్కాట్ గార్డెన్స్ సమీపంలోని గురుకులం రోడ్డులో ఉన్న 'శ్రీ సత్యసాయి గురుకులం' ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల హర్షధ్వానాల మధ్య మంత్రి కందుల దుర్గేష్ కార్యక్రమంలో ఉత్సాహవంతంగా గడిపారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు సత్యసాయి చిత్ర పటాన్ని మంత్రి దుర్గేష్ కు బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తనను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసినందుకు కమిటీ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. భగవాన్ సత్యసాయి బాబా ప్రపంచ మానవాళికి ప్రవచనాలు బోధించడమే కాకుండా మానవసేవ కార్యక్రమాలని పెద్ద ఎత్తున నిర్వహించారన్నారు. వైద్యం, విద్య కోసం వైద్యాలయాలు, విద్యాలయాలు స్థాపించి ఎందరికో ఆరోగ్యాన్ని, విద్యను ప్రసాదించారన్నారు. పుట్టపర్తి మొదలుకుని రాష్ట్రంలో నీటి వసతి లేని మెట్ట ప్రాంతాల వరకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించిన మహానుభావుడు సత్యసాయిబాబా అని వెల్లడించారు. సమాజ హితం కోసం, భవిష్యత్తు జీవితాలు అందంగా తీర్చిదిద్దుకునేందుకు సత్యసాయి బాబా చూపించిన మార్గం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు బాల్యదశ నుండే సత్యసాయి ఆలోచన దృక్పథాన్ని అలవరుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భగవాన్ సత్యసాయి బాబా జీవితం భావితరాలకు మార్గదర్శకమని, ఆయన చూపించిన మార్గం అనుసరణీయమన్నారు. భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పుట్టపర్తికి వచ్చారన్నారు. 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్మ వస్తున్నారని వెల్లడించారు. నవంబరు 23న ఏపీ ప్రభుత్వం అధికారికంగా భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు పెద్దఎత్తున నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా సత్యసాయి శత జయంతి ఉత్సవాల పర్యవేక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీలో తాను ఒక సభ్యుడిని కావడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
అంతకు ముందు సత్యసాయి గురుకులం ఇంగ్లీషు మీడియం పాఠశాలకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ కు కమిటీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## జాతీయ కవితా పోటీల్లో పదో స్థానం పొందిన డాక్టర్ సుబ్బారావు కు అభినందనలు

**కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 19..** జాతీయ కవితా పోటీల్లో టాప్10 విజేతగా నిలిచిన డాక్టర్ వి.వి.వి.ఎస్. సుబ్బారావును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. బాలల దినోత్సవం సందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక నిర్వహించిన ఆన్లైన్ జాతీయ కవితా పోటీలో "పూర్వ బాల్యం" అంశంపై సుబ్బారావు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాప్ 10లో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కళావేదిక అధినేత కళారత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరి భూషణం, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నూక సంపత్ కుమార్, జాతీయ సోషల్ మీడియా కన్వీనర్ నల్లా భాగ్యలక్ష్మి విజేత మెమెంటోను అందజేశారు.ఇదే సంస్థ నిర్వహించిన "తెలుగు కీర్తి కిరీటం ఎన్టీఆర్" పోటీలో, అలాగే విశ్వసాహితి కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన "ఆకలి రంగు" జాతీయ కవితా పోటీల్లో కూడా సుబ్బారావు ప్రతిష్ఠాత్మక స్థానాలు సాధించిన విషయం గమనార్హం. సాహిత్య రంగంలో కొత్తపేటకు గర్వకారణంగా నిలిచిన డాక్టర్ సుబ్బారావు మిత్రులు, గ్రామస్తులు, అభినందించారు.

ప్రతి ఒక్కరూ సామాజిక సేవలు అందించాలి – ప్రసాద్

పెద్దాపురం, (మనసులో మాట) అక్టోబర్ 19.. సమాజంలో ప్రతి ఒక్కరు సామాజిక సేవలు అందిస్తూ మానవత్వాన్ని చాటి చెప్పాలని విధ్వరేణ్య పీఠాధిపతి ప్రసాద్ గురూజీ కోరారు. పెద్దాపురం మండలం కట్టమూరులో సానాధిపతి సామాజిక వర్గం నిర్వహించిన కార్తీక వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆధ్యాత్మిక విజ్ఞానం, ఆధ్యాత్మిక చింతన ద్వారా మనశ్శాంతి లభిస్తుందని, తద్వారా మంచి మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని ప్రసాద్ గురూజీ తెలిపారు. ప్రాచీన కాలం నుండి వన సమారాధన నిర్వహించటం సంప్రదాయం మాత్రమే కాకుండా, ఆరోగ్య ప్రదమని కూడా తెలిపారు. గుండారపు లోవరాజు, తదితరులు ప్రసాద్ గురూజీని ఘనంగా సత్కరించారు.

## తొర్రేడులో ఘనంగా వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని తొర్రేడు గ్రామం బీసీ కాలనీలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాలు కలిసి ఝాన్సీ లక్ష్మీబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ యనాపు ఏసు మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి దేశభక్తి, సాహసం, త్యాగం, పోరాట స్ఫూర్తిని ఆసక్తికరంగా వివరించారు. శత్రుమూకలపై ఆమె ప్రదర్శించిన తిరుగుబాటు అసమాన ధైర్య సాహసాలు ఈ తరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గ్రామంలోని చిన్నారులకు రాణి లక్ష్మీబాయి జీవిత గాథను పరిచయం చేస్తూ దేశభక్తి పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల్లో స్వీయరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఈ జయంతి సందర్భంగా గ్రామ ప్రజలు ఏకమై, ఆమె చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తామని సంకల్పించారు. కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ ఒకటవ మండలం అధ్యక్షుడు నాగల శివకుమార్, ప్రధాన కార్యదర్శి కండెల్లి సురేష్, జిల్లా కార్యదర్శి స్వామి సూర్యకిరణ్, మండల ఉపాధ్యక్షురాలు ఆకుల నరసవేణి, రాయుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు పీ వీరలక్ష్మి, నూకల వెంకటలక్ష్మి, తోట అనంతలక్ష్మి, మండల కార్యదర్శి లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యలపై అర్జీల స్వీకరణ

**పిఠాపురం,(మనసులో మాట) నవంబరు 19:** విద్యుత్ శాఖకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి వినియోగదారులు నేరుగా అర్జీలు సమర్పించేందుకు అవకాశం. పిఠాపురం విద్యుత్తు ఉపకేంద్రం వద్ద వినియోగదారుల సదస్సు గురువారం జరుగుతుందని డీఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం వినియోగదారులు ఫిర్యాదులు పరిష్కర మండలి చైర్మన్ బి. సత్యనారాయణ పాల్గొని నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు ఈ సదస్సులో పరిష్కరించబడతాయని అవకాశాన్ని వినియోగదారులంతా సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు.




## స్పందించిన అధికారులు

**అయినవిల్లి( మనసులో మాట) నవంబరు 19:** అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం పై పిచ్చి మొక్కలు పట్టించుకోని అధికారులు' అనే శీర్షిక మనసులో మాట దినపత్రికలో సోమవారం వెలువడింది. ఈ వార్తకు స్పందించిన మండల పరిషత్ అధికారులు కార్యాలయం పై అంతస్తులో మొలచిన పిచ్చి మొక్కలను తొలగించారు. అంతేకాకుండా భవనం పై వచ్చిన పగుళ్ల సిమెంట్తో శుభ్రపరిచారు. బుధవారం పీఎం కిసాన్ నిధులు రైతు ఖాతాలోకి జమ చేసే కార్యక్రమం పి గన్నవరం నియోజవర్గానికి సంబంధించి అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయంలో పెట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధులుగా రావడంతో అధికారులు భవనం పై ఉన్న పిచ్చి మొక్కలను ఆగమేఘాలపై తొలగించి కార్యక్రమం చేపట్టారు.

## పరిశుభ్రతతో ఆరోగ్యం - పచ్చదనంతో ఆనందం

### మొక్కలు నాటిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి



**రామచంద్రపురం(మనసులో మాట) నవంబరు 19** ప్రకృతిని కాపాడే గొప్ప వరం మొక్కలు నాటడమేనని, నాటిన ప్రతి మొక్క భవిష్యత్తులో మనకు నీడ, ఆక్సిజన్ అందించి మనకు ప్రాణ రక్షణగా నిలుస్తాయని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ రాజు, కూటమి పార్టీ నాయకులు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక రత్నంపేట, లెప్రసి కాలనీ సమీపంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఒక చెట్టు లక్షల ప్రాణాలకు శ్వాస అందిస్తుందని, చెట్లు పెంచడం ద్వారా భూతాపం తగ్గించవచ్చన్నారు. పచ్చదనం, పరిశుభ్రత క్రమశిక్షణ ద్వారా పట్టణ సుందరీకరణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 4 లక్షల రూపాయలు మంజూరయ్య అని, అ నిధుల ద్వారా పట్టణంలో హరితవనం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఎస్ కే పిపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ, మోడరన్ విద్యాసంస్థల అధినేత జి వి రావు, చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నయన వైద్యులకు చేయూత పురస్కారం



**కాకినాడ( మనసులో మాట) నవంబర్ 19..** చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఎనిమిదవ వార్షికోత్సవ సందర్భంగా సంస్థకు అన్ని విధాలుగా సహకరిస్తున్న ప్రముఖులకు అందజేసే చేయూత పురస్కారాన్ని బుధవారం ఉదయం నయన కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ రావుల శ్రీరామ్, డాక్టర్ రావుల మెహర్ తేజలకు చేయూత వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మొండి రవికుమార్ ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణ మూర్తిలు దుశ్శాలువాతో సత్కరించి అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించ బడినవని ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపు తున్నామన్నారు. గత ఏడు సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో అన్ని ప్రాంతాలందు సుమారు 13 కోట్ల 78 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. చేయూత ఆధ్వర్యంలో 12 విభాగా లందు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అందులో ప్రధానంగా విద్య, వైద్య, రైతు పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా అభ్యుదయ కార్యక్రమాలు కూడా ఉన్నాయన్నారు. తమ సంస్థ సహకారంతో విద్యను అభ్యసించిన వారు నేడు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో ఇంజనీర్ లు గాను, వైద్యులు గాను, లాయర్లు మొదలగు వృత్తులలో ఉపాధి పొందడం తమకెంతో గర్వకారణం అని చెప్పారు. తమ రోటరీ చేయూత భవన్ లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు విద్యను పూర్తి చేసి పట్టభద్రులుగాను ఉద్యోగస్తులుగాను వెళ్లాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. గ్రామీణ అభివృద్ధిలో ప్రధానంగా రైతులకు అవసరమైన కార్యక్రమాలు పేదల కు గృహాలను నిర్మించడంలో దాతల సహకారం పట్ల ధన్యవాదాలు తెలుపుకున్నారు. పిల్లలకు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంలో వైద్యులు ఉచితంగా సేవలు అందించడమే కాక మందులను కూడా అందిస్తున్నారని రవికుమార్ వివరించారు. కాకినాడ పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద రోగులకు వారి సహాయకులకు ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తున్నామని రవికుమార్ గుర్తు చేశారు. అన్ని కార్యక్రమాలు ఇంత విజయవంతంగా నిర్వహించబడడానికి సహకరిస్తున్న రాష్ట్ర వ్యాప్తంగా గల చేయూత సభ్యులకు ఈ సందర్భంగా ధన్యవాదములు తెలియజేశారు.

## గుడ్..మీ సేవలు అభినందనీయం

- రాజమహేద్రవరానికి కేంద్ర ప్రభుత్వ అవార్డు రావటం పట్ల మంత్రి నారాయణ హర్షం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగర పాలక సంస్థ అధికారులను అభినందించిన మంత్రి నారాయణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తే తప్పకుండా గుర్తింపు, ప్రోత్సాహం లభిస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ నారాయణ అన్నారు. ఇందుకు ఉదాహరణ రాజమహేద్రవరం నగర పాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వ అవార్డు లభించడమే అన్నారు. బుధవారం మంత్రి నారాయణ నగర పాలక సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కి, నగర పాలక సంస్థ కమిషనర్ రాహూల్ మీనాకి, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు-2024 లో జల్ సంచాయ్-జన్ భాగీదారీ విభాగం కింద రాజమహేంద్రవరం నగరం జాతీయ స్థాయిలో నాల్గవ ర్యాంకును సొంతం చేసుకుని, ఈ అవార్డు కింద రూ. 2 కోట్లు నగదు పురస్కా రానికి ఎంపికైన నేపథ్యంలో మంత్రి నారాయణ వారందరినీ అభినందించారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జల సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వంగా ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మొత్తం 13,298 నీటి సంరక్షణ పనులు పూర్తిచేసి ఈ ఘనతను సాధించడం గర్వకారణమన్నారు. ఈ క్యాటగిరీ కింద లభించిన అవార్డుకు రూ. 2 కోట్ల నగదు పురస్కారం లభిస్తుందన్నారు. నగర పాలక సంస్థ చరిత్రలో ఈ పురస్కారం ఓ కీలక మైలురాయి అని.. ఈ అవార్డు రానున్న రోజుల్లో చేపట్టే పనులకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి అన్నారు.

## యాంటీబయాటిక్స్‌ను జాగ్రత్తగా వాడాలి



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 18:** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఏన్టిమైక్రోబియాల్ రెసిస్టెంట్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా నేడు హాస్పిటల్ ఆవరణ లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ర్యాలీకి జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి నేతృత్వం వహించారు.ఎమ్మార్ పెరుగుతున్న నేపథ్యంలో యాంటీబయాటిక్స్‌ను జాగ్రత్తగా, వైద్యుల సలహా మేరకు మాత్రమే వాడాలని ఆమె ప్రజలకు సూచించారు. యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ వల్ల సాధారణ ఇన్ఫెక్షన్లకే చికిత్స క్లిష్టతరం అవుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రజల్లో బాధ్యతాయుతమైన మందుల వినియోగంపై అవగాహన పెంచడం ఈ ర్యాలీ ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, సీఎస్ఆర్ఎంవో డా.కోమల, మైక్రోబయాలజీ హెచ్ఓడి డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



## కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్న ఆనందం మరెందులో ఉండదు...

- విద్యుత్ ప్రమాదం జరగడం చాలా బాధాకరం..
- బాజీ బేగ్ కుటుంబాన్ని పరామర్శించి 20వేల ఆర్థిక సాయం..
- టిడిపి నాయకులు సయ్యద్ నిజామ్..

**బాపట్ల (మనసులో మాట) నవంబరు 19 :** సేవే మార్గం, సేవే లక్ష్యం గా పేదలకు అండగా భరోసా కలిపిస్తున్న సయ్యద్ నిజామ్ నిరుపేదలకు సాయం చేయటమే తన జీవిత ధ్యేయంగా పనిచేస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. చందోలు గ్రామస్తుడు, టీడీపీ యువ నాయకుడు నిజామ్. సేవలను ప్రాంత ప్రజలు కొనియాడారు.. ఆదివారం జుల్ఫా లాంఫాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన బాజీ బేగ్ పూరిల్లు పూర్తిగా దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో అతను కట్టుకున్న బట్టలు తప్ప ఉన్నవన్నీ విద్యుత్ ఘాతానికి ఆహుతి అయ్యాయి. అయ్యా భగవంతుడా నాకు ఎవరు దిక్కు అనే లోపు దేవుడు మనిషి రూపంలో వస్తాడని తెలియక బాధితుడు బోరున విలపించాడు.. ఉండడానికి గూడు తినడానికి కూడు లేక అనేక అవస్థలు పడుతున్న బాజీ కుటుంబానికి అండగా నేనున్నానని చందోలు గ్రామవాసి సయ్యద్ నిజామ్ దృష్టికి ఈ ఘటన తెలిసిన వెంటనే హుటావుటిన బాజీ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లి అతనికి 20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీ ఎన్నో సంవత్సరం నుంచి మా ప్రాంతంలో కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని అందులో భాగంగానే విద్యుత్ ప్రమాదానికి పూర్తిగా ఇల్లు కాలిపోవడం చాలా దురదృష్టకరమని, అతని కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అతని కుటుంబానికి 20,000 ఆర్థిక సాయం చేశారని తెలిపారు..ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు షేక్ బాజి, అమీరా, సలీం, అన్వర్ బేగ్, గౌస్ బేగ్, జాకీర్, తాజూ, తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర స్వామి వారికి 2.10 లక్షల విరాళం



**అయినవిల్లి (మనసులో మాట) నవంబరు 19:** ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక స్వామి వారి కి రాజమండ్రి వాస్తవ్యులు దువ్వూరి వెంకటరమణ 2.10 లక్షల విరాళాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు .బుధవారం ఆలయానికి విచ్చేసిన దువ్వూరి వెంకటరమణ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి కానుకగా 2 లక్షల పదివేల రూపాయలు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ గా అందజేశారు .వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రములతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తారు.

## 22న నన్నయలో సైన్స్ నేషనల్ సెమినార్



**రాజమహేద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఫిజిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22న "రీసెంట్ డెవలప్మెంట్స్ ఇన్ ఫిజిక్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్" అనే అంశంపై నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలిపారు. బుధవారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 22న నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా బయోకాన్ బ్రిస్టల్ – మైనర్స్ స్క్విబ్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ లీడ్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ శ్రీనివాస్ కలిదిండి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ డాక్టర్ ప్రతాప్ కొల్లు హాజరవుతారని అన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ గా ప్రొఫెసర్ బీ జగన్మోహన్ రెడ్డి, కో కన్వీనర్ గా డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి వ్యవహరిస్తారని చెప్పారు. అధ్యాపకులు పరిశోధకులు ఈ సెమినార్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ విజయనిర్మల, జీ చంద్రకళ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సామాజిక సేవలు అందించాలి - ప్రసాద్



**పెద్దాపురం, (మనసులో మాట) అక్టోబర్ 19..** సమాజంలో ప్రతి ఒక్కరు సామాజిక సేవలు అందిస్తూ మానవత్వాన్ని చాటి చెప్పాలని విధ్వరేణ్య పీఠాధిపతి ప్రసాద్ గురూజీ కోరారు. పెద్దాపురం మండలం కట్టమూరులో సానాధిపతి సామాజిక వర్గం నిర్వహించిన కార్తీక వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆధ్యాత్మిక విజ్ఞానం, ఆధ్యాత్మిక చింతన ద్వారా మనశ్శాంతి లభిస్తుందని, తద్వారా మంచి మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని ప్రసాద్ గురూజీ తెలిపారు. ప్రాచీన కాలం నుండి వన సమారాధన నిర్వహించటం సంప్రదాయం మాత్రమే కాకుండా, ఆరోగ్య ప్రదమని కూడా తెలిపారు. గుండారపు లోవరాజు, తదితరులు ప్రసాద్ గురూజీని ఘనంగా సత్కరించారు.



## విద్య, వైద్య సహాయానికి రెడ్ క్రాస్ ట్రస్ట్ కృషి

**కాకినాడ(మనసులో మాట), నవంబరు 18:** రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ప్రాంగణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులకు 55 వేల స్కాలర్షిప్లు, రెటీనా వ్యాధితో మాట్లాడుతున్న కే గోపాల రెడ్డికి 25 వేల విలువ గల ఇంజక్షన్, జి సత్యనారాయణకు 50 వేల విరిగి విలువ చేసే వినికిడి యంత్రాలు, స్వయం ఉపాధిలో భాగంగా ఒక మహిళకు కుట్టు మిషన్ వెరసి సుమారు ఒక లక్షా 40 వేల విలువ గల సేవా కార్యక్రమాలను అమెరికాలో స్థిరపడిన రెడ్కాన్వెంట్ పూర్వ విద్యార్థి ఎం శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఎంతో మందికి అనేక రకాలుగా సేవ సహాయ కార్యక్రమాలు అందిస్తోందన్నారు. విద్యా వైద్యం స్వయం ఉపాధి వంటి వాటికి ఈ ట్రస్టు అధిక మొత్తాన్ని బహుకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మాజీ అధ్యక్షుడు డివిఆర్ జగన్నాథరావు, రెడ్నం రమణమూర్తి, శీమకుర్తి పాపారావు, రాయుడు సురేష్ కుమార్, లలిత్ కుమార్, డాక్టర్ శేషగిరి, వివి రామ్ చరణ్, అన్నపూర్ణ, శారద తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవ ఏర్పాట్లు

**భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డిఓ మల్లిబాబు**



**కాకినాడ (మనసులో మాట) నవంబరు 18:** కాకినాడ రూరల్ లో వేంచేసి ఉన్న శ్రీ మందేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానం ఈనెల 26వ తేదీ జరగనున్న సుబ్రహ్మణ్యస్వామి షష్టికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లపై అధికారుల, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని ఆర్డిఓ మల్లిబాబు సూచనలు చేశారు. బుధవారం అయన ఆలయం లో జరిగితున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మల్లిబాబు మాట్లాడుతూ షష్టికి వచ్చే భక్తులకు స్వామి దర్శనార్థం ఇటువంటి ఆటంకాలు ఉండరాదని స్పష్టం చేశారు ముఖ్యంగా పారిశుధ్యం త్రాగునీరుపై ప్రత్యేక దృష్టి పెట్టి విధంగా పంచాయతీ వారు చర్యలు చేపట్టారన్నారు జరగకుండా పోలీస్ ఆలయ సిబ్బంది ఉత్సవ కమిటీ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆలయ ఈవో జోగా సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉచిత దర్శనం, 30 రూపాయలు, 50 రూపాయలు ,ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు . ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ కరెంట్ షార్ట్ సర్క్యూట్ లేకుండా ముందుగా తనిఖీ చేయాలని స్వామి దర్శనానికి సుమారు 20వేల మంది పైబడి వచ్చే అవకాశం ఉన్న కారణం చేత పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేయడం జరిగిందన్నారు. పార్కింగ్ ప్లేస్ లు కూడా ముందుగా నిర్దేశించిన ప్రాంతంలో ఏర్పాటు చేసేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు . పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసి నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్ పనేంద్ర ,పంచాయతీ కార్యదర్శి జగజీవన్ రామ్, ఎండిఓ సతీష్ ,తాసిల్దార్ లక్ష్మీ, డిటి సురేష్ ,ఎస్సై వీరబాబు ,వీఆర్వో రాంబాబు ,ఆలయ కమిటీ సభ్యులు లావణ్య, ఉమా ,శ్రీను, అప్పారావు ,మణికంఠ ,పళ్ళ జగదీష్ పాల్గొన్నారు.

## ఘనంగా లక్షపత్రి పూజ



**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 19:** ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడి గ్రామంలో శ్రీ ఉమా వల్లభేశ్వర స్వామి వారికి శైవాగమ ప్రతిష్టాచార్య,శైవాగామ పండితులు పి.ఎస్. శాస్త్రి మరియు ఆలయ అర్చకులు బాధంపూడి శ్రీరామ చంద్రమూర్తి సత్తిబాబు ఆధ్వర్యంలోబుధవారం లక్షపత్రి పూజ మరియు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అల్పాహారం మరియు సాయంత్రం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాదాల నాగసత్యమంగా కుమారి బుజ్జి, చింతలపూడి బాబురావు,మాదాల పరంకుశం,నైనాలశెట్టి శ్రీను,ఏడిద శివ,రామాయణం రాంబాబు,రామాయణం రాజు,మాదాల సత్తిబాబు,మదాల వనేశ్వరరావు,అరిగెల లక్ష్మణరావు, బయ్యవరపు నాగేశ్వరరావు,ఏడిద దొరబాబు, మాదాల త్రిమూర్తులు, కూనపరెడ్డి శ్రీరామ్మూర్తి, నాగరాజు, లోవరాజు, వడలి పూర్ణయ్య, పాయసం సూరిబాబు, పాయసం పుల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ పురందేశ్వరి గో బ్యాక్..గో బ్యాక్!

**- కడియం నర్సరీలు అభివృద్ధి చెందక పోవడానికి కారణం ఇక్కడ ఎక్కువ మంది మీ చౌదరీలు లేరు కాబట్టే - కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జేటీ రామారావు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** "అమ్మా..పురందేశ్వరి..మీరు రాజమహేంద్ర వరం ఎంపీగా ఎందుకున్నట్లో కాస్త మీకైనా తెలుస్తోందా..ఎంపీగా ఈ సంవత్సరన్నర కాలంలో ఒక్క అభివృద్ధి పనైనా పూర్తి చేశారా..అసలు మీరు రాజమండ్రి ఎందుకొస్తున్నారు?, ఏమి చేస్తున్నారు?..మీరేమీ అనుకోకుంటే..ఒక్క చిన్న మనవి..గో బ్యాక్..ప్లీజ్ గో బ్యాక్".. ఈ వ్యాఖ్యలు చేసింది మరెవరో కాదు..కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రజా సంఘాల జేఏసీ నేత జేటీ రామారావు. అవును..ఆయన ఈ మధ్య ఎంపీ పురందేశ్వరి రాజమహేంద్రవరం నగరంపై ఎటువంటి దృష్టీ సారించి, అభివృద్ధి చేయటం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా, పత్రికా ప్రకటనల ద్వారా తన ఆవేదనను వ్యక్తం చేస్తున్న విషయం నగర వాసులకు తెలిసిందే. తాజాగా ..పురందేశ్వరి చౌదరి గో బ్యాక్..గో బ్యాక్ అనే నినాదంతో ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి చౌదరి బీసీలు, ఎస్సీలు, ఎస్టీ, మైనారిటీ, కాపుల సభలలోకి వచ్చి ఆకస్మాత్తుగా ప్రేమ చూపుతున్నట్టు నటించడం, పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెయ్యడం చూసి ప్రజలు నవ్వుకుంటున్న స్థాయిలో ఉందని జేటీ రామారావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గత 30 సంవత్సరాల్లో ఈ వర్గాల వద్దకి ఒక్కసారి కూడా రాకపోయిన వారు, ఇప్పుడు ఎన్నికల సమయం దగ్గర పడితేనే కనిపించడం.. ఇదే అసలు నాటకం అని వ్యాఖ్యానించారు. రాజమహేంద్రవరం అభివృద్ధి ఎందుకు ఆగిపోయింది?, ఈ నగరం 30 ఏళ్లుగా ఎటువంటి అభివృద్ధికీ నోచుకోకుండా ఎందుకు నిలిచిపోయింది?.. వీటికి కారణాలు ప్రజలకు స్పష్టంగా తెలుసునని, ఇది మీ చౌదరీల పాలనలోనే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రశ్నలు హద్దులు దాటుతున్నాయని.."మా గల్లీలు వరదల్లో మునిగిపోయినప్పుడు మీరు ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారు తల్లీ అంటూ ఎంపీ పురందేశ్వరిని ఉద్దేశించి జేటీ రామారావు పేర్కొన్నారు. మా పిల్లలు ఉద్యోగాల కోసం తిరిగినప్పుడు మీరు ఎక్కడ?, మా కాలనీలు సమస్యలతో కక్కుర్తి పడినప్పుడు మీరు ఎక్కడ?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు వేదికపైకి వచ్చి మాయమాటలు చెప్పినా మైక్ పట్టుకుని అబద్ధపు హామీలు ఇచ్చినా వ్యక్తిగత ప్రేమ నటించినా రాజమహేంద్రవరం ప్రజలు ఇక మోసపోవడం జీరో..అన్నారు. ప్రజల కోసం ఏమీ చేయని వారు..వారి బాధలను ఒక్కసారి కూడా చూడని వారు..ఈ నగరాన్ని మూడు దశాబ్దాలు నిలిపేసిన వారు, ఇప్పుడు అకస్మాత్తుగా వేదికలపైకి ఎక్కి "మేము మీ కోసం"అంటే..ప్రజలు ఎవ్వరూ నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రాజమహేంద్రవరం తీర్పు స్పష్టమైనది.."ఉపన్యాసాలు కాదు..పనులు చేసిన వారినే స్వీకరిస్తాం" అన్నారు. ప్రజలు ఈసారి చరిత్రాత్మకంగా సమాధానం చెబుతారన్నారు. త్వరలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ ఆత్మగౌరవ సభ విజయవంతంగా నిర్వహించి మా సత్తా చాటుతామని జేటీ రామారావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అన్నదాతల సంక్షేమానికే అధిక ప్రాధాన్యత

**- మంత్రి నారాయణ -**



**పెద్దాపురం (మనసులో మాట) సెప్టెంబర్ 19..** వ్యవసాయ రంగ పురోభివృద్ధి, రైతుల సంకేమానికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో బుధవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాన్ని లాంచనంగా ప్రారంభించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్, సామర్లకోట మండల వ్యవసాయ అధికారి మురళీధర్ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ జిల్లాలో ఒక్క లక్ష 23 వేల 226 మంది రైతులకు 99.88 కోట్ల రూపాయల నిధులను అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ యువజన పథకంలో అందిస్తున్నట్లు తెలిపారు. 24 గంటల్లో రైతుల వ్యక్తిగత ఖాతాల్లో ఈ నిధులు జమ చేయబడతాయన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల కోసం అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో కొనుగోలు సొమ్ములు రైతు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. రాజ్యసభ ఎంపీ సర సతీష్ బాబు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరా బత్తుల రాజశేఖర్, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, కంటే జగదీష్ మోహన్, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, పాలకుర్తి శ్రీనివాస్ చౌదరి, కాపవరపు కుమార్, గోల్టి సత్యనారాయణ, పడాల వీరబాబు, నిడదవోలు వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దళితుల కుటుంబ సభ్యులను**

## ఎస్సి కమిషన్ చైర్మన్ పరామర్శించాలి

**జగ్గంపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్**



**జగ్గంపేట(మనసులోమాట) నవంబరు 19..** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం సోమవరం గ్రామ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మోర్తా ఆనందరావు,మోర్తా కొండయ్య,కాకడ రాజు,బతిన భద్రం,కుంద్రపు దుర్గా చైతన్య లు మరణించారు. జగ్గంపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్ బాధిత కుటుంబ సభ్యులను ఈరోజు మరోసారి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇన్సెంటివ్ , ఎక్స్ గ్రేషియా, ఎస్సీ కార్పొరేషన్ సహకారం, ఎస్సీ కమిషన్ చైర్మన్ సహకారం ఏ విధంగా అందించారో శివ గణేష్ బాధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఏ విధమైన సహకారం అందలేదని,నియోజకవర్గ శాసనసభ్యుడు వారి అనుచరుడిని కాపాడుకునే దానికి, అత్యంత భయంకరమైన యాక్సిడెంట్ సమాచారం ప్రభుత్వానికి, సమాజానికి తెలియకుండా ఎస్సీ కమిషన్ చైర్మన్ బాధితులను పరామర్శించకుండా అడ్డుకున్నారని, ఎస్సీ కమిషన్ చైర్మన్ సిఫారసుతో డిస్ట్రిక్ట్ కలెక్టర్ ద్వారా, సీఎంఓ నుండి పొందవలసిన ఎక్స్ గ్రేసియా సహకారం అందకుండ చేశారని బాధితులు శివ గణేష్ వద్ద బోరున విలపించారు. ఈ సందర్భంగా శివ గణేష్ మాట్లాడుతూ 8-11- 2025 తేదీన యాక్సిడెంట్లో మరణించిన వారికి 22- 11-2025 రోజున దశదినకర్మ కార్యక్రమం జరుగనున్న నాడు మధ్యాహ్నం లోపు ఎస్సీ కమిషన్ చైర్మన్ వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించాలని, మరణించిన ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేసియా ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, నేషనల్ హైవే చట్టం నిబంధనలకు విరుద్ధంగా సోమవారం గ్రామం సర్వీస్ రోడ్లో నిర్మాణం చేయవలసిన బస్టాండు స్పీడ్ వే హైవేపై నిర్మించి ఈ ఘటనకు కారణమైన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ ద్వారా మరణించిన ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇప్పించేదానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ పోరాడాలని శివ గణేష్ డిమాండ్ చేశారు. యాక్సిడెంట్ విషయాన్ని సమాజానికి తెలియకుండా దాచాలని మసిపూసి మారేడు కాయ చేయాలని ప్రయత్నం చేసిన జగ్గంపేట శాసనసభ్యుడు బాధ్యత తీసుకుని ఎస్సీ కమిషన్ చైర్మన్ ను బాధితులు వద్దకు తీసుకుని వచ్చి వారికి న్యాయం చేయకపోతే ఎక్కడైతే యాక్సిడెంట్ జరిగిందో ఆ స్థానంలోనే బాదిత కుటుంబ సభ్యులతో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నామని శివ గణేష్ అల్టిమేటం జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా జనరల్ సెక్రెటరీ జోడ చైతన్య,ఏం. అర్. పి. ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముకూరి శ్రీను, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్, జాయింట్ సెక్రెటరీ పండు, ప్రముఖ ఎస్సీ నాయకులు మార్తా తాతారావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గుర్తింపు కార్డులు ఇచ్చిన పూర్వ విద్యార్థి మేడిశెట్టి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** స్థానిక నేషనల్ సీనియర్ బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులందరికీ పాఠశాల పూర్వ విద్యార్థి మేడిశెట్టి తిరుమల రావు తన తండ్రి మేడిశెట్టి తాతబ్బాయి చేతుల మీదుగా గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969-70లో ఆరవ తరగతి 1970-71లో ఏడవ తరగతి ఈ పాఠశాలలో విద్యను అభ్యసించినట్టు తెలియజేశారు. అంతే కాకుండా తనతో పాటు సోదరుడు, సోదరి, పిన్ని, మా అమ్మ కూడా ఇదే పాఠశాలలో చదివినట్లుగా తెలియజేశారు. ప్రతి సంవత్సరం నవంబరు 18న తన కుటుంబ సభ్యులు అంతా కలిసి తాను చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత సహాయం చేయాలని అనుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జోగి నాయుడు, ప్రధానోపాధ్యాయుడు సింహాద్రి రావు, రాధామణి, రమణారెడ్డి రాజా మాధవి, విశాలాక్షి, ప్రసాద్, వరహాగిరి కృష్ణమోహన్, కల్పవల్లి, సతీష్, వీరలక్ష్మి పాల్గొన్నారు.



**కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న**

## వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి

**ఆత్రేయపురం (మనసులో మాట) నవంబర్ 19..**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు, జగ్గిరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగిరెడ్డి , అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గాన గంగాధర్ రావు, రాష్ట్ర ప్రచార విభాగం సెక్రటరీ ముసునూరి వెంకటేశ్వరరావు , ముఖ్య నాయకులు, బండారు రాజా , కామిశెట్టి అమ్మన్న , ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం లో**

## చికిత్స-ఆపరేషన్లు

**- అనంతరం మంచానికే పరిమితమైన బాధితులకు ఆరోగ్య ఆసరా కరువు..**
**- కూటమి ప్రభుత్వం ఆసరా పథకాన్ని అమలు చేయండి.**
**- ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆరోపణ..**



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 19..** డాక్టర్ .ఎన్టీఆర్ వైద్య సేవ చికిత్స ఆపరేషన్లు అనంతరం బాధితులకు ఆసరా కరువైందని బుధవారం ఉదయం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. తోకల ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్య చికిత్సలో భాగంగా ఆపరేషన్లు చేయించుకుని మంచానికే పరిమితమైన బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక భరోసా ఆసరా కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో డెలివరీకి 5 వేల రూపాయలు కళ్ళు ఆపరేషన్కు 1500 కాళ్లు ఆపరేషన్ కు 15 వేల గుండె ఆపరేషన్ కి 10వేల పక్షవాత చికిత్సకు 30వేల రూపాయలు క్యాన్సర్ పేషెంట్లకు రేడియేషన్ కి ఆసరాగా 4500 రూపాయలు వెన్నుముక ఆపరేషన్ కి 8 వేల రూపాయలు తదితర రకాల వైద్య సేవల ఆపరేషన్లు చికిత్స పొందే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వైద్య చికిత్స ఆపరేషన్లు అనంతరం మంచానకే పరిమితమైన బాధితులు పౌష్టికాహారం తినడానికి జీవన ఉపాధి కోల్పోయి ఇంటికే పరిమితమైన వారికి ఆసరా వర్తించేదన్నారు. కానీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం 5 నెలలు గడుస్తున్న నేటి వరకు ప్రభుత్వం ఆరోగ్య ఆసరా అమలు చేయడంలో విఫలమైందన్నారు. వైద్య సేవలో మొత్తం 3257 రకాల జబ్బులకు వైద్య సేవలు అందేవని వాటిలో 1519 రకాల వైద్య సేవలకు చికిత్స పొందిన బాధితులకు మినిమం రోజుకి 250 చొప్పున అంటే నెలకి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం బ్యాంకు ఖాతాలో పడేదని ప్రస్తుతం ఇప్పుడు కరువైందని ఆయన ఆరోపించారు . గాలి బ్లాడర్స్ ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ టెస్టులు వంటి పథకాలను తప్పించారని పేద ప్రజలకు ఎక్కువగా వైద్య సేవలు అందించడంలో సహాయపడుతున్న మిత్రులకు అవార్డు రూపంలో గ్రేడ్ 1 కింద 10 వేల రూపాయలు గ్రేడ్ కింద 5 వేల రూపాయలు గ్రేడ్ 3 కింద 2 వేల రూపాయలు ఉత్తమ సేవ క్రింద క్యాష్ అవార్డుల బహుమతులు ప్రతినెల మిత్రులకు అందించి మిత్రులను ప్రోత్సహించే వారిని అటువంటి ప్రోత్సాహం కనుమరుగైందని వారికి జీతాలు పెంచడం లేదు, వారి జీతాలు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మంజూరు చేయాలి. ప్రభుత్వ డాక్టర్లకి ఇస్తున్న ఇన్సిడెంట్ మిత్రులకు వర్తింప చేయాలి. ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఐదు లక్షల నుండి 25 లక్షలు పెంచి సేవలు అందించే వారిని, కళ్ళ ఆపరేషన్లు ఉచితంగా చేయించి కళ్లజోళ్ళు ఉచితంగా పంపిణీ చేసేవారని అటువంటివి సేవలు ఎక్కడా కనబడడం లేదని ఆయన అన్నారు. ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం 5 నెలలు కాలం పాలన పూర్తయిన ఇప్పటికీ హెల్త్ కార్డులు మంజూరు చేయలేదని ఆయన అన్నారు. ఈ పథకం కింద డి ఆర్ ఎన్ టీ ఆర్ యు ఎస్ టీ 27 స్పెషలిస్ట్ పోస్ట్ ఓపి జీవన ఆధార బత్యానికి అర్హత కలిగిన 1519 విధులను గుర్తించి సాధారణ సిజేరియన్ డెలివరీలకు 5వేల రూపాయలు ఆసరాగా మహిళలకు అందించే వారని కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇప్పటికీ మంజూరు చేయలేదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వైద్య సేవ చికిత్స ఆపరేషన్లు చేయించుకున్న ప్రతి పేద ప్రజలందరికీ ఆరోగ్య ఆసరా కల్పించాలని బాధిత కుటుంబాల్ని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వనికి విజ్ఞప్తి చేసారు.

**మరోతి శివగణేష్ ఆధ్వర్యంలో**

## ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలు



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 19..** ఉక్కు మహిళ భారతరత్న ఇందిరాగాంధీ 108వ జయంతిని స్థానిక జగ్గంపేట అంబేద్కర్ నగర్ నందు గల ఇందిరాగాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు మరియు గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు ఇందిరాగాంధీ విగ్రహాలకు జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్ పూలమాల అలంకరించి అంజలి ఘటించారు. ఇందిరాగాంధీ అమర్ రహే అని నినదించారు. ఈ సందర్భంగా శివ గణేష్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక రూపురేఖలు మార్చింది ఇందిరా గాంధీ అని, ల్యాండ్ సీలింగ్ చట్టాలను తీసుకువచ్చి భూ సంస్కరణ ద్వారా బడుగు బలహీన వర్గాలకు భూములు పంచి పక్కా గృహాలు నిర్మాణం చేయించి సమసమాజ స్థాపనకు పాటుపడింది ఇందిరా గాంధీ అని, బ్యాంకుల జాతీయం చేసింది ఇందిరా గాంధీ అని, కుల వివక్ష రూపుమాపే దానికి అనేకసార్లు చట్టాల్లో మార్పు తీసుకొచ్చింది ఇందిరా గాంధీ అని, ప్రపంచంలోనే అతి శక్తివంతమైన దేశం భారతదేశము అని నిరూపించినది ఇందిరా గాంధీ అని కొనియాడారు. కాబట్టి లౌకిక మతసామరస్య సమసమాజం కావాలంటే రావాలంటే కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకు తెచ్చుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడు పై భారతదేశంలో ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిసిసి సభ్యుడు వత్సవాయి సత్యనారాయణ రాజు అనే బాబు, జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ జోడా చైతన్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు గొంప కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



# రైతే రాజు

## దేశ ఆర్థిక వ్యవస్థలో రైతు వెన్నెముక లాంటివాడు ఎమ్మెల్యే గిడ్డి



**అయినవిల్లి( మనసులో మాట) నవంబరు 19:** దేశ ఆర్థిక వ్యవస్థలో రైతు వెన్నెముక లాంటివాడని రైతే రాజుగా మనమందరం రైతు పట్ల ఆదర్శంగా ఉండాలని పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో భాగంగా రైతులకు రెండో విడత ఆర్థిక సాయంలో నియోజవర్గం లో 21వేల753 రైతులకు గాను 16 కోట్ల 22 లక్షల రూపాయల వారి ఖాతాలో 7000 చొప్పున నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు రైతు భరోసా పథకంలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 20,వేలు చొప్పున ఏడాదికి వారికి ఇవ్వడం జరుగుతుందని, ఇచ్చిన హామీ లో భాగంగా ఇప్పటికే రెండు విడతలలో 14000 రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకి పోయి ఆత్మహత్యే శరణ్యం అని రైతులు దిగులుగా ఉన్న సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులు కౌలు రైతులకు ఇచ్చే ఆదుకున్నారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రైతు పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని రైతులను అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోపక్క ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీరికి తోడుగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఈ ముగ్గురు రైతులకు మేలు చేసే దిశగా కూటమి ప్రభుత్వంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జిల్లా జగదీశ్వరి అగ్రికల్చరల్ ఏడిఏ కెనడీ కూటమి నాయకులు తహసిల్దార్ విద్యాపతి ఎంపీడీవో సరోవర్లు పాల్గొన్నారు.

## మురుగు నీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటు పరిశీలించిన ఆర్ డి ఓ మాధవి



**ముమ్మిడివరం(మనసులో మాట) నవంబరు 19:** ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో ఇంట్లో వాడకం నీరు ను శుద్ధి చేసి పంట పొలాలకు సరఫరా చేసే విధంగా ముమ్మిడివరం లో సీవెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు స్థలం పరిశీలించడానికి అమలాపురం ఆర్డిఓ కే. మాధవి పరిశీలించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో చింతలమెరక సమీపంలో రెండు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని సేకరించిన రెవిన్యూ అధికారులు తహసీల్దార్ టీ. సుభాష్, నగర పంచాయతీ కమిషనర్ పి. రవివర్మ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్లాంట్ సీడిఎంఏ, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ గోపాలకృష్ణ, సర్వేయర్ ప్రసాద్, విఆర్ఓ లు ఉన్నారు.

## వెంగయమ్మాపురం వనభోజనాలలో పాల్గొన్న జ్యోతుల చంటిబాబు



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 19..** జగ్గంపేట మండలం వెంగయ్యపురం గ్రామంలో వనభోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సి.ఈ.సి మెంబర్ జ్యోతుల చంటిబాబు హాజరయ్యారు. ముందుగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్తీకమాసం లో వనభోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఈ మాసంలో శివ కేశవుల ఆరాధన వల్ల మంచి ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని ఈ సందర్భంగా ఆయన తెలియజేసారు. అనంతరం వనభోజనాలలో పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి వెంగయమ్మాపురం పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి బండారు రాజా మరియు వైసీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే వాసు

### - ప్రజలకు అందుబాటులో ఉండాలి..విధులు సక్రమంగా నిర్వర్తించాలి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు సక్రమంగా నిర్వర్తించాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ స్కూల్ పక్కన ఉన్న 14 (33వ నెంబరు సచివాలయం), 31 (57వ నెంబరు సచివాలయం) డివిజన్లలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదని, సమస్యల పరిష్కారం కోసం వస్తుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని, ప్రజా సమస్యల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఫిర్యాదులు రావటంతో ఎమ్మెల్యే వాసు సదరు సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు. ఎవరెవరు ఏ విధులు నిర్వర్తిస్తున్నారు, ఏ సమస్యలు వస్తున్నాయి, వాటి పరిష్కారానికి ఏం చర్యలు చేపడుతున్నారు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా లేదా అనే తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టీ, ఇతర రికార్డులను పరిశీలించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ప్రవర్తించినా, ప్రజలకు అందుబాటులో లేకపోయినా, సమయానికి కార్యాలయానికి రాకపోయినా, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని, అలా ఎవరు ప్రవర్తించినా తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక టీడీపీ నాయకులు. కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

# రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర



**కాజులూరు (మనసులో మాట) నవంబరు 19..** రైతు సేవాకాంద్రాల్లోని రైతులు కౌలు రైతులు ధాన్యం అమ్మకాలు చేసినట్లయితే ప్రభుత్వం అందించిన మద్దతు ధర లభిస్తుందని తాహసిల్దార్ జి రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. బుధవారం మండల కేంద్ర మైన కాజులూరు, చేదువాడ, శీల గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని పరిశీలించి వారికి పలు సూచన చేశారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ మన దేశంలో వ్యవసాయం కేవలం ఉపాధి కాదనీ అది జీవనాధారమని రైతు కష్టానికి న్యాయమైన విలువ దక్కేలా చేయడం ప్రభుత్వ బాధ్యతనీ ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర రైతు కుటుంబాల ఆర్థిక భద్రతకు కీలకాధారంగా ఉంటుందన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో మద్దతు ధర వ్యవస్థను రైతులకు మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారానే కొనుగోలు వ్యవస్థను బలోపేతం చేసిందన్నారు. రైతు సేవా కేంద్రాలు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సేవా కేంద్రాలు. వీటి ముఖ్య లక్ష్యం రైతులకు అవసరమైన అన్ని వ్యవసాయ సేవలను ఒకే చోట అందించడం. విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్లు, మట్టినమూనా పరీక్షలు, పంట సలహాలు వంటి సేవలతో పాటు ఇప్పుడు పంట కొనుగోలు ప్రక్రియను కూడా ఈ కేంద్రాల ద్వారా నిర్వహించడం ప్రభుత్వ ముఖ్య అంశాలుగా ఉన్నాయన్నారు. ధాన్యాన్ని రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడం ద్వారా రైతి ఎదుర్కొనే మధ్యవర్తుల దోపిడీ తగ్గుతుందనీ రైతు సేవా కేంద్రాల ద్వారా మద్దతు ధర చెల్లింపులో ప్రధాన లక్ష్యాలు రైతుకు న్యాయమైన ధర కల్పించడం ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే తక్కువకు రైతు ధాన్యం అమ్మకుండా నిర్ధారిస్తుందన్నారు. మధ్యవర్తుల ప్రభావం తగ్గించడం గ్రామస్థాయిలోనే కొనుగోలు జరుగుతుందని రైతు మార్కెట్‌కు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంద న్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం బరువు, నాణ్యత, చెల్లింపులు రైతు సేవ కేంద్రాల సిబ్బంది నమోదుతో జరుగుతాయన్నారు. సమయానుకూల చెల్లింపులు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బు బదిలీ అవుతుందనీ రైతులకు కలిగే ప్రయోజనాలు ప్రయాణ వ్యయం తగ్గుతుందనీ దూర ప్రాంతాల రైతో్క బజార్లకు వెళ్లాల్సిన అవసరంుండదన్నారు అధికారులు నేరుగా కొనుగోలు చేయడం వల్ల మోసాలు తగ్గుతాయన్నారు. నాణ్యత పరీక్షలు స్థానికంగా - ధాన్యం వెంటనే అంచనా వేయబడుతుందనీ తెలిపారు. తాహసిల్దార్ వెంట రెవిన్యూ అధికారులు ఆదినారాయణ , సుబ్బారెడ్డి, శివకుమార్ , వరలక్ష్మి, సాయి , రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల మానసిక ప్రశాంతతకు వన సమారాధనలు దోహదం



**కాజులూరు (మనసులో మాట) నవంబరు 19..** నేటి వేగవంతమైన జీవనశైలిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఒత్తిడి, బాధ్యతలు, లక్ష్యాల ఒత్తిడి వంటి అంశాలు వారి మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పనిభారం పెరుగుతున్న కొద్దీ మానసిక ప్రశాంతత అత్యవసరమవుతోందనీ ఈ నేపథ్యంలో ప్రకృతితో అనుబంధాన్ని పెంచే వన సమారాధనలు ప్రకృతిని పూజించే సంప్రదాయాలు , వనమహోత్సవాలు ఉద్యోగులలో ఆత్మస్థైర్యాన్ని, ప్రశాంతతను, సానుకూల భావాన్ని పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని జిల్లా డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం జిల్లా పరిషత్తు మామిడి తోటలో ఉద్యోగుల వన సమారాధనలో ముఖ్యఅతిథిగా డ్వామా పిడి వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం యాంత్రిక జీవితంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఈ ఒత్తిడి ని అధిగమించేందుకు వన సమారాధనలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ప్రకృతితో సాన్నిహిత్యం - ఒత్తిడికి సహజ ఔషధం అని పరిశోధనలు చెబుతున్నాయనీ ప్రకృతిలో కొద్ది నిమిషాలు గడిపినా ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ తగ్గుతుందనీ, మనసు ప్రశాంతంగా మారుతుందనీ ఉత్సాహం, ఏకాగ్రత పెరుగుతాయని వన సమారాధనలు, వనభోజనాలు వంటి కార్యక్రమాలు ఉద్యోగులను హరిత వాతావరణానికి దగ్గర చేస్తాయనీ ఇది మానసిక శాంతిని పెంచడమే కాక, పని ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ సామూహంగా చేసే వన సమారాధనలు - బృందస్ఫూర్తినీ పెంపొందిస్తాయని ఉద్యోగులు సామూహంగా ప్రకృతి సంబంధిత కార్యకలాపాలు చేస్తే పరస్పర సంభాషణ పెరుగుతుందనీ బృందపనిలో చురుకుదనం వస్తుందని అనుబంధం బలపడుతుందన్నారు. ఆఫీస్ వాతావరణంలో ఒత్తిడిని కలిగించే పోటీ భావాలు ప్రకృతిలో తగ్గి, సహకారం, పరస్పర మద్దతు పెరుగుతాయన్నారు. ఇలాంటి సమారాధనలు ఉద్యోగులను సమన్వయం, సామరస్య దిశగా తీసుకువెళ్తాయన్నారు. మన సమారాధనలు బాధ్యతా భావం, సేవాభావం, స్వీయసంతృప్తి పెంచుతుందన్నారు. వన సమారాధనల్లో ఆధ్యాత్మికత కూడా అంతర్నిహితం. ప్రకృతిని పూజించడం ద్వారా మనసులో వినయం జీవితంపై సానుకూల దృక్పథం అంతర్గత శాంతి పెరుగుతాయన్నారు. ఈ ఆధ్యాత్మిక అనుభూతి ఉద్యోగులకు ఒత్తిడిని మరచిపోయే శక్తిని ఇస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ఉద్యోగుల పాత్ర వన సమారాధనలు ఉద్యోగుల మానసిక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ వాతావరణ మార్పుల నియంత్రణ వంటి సమాజానికి అవసరమైన అంశాలను కూడా గుర్తుచేస్తాయన్నారు. సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పర్యావరణానికీ, ఉద్యోగుల ఆరోగ్యానికీ ద్విగుణిత లాభం చేకూరుస్తాయి. ఉద్యోగుల మానసిక ప్రశాంతత పని ఉత్పాదకత, సంతృప్తి, వ్యక్తిగత ఆరోగ్యానికి బలమైన పునాది. ప్రకృతితో అనుబంధం కల్పించే వన సమారాధనలు ఉద్యోగుల ఒత్తిడిని తగ్గించి, హృదయంలో ప్రశాంతతను నింపి, బృందస్ఫూర్తిని పెంచి, సేవాభావాన్ని పెంచే శక్తివంతమైన మార్గమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ అన్నామణి , గ్రామీణ నీటి సరఫరా శాఖ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ , ఎఇ పద్మరూప ,పిఆర్ జె.ఈ .శంకర్ ,ఏపీవో వెంకటలక్ష్మి ,ఎంఈఓ దేవిడ్ , డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణిరావు ,పంచాయతీ కార్యదర్శులు సూర్య ప్రకాష్ ,రవి ప్రసాద్ ,సూరిబాబు , శ్రీనివాస్ , చంద్రశేఖర్ ,కే ఈశ్వరి ,అనంతలక్ష్మి, హేమదేవి , సుబ్బరాయుడు , మండల పరిషత్ సిబ్బంది మహాలక్ష్మి , మైథిలి , నాగరాజు , సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పలు గ్రామాల పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమావేశంవిజయవంతంచేయాలి

### ఏపీఆర్ జేపీసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు వెల్లడి



**కాకినాడ (మనసులో మాట ), నవంబరు 18:** ఈనెల 29న రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లోజరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీఎంపీ, ఆర్ఎంపీ జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆత్మీయ సమావేశంనకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యసేవలందించే గ్రామీణ వైద్యులందరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని ఏపీఆర్ జేపీసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ ఆఫీసు వెనుక గల గాంధీభవన్ నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నూరుద్దీన్ బాషా అధ్యక్షత న జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల వృత్తి పరిరక్షణకు,ప్రభుత్వ గుర్తింపు పొందుటే లక్ష్యంగా ఏపీఆర్ జేపీసీ ప్రతి ఉమ్మడి జిల్లాలలో ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని,దీనిలో బాగంగా ఈ నెల 29 న రాజానగరం జీఎస్ఎల్ కాలేజీ నందు ఏపీఆర్ జేపీసీ గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, జేపీసీ అధ్యక్షులు డాక్టర్ కేజీ గోవిందరెడ్డిల సమక్షంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశం నకు ప్రతీ గ్రామీణ వైద్యుడు హాజరవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఏపీఆర్ జేపీసీ కో కన్వీనర్ ఎమ్డీ తానీషా మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల ఐకమత్యంగా ఉంటేనే గుర్తింపు కొరకు ప్రభుత్వం ముందుకు వస్తుందని,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లోని పీఎంపీలందరూ ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఇటీవల మరణించిన కాకినాడ జిల్లా అధ్యక్షులు కేఎస్ ప్రసాద్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వ్యక్తులు మాట్లాడుతూ పీఎంపీ అసోసియేషన్ కు ఎనలేని సేవలందించిన కేఎస్ ప్రసాద్ లేని లోటు ఎవ్వరూ పూడ్చలేనిదని అన్నారు. అనంతరం జరిగిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో మెడ్ వే సంజీవి హాస్పిటల్ కు చెందిన వైద్య నిపుణులు డాక్టర్ నెక్కంటి సూర్యప్రసాద్,డాక్టర్ కృష్ణ పృధ్వి,డాక్టర్ నజీముద్దీన్,డాక్టర్ రాజ్ లు పాల్గొని కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల,అత్యవసర పరిస్థితుల్లో పీఎంపీలు అందించే ప్రాథమిక వైద్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారు కోన చిన్నారావు, జిల్లా నాయకులు ఏడుకొండలు, కే శ్రీనివాసరావు, ఎస్కే రహమాన్ షరీఫ్,జీఎన్.సత్యనారాయణచిక్కాల శ్రీనివాస్, రాజలింగం, జగతా బాబ్జీ, మామిడి సూరిబాబు,ఆర్ వినాయక కుమార్, కే కిషోర్, మోహన్,మెడ్ వే సంజీవి హాస్పిటల్ సెంట్రల్ హెడ్ దినేష్ కుమార్ లతో పాటు అధిక సంఖ్యలో పీఎంపీలు పాల్గొన్నారు.



# ప్రభుత్వం కళ్లు తెరవాలి

### - మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ప్రజానీకం

### - రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్

**రామచంద్రపురం (మనసులో మాట) నవంబరు 19..** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. వైఎస్ఆర్ సీపీ నియోకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ నేతృత్వంలో పట్టణంలోని విఎస్ఎం కళాశాల వద్ద బుధవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వనిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున విద్యార్థులు కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బోస్ కళాశాలకు వచ్చిన విద్యార్థులకు మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేయటం మూలంగా కలిగే అనర్థాలను వివరిస్తూ వారితో సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ బోస్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వ నిర్ణయం మూలంగా వైద్య విద్యను చంద్రబాబు ప్రభుత్వం దూరం చేస్తుందన్నారు. అంతేకాకుండా వైద్య కళాశాలలు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేయటం మూలంగా పేద ప్రజలను ఉచితంగా వైద్యం అందుతుందని, కానీ ప్రవేటు పరం చేయటంతో వైద్యం అత్యంత ఖరీదుగా మారి పేదలకు ఉచిత వైద్యం దూరమవుతుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మూలంగా రాష్ట్ర సంపద ప్రవేటీకరణ కావటంతో పాటుగా ప్రజలు, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఎటువంటి రాజకీయాలకు తావివ్వకుండా మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను నిలుపుదల చేయాలి, ప్రజల్లో వస్తున్న ప్రభుత్వ వ్యతిరేకతను ఇప్పటికైనా గమనించాలని కోరారు. విఎస్ఎం కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కోటి సంతకాల కార్యక్రమానికి విద్యార్థులు స్వచ్ఛంధంగా పాల్గొని వారి అభిప్రాయాన్ని సంతకాల ద్వారా తెలియజేశారన్నారు. త్వరలోనే కోటి సంతకాల కార్యక్రమాన్ని పూర్తి చేసి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అందజేసి ప్రజా నిర్ణయాన్ని తెలియజేస్తారని ఎంపీ బోస్ తెలిపారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ప్రభుత్వంలో రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలను తీసుకువచ్చారన్నారు. అవన్నీ ప్రభుత్వ అధీనంలోనే నిర్మాణాలను సాగించి రాష్ట్రంలో ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటుచేసి వైద్య విద్యతో పాటుగా ఉచిత వైద్యన్ని పేదలకు అందించాలనే సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టారని వివరించారు. సంపదను సృష్టామని చెప్పి అబద్దపు హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ గద్దెనెక్కిన తరువాత పేదలకు అందాల్సిన ఉచిత వైద్యాన్ని, పేద, మధ్య తరగతి విద్యార్థుల కలయిన వైద్య విద్యను దూరం చేసే దుర్మార్గపు చర్యలకు పాల్పడుతన్నారని విమర్శించారు. ప్రభుత్వ సంపద అయినటువంటి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్దతి పేరుతో పూర్తిగా తనవారికి మెడికల్ సీట్లను అమ్ముకుని సొమ్ము చేసుకునే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణను తీసుకువస్తున్నారని సూర్యప్రకాశ్ అన్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రజలపక్షాన నిలబడుతూ మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తూ ప్రజల నిర్ణయాన్ని కోటి సంతకాల ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారనే విషయాన్ని ఇప్పటికైనాప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. విఎస్ఎం కళాశాల వద్ద ఏర్పాటుచేసిన కోటి సంతకాల శిభిరం వద్దకు విద్యార్థులు స్వచ్ఛంధంగా తరలివచ్చి ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారని సూర్యప్రకాశ్ వెల్లడించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భావానీ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

# రైతు జీవితానికి నమ్మకం కూటమి ప్రభుత్వం



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 18:** వైసిపి వంచనలతో మోసపోయిన రైతుకు కూటమి ప్రభుత్వం నిజమైన భరోసా కల్పిస్తుందని, సూపర్ సిక్స్ లో భాగంగా కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ హామీని నెరవేర్చి నేడు రెండవ విడత నిధులను రైతులు ఖాతాలో జమ చేయడం జరిగిందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక మండల రెవెన్యూ అధికారి కార్యాలయం నందు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం రెండో విడత నిధులు జమ కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొండబాబు రైతులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం జగన్ వంచనలతో రైతులు మోసపోయారని, నేడు కూటమి ప్రభుత్వం రైతులకు నిజమైన భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతుందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఏడాదికి 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని, సూపర్ సిక్స్ లో భాగంగా అన్నదాత సుఖీభవ హామీని నెరవేర్చేందుకు 2025 ఆగస్టు 2వ తేదీన తొలి విడతగా ప్రతి రైతుకు కేంద్రం మాట 2 వేలు రాష్ట్ర వాటా 5 వేలు కలిపి మొత్తం 7,000 వేలు రూపాయలు రైతులు ఖాతాలో జమ చేయడం జరిగిందని, నేడు రెండో విడతగా మరో 7,000 వేల రూపాయలు రైతులు ఖాతాలో వేయడం జరిగిందని, రైతులు సంక్షేమం నిజమైన అర్థంలో కాపాడే పథకం అన్నదాత సుఖీభవ అని, పీఎం కిసాన్ తో కలిపి ప్రతి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో పేరుకు మాత్రమే ఇచ్చిన భరోసా కాకుండా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను అర్థం చేసుకొని ఒక్కొక్కరికి తగిన విధంగా న్యాయం చేస్తూ ముందుకు సాగుతుందని, నేడు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు కడప జిల్లా కమలాపురం నియోజవర్గం నుండి ఈ పథకాన్ని ప్రారంభించి రైతులు ఖాతాలో నిధులు జమచేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఉన్న లోపాలను కూటమి ప్రభుత్వం సమూలంగా సరిచేసి అర్హులైన ప్రతి రైతుకు పథకం అమలు అయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, అర్హత ఉన్న ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదు అనేది కూటమి ప్రభుత్వ సంకల్పమని, ఇది రైతు శ్రేయస్సు పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి జితేంద్ర, కూటమి శ్రేణులు మల్లిపూడి వీరు, మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, బడేటి దేవి, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, నల్లూరి శ్రీనివాస్, మల్లాడి గంగాధరం, పురుషోత్తం, పల్లా సురేష్, నేమాని సత్యనారాయణ, మేడిశెట్టి బుజ్జి, జొన్నాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



నేడుమురమళ్ళలో శ్రీ వీరేశ్వర స్వామికి

# అఖండ దీపోత్సవం

**ఐ. పోలవరం, (మనసులో మాట) నవంబర్ 19..** శుభకరుడు శంకరుడు ఎవరు.... నిత్య కళ్యాణం శోభితుడు... మురమళ్ళ శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారికి కార్తీక మాసం అమావాస్య మహా పర్వదినం పురస్కరించింది నేడు అఖండ దీపోత్సవం కన్నుల వైకుంఠంగా జరిపేందుకు ఏర్పాటులు సిద్ధమయ్యాయి. ఈ దైవ కార్యక్రమానికి ప్రభుత్వ శాసనసభ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు బుచ్చిబాబు వంశీకులు ప్రత్యేక అతిథిలు గా పూజాది కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయనున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి సత్యనారాయణ దంపతులు తో పాటు పలువురు భక్తులు విశేషంగా హాజరు అవుతారు. అఖండ దీపోత్సవం పురస్కరించి ఆలయంలో ప్రత్యేకంగా నేతి దీపాల అలంకరణ, భారీ మంచు కొండలు కైలాసంలో పరమేశ్వరుడు కొలువై ఉండడం ప్రత్యేకంగా సెట్టింగులు ఏర్పాటు చేశారు. అఖండ దీపోత్సవంలో ప్రతి భక్తులు కార్తిక దీపాన్ని వెలిగించుకునే వెలుగు వెసులుబాటు ఏర్పాటు చేశారు. శ్రీ వీరేశ్వరుని ఆలయవంత రంగురంగుల విద్యుత్ అలంకారులతో దేదీప్యమానంగా కన్నులు మిరిమిట్లు గొలుపేలా ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం శోభను తీసుకువచ్చారూ. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు దంపతులు అఖండ దీపోత్సవం పాల్గొని తోలిత కార్తిక దీపాన్ని వెలిగిస్తారు. దీనికి తొలిత ఆలయ కళ్యాణబ్రహ్మ బ్రహ్మశ్రీ నాగభట్ల రామకృష్ణ, ఆలయ స్వస్తివాచకులు నాగాభట్ల రవి ప్రసాద్ శర్మ, ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు పేటీటి శ్యామల కుమార్, ఆలయ వేద పండిట్ గంటి సుబ్రహ్మణ్య శర్మ,ఆలయ పురోహితులు ఆధ్వర్యంలో శ్రీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో పార్థివలింగాన్ని ఏర్పాటు చేశారు పలు రకాల పండ్ల రసాలు ద్రవ్యాలతో అభిషేకాలు ,, లఘున్యాస పూర్వక అభిషేకాలు విశేషంగా పూజలు చేస్తారు. నేత్రపర్వంగా జరిగే అఖండ దీపోత్సవం లో అధిక సంఖ్యలో భక్తులు తం డోపతండాలుగా తండాలుగా తరలివచ్చి శివనామ స్మరణలతో తన్మైత్యం చెందుతారు.

## విశాఖ ఎంపీ భరత్ కుమార్ ను కలిసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి

# గుత్తుల సాయి



**ఐ. పోలవరం,( మనసులో మాట). నవంబర్ 19..** విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ముత్తుమల్లి భరత్ కుమార్ ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి నరసాపురం టిడిపి పరిశీలకులు గుత్తులసాయి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. విశాఖ ఎంపీ భరత్ కుమార్ కోనసీమ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను సాయి తన అనుచరులు తో భరత్ కుమార్ తాతగారి స్వగ్రామమైన ఎస్ మూల పొలంలో కలిసి పట్టు శాలువాతో సత్కరించారు. అనంతరం సాయిని భరత్ కుమార్ పార్టీకి చేస్తున్న కృషి గురించి అడిగి తెలుసుకుని ప్రోత్సహించి భుజం తట్టారు. పార్టీలో సాయికి భవిష్యత్తులో మంచి అగ్ర తాంబూలం కల్పిస్తామని ఎంపీ భరత్ సాయిని అభినందించారు. ఎంపీ భరత్ కుమార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కార్యక్రమాలతో పాటు తోలిత అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. అనంతరం అమలాపురంలో జరిగిన రైతు సభలు పాల్గొని రైతులకు అన్నదాత సుఖీభవ చిక్కులను అందజేశారు. భరత్ ను కలిసిన వారిలో ముమ్మిడివరం నగర టిడిపి అధ్యక్షుడు కట్టా సత్తిబాబు, కూటమి కార్యకర్తలు ఉన్నారు.

## రావులపాలెంలో మావోయిస్టు కలకలం

**రావులపాలెం (మనసులో మాట )నవంబర్ 19..** మారేడుమిల్లి ఎన్కౌంటర్ లో హిడ్మి మృతి చెందడంతో మావోయిస్టులు వివిధ ప్రాంతాలకు వచ్చేసారు. అనుసరుడు సరోజ్ మండ్వి అలియాస్ ఓండ్వా ను బుధవారం రావులపాలెం పోలీసులు అదుపులో తీసుకున్నారు . రావులపాలెం సిఐ శేఖర్ బాబు తెలిపిన వివరాలు ప్రకారం చతిస్గడ్ రాష్ట్రంలోని కృష్ణాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బూర్గులంక గ్రామానికి చెందిన మండ్వ ఐదో తరగతి చదివి 12 సంవత్సరంలోనే మావోయిస్టు కార్యకలాపాలకు ఆకర్షితుడై దళంలో చేరి కమిటీ సభ్యుడిగా పనిచేస్తూనడు, ప్రస్తుతం సౌత్ డివిజన్ మావోయిస్టు కమాండర్ ఇంచార్జిగా ఉన్న ఎర్ర దాదా వద్ద కమ్యూనికేషన్ కమాండర్ పనిచేస్తూ .హిడ్మ కు సన్నిహితుడుగా ఉండేవాడు. రావులపాలెం పోలీసులు అతను వద్దనుండి ఒక తుపాకీ 10 గుడ్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కొత్తపేట కోర్టుకు తరలిస్తామన్నారు.

# ఇందిరా జీవితం దేశ సేవకే అంకితం

**- జయంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళులు -**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** భారతరత్న మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ దేశానికి అందించిన పాలన చిర స్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా స్థానిక జాంపేట వంతెన వద్దనున్న ఆమె విగ్రహానికి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణకుమారి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అడుసుమిల్లి రమేష్ చౌదరి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాలేపల్లి మాట్లాడుతూ ఉక్కు మహిళగా పేరుగాంచిన ఇందిరా గాంధీ 4 సార్లు దేశ ప్రధానిగా పనిచేశారని కొనియాడారు. ఆమె జీవితం దేశ సేవకే అంకితం చేసిన విషయాన్ని బీజేపీ నాయకులు గ్రహించడం లేదని విమర్శించారు. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సోము వీర్రాజు బీహార్ ఎన్నికల్లో ఓట్ చోర్ ఫెయిల్ అయిందంటూ రాహుల్ గాంధీ పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీహార్ లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు అధికంగా ఉన్నట్టు మీకు తెలియదా అని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ఈవీఎంల సహకారంతో ఫలితాలు తారుమారు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ ప్రధానిగా తీసుకున్న ఎన్నో నిర్ణయాలు, విప్లవాత్మక సంస్కరణలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాయన్నారు. గరీబీ హటావో నినాదంతో దేశంలో పేదలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడానికి ఇందిరా గాంధీ చేసిన కృషి ఎనలేనిదని ప్రశంసించారు. ఆమె జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పాల్గొన్నారని అభినందించారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ముఖ్యమంత్రిగా చేస్తే మళ్ళీ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరంలో రోడ్లను విస్తరణ చేయడం మంచి పనేనని అయితే పేపర్ మిల్లు 15 అడుగుల ముందుకు వచ్చేసి గోడ నిర్మాణం చేసిందని ముందుగా ఆ గోడను కూల్చి తర్వాత మార్కింగ్ ఇవ్వాలని డిమాండు చేశారు. గోదావరి పుష్కరాల రేవుకు వెళ్లే మార్గంలో ఉన్న జిల్లా కోర్టు భవనం కూడా చాలా వరకూ రోడ్డు మీదకే ఉందని దాన్ని కూడా తక్షణం తొలగించాలని డిమాండు చేశారు. రోడ్డు విస్తరణ పేరుతో భవనాల నిర్మాణం కూల్చితే దానికి వెంటనే నష్టపరిహారం అందించేలా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చొరవ తీసుకోవాలని కోరారు. నష్టపరిహారం చెల్లించకపోతే మాత్రం తాము ఆందోళన చేయడానికి సిద్ధమని ప్రకటించారు. రమేష్ చౌదరి మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ ప్రధానిగా అందించిన పాలనను నేటికీ అందరికీ ఆదర్శనీయమని అన్నారు. బీహార్ ఎన్నికల్లో బీజేపీ కొత్రపూరితంగా నెగ్గిందని, అక్కడ పోలింగ్ అయిన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లే అధికంగా ఉన్నాయని ఆరోపించారు. మోడీ, అమిత్ షాలు మన్యంలో ప్రకృతి సంపదను ప్రధాని అంబానీలకు కట్టపెట్టాలని ఉద్దేశంతో అక్కడ ప్రజల తరపున పోరాడుతున్న వారిని మావోయిస్టుల పేరుతో కాల్చి చంపుతున్నారని ఆరోపించారు. మన్యంలో రెండు లక్షల హెక్టార్ల వరకు ఉన్న మైనింగ్ లీజులను ఎప్పటికీ అలానే అంబానీ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం కట్టబెట్టిందని ఆరోపించారు. అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ, నెహ్రూ తదితర దేశ సేవకులపై బీజేపీ తప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించిన పీసీసీ నాయకుడు కాటం రవిని కాంగ్రెస్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతాడ వెంకటేశ్వరరావు, కిషోర్ కుమార్ జైన్, బెజవాడ రంగారావు, దేవత సుధాకర్, చామర్తి లీలావతి, ఎండి షాహేన్ షా, బత్తిన చంద్రరావు, బండారు వెంకన్న, కంచర్ల రాజాపండు, ఇజ్జరౌతు సత్యనారాయణ, బర్రె సుబ్రహ్మణ్యం, బిల్డర్ బాబి, తాడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డుకొండ భూములలో ఇండస్ట్రియల్ పార్క్ అనే ఆలోచన విరమించుకోవాలి




**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 19..** జగ్గంపేట మండలం మల్లిసాల,కే.గోపాలపురం మధ్యలో ఉన్న 583 ఎకరాల అడ్డుకొండ భూమిని రెండు గ్రామాల నిరుపేద ప్రజలకే పంచి పెట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాడు మల్లిశాలలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది .ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా భూమిలేని ఈ రెండు గ్రామాల నిరుపేదలు ఎన్నో కేసులు అనుభవిస్తూ, తిరుగుతూ, ఎన్నో దాడులను ఖండిస్తూ, తుపాలు ,డొంకలు, రాళ్ల ,రప్పలు కొట్టుకుంటూ, ఆ భూమి వస్తే మా కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ఆశపడుతూ పోరాటం సాగిస్తూనే ఉన్నారు .ఈ రెండు గ్రామాల ప్రజలు ప్రతి సంవత్సరం మామిడికాయలు కాపలా కాస్తున్నారు,కోస్తున్నారు కూడా. గతంలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి ప్రభుత్వ అధికారుల చుట్టూ,రాజకీయ నాయకులు చుట్టూ తిరుగుతూనే ఉన్నాము.అయినా గాని ఫలితం శూన్యం.ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆ భూములను ఇండస్ట్రియల్ పార్క్ కి అప్ప చెప్పడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం.ఇది సరైన ఆలోచన కాదని ఆయన అన్నారు.పేద ప్రజలకు చెందవలసిన భూమిలో ఇండస్ట్రియల్ కంపెనీలు తీసుకురావడం సరైన పద్ధతి కాదు.మీ ఆలోచనను రెండు గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పైన తెలిపిన విషయాలపై దృష్టి సారించి మల్లిసాల అడ్డుకొండ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు అనే ఆలోచనను విరమించుకొని, పేద ప్రజలకు పంచి పెట్టాలని,లేనిపక్షంలో రెండు గ్రామాల ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, మల్లిశాల గ్రామ నాయకుడు బోడకుర్తి అబ్బులు, ఆగంట అప్పారావు, అన్నవరం, ముత్తా చంద్రావు, చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ అయిన ఉపాధ్యాయులు

**- పాత ఊరు ఉన్నత పాఠశాలకు బీరువాలు బహుకరణ -**



**అనపర్తి (మనసులో మాట) నవంబరు 19:** అనపర్తి స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో, బదిలీపై వివిధ పాఠశాలకు వెళ్లిన, విశేష సేవలు అందించిన ఉపాధ్యాయులు వై రాంబాబు,పి శ్రీనివాసరెడ్డి, వై బి యస్ ఆచార్యులు,పి రామచంద్రారెడ్డి, యు.లచ్చయ్య, కె రవి కిషోర్ కుమార్, జి.నానాజీ, వి.చైతన్య లు తాము పనిచేసిన పాఠశాలకు, 15వేల రూపాయలు విలువ చేసిన రెండు బీరువా సెల్ఫ్ లను అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.సుజాత మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు అనేవి ప్రతి ఒక్కరికి సహజంగా జరిగేవే, కానీ తాము పనిచేసిన పాఠశాల అవసరాలకు గుర్తించుకొని తగినట్లుగా ఏదో ఒకటి ఇవ్వాలి అనే ఆలోచన తో ఈ బీరువా సెల్ఫ్ లను మాకు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, ఎందరో ఉపాధ్యాయులకు ఆదర్శవంతంగా మీరు నిలిచారని కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జగన్ ప్రభుత్వం రైతులను


# వంచనల పేరుతో మోసం చేసింది..

**- నేడు కూటమి ప్రభుత్వం రైతులకు నిజమైన భరోసా కల్పిస్తుంది..**

**- రైతు జీవితానికి నమ్మకం కూటమి ప్రభుత్వం - శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 19..** వైసిపి ప్రభుత్వం వంచనలతో మోసపోయిన రైతుకు కూటమి ప్రభుత్వం నిజమైన భరోసా కల్పిస్తుందని, సూపర్ సిక్స్ లో భాగంగా కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ హామీని నెరవేర్చి నేడు రెండవ విడత నిధులను రైతులు ఖాతాలో జమ చేయడం జరిగిందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక మండల రెవెన్యూ అధికారి కార్యాలయం నందు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం రెండో విడత నిధులు జమ కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు కొండబాబు రైతులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం జగన్ వంచనలతో రైతులు మోసపోయారని, నేడు కూటమి ప్రభుత్వం రైతులకు నిజమైన భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతుందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఏడాదికి 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని, సూపర్ సిక్స్ లో భాగంగా అన్నదాత సుఖీభవ హామీని నెరవేర్చేందుకు గత ఆగస్టు నెల 2 వ తేదీన తొలి విడతగా ప్రతి రైతుకు కేంద్రం మాట 2 వేలు రాష్ట్ర వాటా 5 వేలు కలిపి మొత్తం 7 వేలు రూపాయలు రైతులు ఖాతాలో జమ చేయడం జరిగిందని, నేడు రెండో విడతగా మరో 7 వేల రూపాయలు రైతులు ఖాతాలో వేయడం జరిగిందని, రైతులు సంక్షేమం నిజమైన అర్థంలో కాపాడే పథకం అన్నదాత సుఖీభవ అని, పీఎం కిసాన్ తో కలిపి ప్రతి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని, గత ప్రభుత్వంలో పేరుకు మాత్రమే ఇచ్చిన భరోసా కాకుండా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను అర్థం చేసుకొని ఒక్కొక్కరికి తగిన విధంగా న్యాయం చేస్తూ ముందుకు సాగుతుందని, నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కడప జిల్లా కమలాపురం నియోజవర్గం నుండి ఈ పథకాన్ని ప్రారంభించి రైతులు ఖాతాలో నిధులు జమ చేశారని, గత ప్రభుత్వ పాలనలో ఉన్న లోపాలను కూటమి ప్రభుత్వం సమూలంగా సరిచేసి అర్హులైన ప్రతి రైతుకు పథకం అమలు అయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, అర్హత ఉన్న ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదు అనేది కూటమి ప్రభుత్వ సంకల్పమని, ఇది రైతు శ్రేయస్సు పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి జితేంద్ర, కూటమి శ్రేణులు మల్లిపూడి వీరు, మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, బడేటి దేవి, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, నల్లూరి శ్రీనివాస్, మల్లాడి గంగాధరం, పురుషోత్తం, పల్లా సురేష్, నేమాని సత్యనారాయణ, మేడిశెట్టి బుజ్జి, జొన్నాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా ఐ. పోలవరంలో

# అన్నదాత సుఖీభవ

**- రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**ఐ. పోలవరం,(మనసులో మాట), నవంబర్ 19..** రైతు సంక్షేమమే ఒటమి ప్రభుత్వం ఏకైక లక్ష్యమని ప్రభుత్వ శాసనసభ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) అన్నారు. బుధవారం ఐ పోలవరంలో పీఎం కిసాన్ రెండవ విడత కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, మండల వ్యవసాయ శాఖ అధికారి మోకా వాణి ల ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. ఐ పోలవరం మండలం ఐ.పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ , ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత"రైతు సంక్షేమమే ప్రభుత్వ ముఖ్య ధ్యేయం. ప్రతి రైతుకు ప్రభుత్వ సహాయ పథకాలు నేరుగా వారి కి చేరేలా కృషి చేస్తున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ వంటి పథకాలు రైతు కుటుంబాలకు స్థిరమైన ఆర్థిక భరోసా ఇస్తున్నాయినీ ఆయనవివరించారు. రైతుల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని వెంటనే పరిష్కారాలు చూపించడంలో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందిన్నారు. ముమ్మడివరం నియోజకవర్గంలో రైతులకు జమ చేసిన పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండవ విడత వివరాలు:ఐ. పోలవరం మండలం 6179 మంది లబ్ధిదారులకు 4.11 కోట్లు కాట్రెనికోన మండలం 5611 మంది లబ్ధిదారులకు 3.65 కోట్లు తాళ్లరేవు మండలంలో 4036 మంది లబ్ధిదారులకు 2.73 కోట్లు ముమ్మిడివరం మండలంలో 7673 మంది లబ్ధిదారులకు 4.94 కోట్లు మొత్తం ముమ్మిడివరం నియోజకవర్గంలో 23499 మంది రైతుల కు ?15.43 కోట్లు అన్నదాత సుఖీభవ పీఎం కింద రైతుల ఖాతాకు జమయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గుత్తుల సాయి నాగిడి నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, రాష్ట్ర శెట్టిబలిజి కార్పొరేషన్ డైరెక్టర్ టీకుముడి లక్ష్మణరావు, తాళ్లరేవు, ఐ పోలవరం మండలాలటిడిపి అధ్యక్షులు ధూళిపూడి బాబి, సాగిరాజుసూరిబాబురాజు, ఐ పోలవరం సొసైటీ అధ్యక్షులు కాకర్లపూడి బుజ్జి, ఏ.ఎం.సీ చైర్మన్ ఓగురి భాగ్యశ్రీ మాజీ సొసైటీ అధ్యక్షులు చింతలపాటి తాతబాబు, సాగి కొండబాబు, తాసిల్దార్ చిక్కాల విజయశ్రీ, జనసేన నాయకులు మద్యం శెట్టి పురుషోత్తం, సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవి మునిరాజు, బుల్లయ్య , జనసేన నాయకురాలు లంకలపల్లిరాణి జమ్మి, మందాల గంగ సూర్యనారాయణ, మండల వ్యవసాయ అధికారినలు బోసు బాబు,మోకా శ్రీవాణి, ప్రకృతి వ్యవసాయ సంచాలకులు ఏలియా, తిరుమలరావుకూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కత్తిపూడి బుచ్చి సీతయ్యమ్మ సత్రం చైర్మన్ కు ఘన సత్కారం



**రౌతులపూడి, (మనసులో మాట) నవంబర్ 19:** ఇటీవలే కత్తిపూడి బుచ్చి సీతయ్యమ్మ సత్రం చైర్మన్గా ఎన్నికైన సోమరౌతు చంద్రమౌళి ను ఆయన స్వగృహం నందు ఏలేశ్వరం మండల అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి ) ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి నరసింహమూర్తి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ గెలుపు కోసం ఎంతో కృషి చేసిన సోమరౌతు చంద్రమౌళి కు బుచ్చి సీతమ్మ సత్రం చైర్మన్గా ఎన్నుకోవడం చాలా ఆనందకర విషయం అని గొల్లపల్లి నరసింహమూర్తి అన్నారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ గొల్లపల్లి నరసింహమూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రౌతులపూడి మండల తెలుగుదేశం నాయకులు లెక్కల రాము, నాకిరెడ్డి శ్రీను, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కూల్ విద్యార్థిని కిడ్నాప్ చేసిన ముద్దాయికి

# 14 రోజుల రిమాండ్ విధింపు



**అమలాపురం( మనసులో మాట) నవంబరు 19:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య పట్టణమైన అమలాపురం ఐమాండ్ స్కూల్లో 10సం వయస్సు గల బాలికను, వరసకు మావయ్య అయిన మట్టపర్తి దుర్గా నాగ సత్యమూర్తి ఏ చంటి అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై వచ్చి, బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో అమలాపురం కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు పట్టణ సీఐ వీరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం అమలాపురం ఐ మాండ్ స్కూల్ వద్ద విద్యార్థిని కిడ్నాప్ చేసిన నాగ సత్యమూర్తి అటునుంచి ఆమెను కాకినాడ తీసుకెళ్లి, బాలిక క్షేమంగా తిరిగి రావాలి అంటే తను పంపిన UPI QR code scanner కి డబ్బులు పంపించాలని, తల్లిదండ్రులను బెదిరించి, ముద్దాయి డబ్బులు తీసుకున్నాడని అనంతరం, బాలిక తండ్రి కముజు వెంకటరమణ పిర్యాదు మేరకు, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో కిడ్నాప్ కేసు నమోదు చేసామన్నారు. అనంతరం అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ యొక్క స్వీయ పర్యవేక్షణలో, పట్టణ సి.ఐ వీరబాబు ఎస్సైలు టి.శ్రీనివాస్, జోషి లు మూడు టీంలుగా ఏర్పడి, కాకినాడ పరిసర ప్రాంతాలు, పి.గన్నవరం మండలం ముంగండ, పోతవరం, కారుపల్లి గ్రామాలలో రాత్రి సమయంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి, కేసు నమోదు చేసిన 11 గం.లలోనే, కిడ్నాప్ కాబడిన బాలిక ఆచూకీ గుర్తించి, బాలికను ఆమె తల్లిదండ్రులకు క్షేమంగా తిరిగి అప్పగించినట్లు సీఐ తెలిపారు. సదరు కేసులో బాలికను వదిలి పరారైన పి.గన్నవరం మండలం, ముంగండ గ్రామానికి చెందిన ముద్దాయి మట్టపర్తి దుర్గా నాగ సత్యమూర్తి ఏ చంటి ని బుధవారం ఉదయం అమలాపురం పట్టణ సి.ఐ వీరబాబు పర్యవేక్షణలో ఎస్సై టి.శ్రీనివాస్ మరియు సిబ్బంది పోతవరం గ్రామంలో అరెస్ట్ చేసి, ముద్దాయి నుంచి నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్, 2 సెల్ ఫోన్లు, బాలిక యొక్క స్కూల్ బ్యాగ్, లంచ్ బ్యాగ్, జత స్కూల్ షూలు స్వాధీనపరచుకొని, రిమాండ్ నిమిత్తం, అమలాపురం గౌరవ ఆడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు వారి ముందు ముద్దాయిని హాజరుపర్చగా, కోర్టు వారు ముద్దాయి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించడం జరుగుతుందన్నారు. ఈ కేసులో త్వరితగతిన స్పందించి, కిడ్నాప్ కాబడిన బాలిక ఆచూకీ గుర్తించి, ఆమె తల్లిదండ్రుల వద్దకు చేర్చి, వెను వెంటనే పరారీలో ఉన్న ముద్దాయి అరెస్ట్ చేసి, కోర్టు ముందు హాజరుపర్చిన అమలాపురం పట్టణ సీఐ వీరబాబు, ఎస్సైలు శ్రీనివాస్, జోషి మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.



### పగడాల కన్స్ట్రక్షన్స్ వారి మండల కాల

# ద్వితీయ దివ్య పడిపూజా మహోత్సవం

**పల్నాడు, నవంబర్ 19,(మనసులో మాట):** ఈనెల 21వ తేదీన బెల్లంకొండ మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామం రంగా బొమ్మ సెంటర్ వద్ద మండల కాల ద్వితీయ దివ్య పడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అయ్యప్పలు భవానీలు, శివ స్వాములు, మాల ధరించిన స్వాములు, భక్తులు పాల్గొని స్వామివారి పూజా కార్యక్రమం పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి తరించాలని పగడాల కన్స్ట్రక్షన్స్ ఛైర్మన్ పగడాల శ్రీనివాసరావు తెలిపారు. 5 అరటి మండపాలు, 18 కలశాలతో శబరిమల ఆచార అనుస్థానం ప్రకారం దివ్య పూజ ఏకాదశ అభిషేక ద్రవ్యములతో వైదిక, తంత్రోక్త విధానములతో అయ్యప్ప స్వామి వారి పడిపూజ మహోత్సవం బ్రహ్మశ్రీ ప్రవీణ్ కుమార్ నంబూద్రి శబరిమల అయ్యప్పస్వామి దేవస్థానం మేల్ శాంతి స్వామి వారు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారని, దప్పు శీను గానామృతంతో స్వామివారి భజనా గీతాలు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మాల ధరించిన స్వాములకు భక్తులకు బిక్ష ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పడిపూజ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నామ న్నారు.

### నిరుపేద కుటుంబాలకు

# ‘చేయూత’

- విభిన్న ప్రతిభావంతుని కుటుంబానికి 10,000 రూపాయలు సహా నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేత.
- ఇద్దరి చిన్నారుల కు పూర్తి విద్యా బాధ్యత తీసుకుంటున్నామని హామీ.
- తల్లిని కోల్పోయిన చిన్నారి కుటుంబానికి 15000 రూపాయలు ఆర్థిక సహాయం, చిన్నారి పూర్తి వైద్యానికి సహకారం.




**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 19:** గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో నిరుపేదల కుటుంబాలకు ‘చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ’ వ్యవస్థాపకుడు రవికుమార్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చేబ్రోలు గ్రామంలో గల ఒక విభిన్న ప్రతిభావంతుడు కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయంతో పాటు ఒక నెలకి సరిపడా నిత్యవసర సరుకులను గురువారం అందజేశారు. అంతేగాకన్నా విభిన్న ప్రతిభావంతుని కుమార్తె విద్యాభ్యాసం మొత్తం చేయూత సంస్థ ద్వారా కృషి చేస్తానన్నారు. అలాగే చేబ్రోలు గ్రామంలో తల్లిని కోల్పోయిన నెలల శిశువుకు తమ వంతు సహాయంగా 15 వేల రూపాయలు అందజేశారు. శిశువు వైద్యం కోసం ఆసరాగా నిలుస్తామని తెలిపారు.

పలువురు గ్రామ ప్రజలు చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్ సేవలను ప్రశంసిస్తూ ఆయనకు అభినందనలు తెలియజేశారు.

కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు ,జనసేన నాయకుడు ఓదూరి కిషోర్,బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కర్రి సింహాద్రి, గ్రామ జనసేన నాయకులు అల్లం దొరబాబు, మురళీమోహన్, గాజుల గోవిందు, లోకా రెడ్డి స్వామి, పోసిన రవి, కందా కామరాజు, సాయి, తలాటం లోవ బాబు తదితరులు పాల్గొన్నారు.



### రైతులు, కౌలు రైతుల

# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### -ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** స్థానిక తొర్రేడు సొసైటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన “అన్నదాత సుఖీ భవ -పీఎం కిసాన్ రైతు సహాయం జమ” కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సంక్షేమం, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రసంగించారు. కౌలు రైతులకు న్యాయం చేయడం, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సహకారం అందివ్వడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, ఆ దిశలో చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న చర్యలు రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించేలా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్మకానికి రైతులు ముందుకు రావడం ఈ ప్రభుత్వం పై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలో 934 మంది రైతులు 4,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారని వివరించారు. రైతులు ప్రభుత్వ వ్యవస్థపై చూపుతున్న విశ్వాసం వల్లనే ఈ గణాంకాలు నమోదయ్యాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చురుకుగా పర్యవేక్షణ చేస్తోందని, తగిన మద్దతు ధర లభించే ప్రోత్సాహకాన్ని అందించి వ్యవసాయం గిట్టుబాటు కోసం ఆలోచన చేస్తోందని చెప్పారు. అన్నదాత సుఖీ భవ - పీఎం కిసాన్ యోజన కింద రూరల్ మండలంలో 1,456 మంది రైతులకు రూ. 96 లక్షలు, అలాగే కడియం మండలంలోని 3,846 మంది రైతుల ఖాతాలకు రూ. 296 లక్షలు నేరుగా జమ చేయబడినట్లు తెలిపారు. రైతుల భారం తగ్గించే దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని, దీనితో రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతు, రైతు కూలీల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో పనిచేస్తోందని తెలిపారు. అదే విధంగా, రైతులు ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గి, నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయని ఉదహరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆర్మ్ స్ట్రాంగ్, వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ ప్రతినిధులు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మరలా పిఠాపురంలో జనసేన తెలుగుదేశం శ్రేణుల హోరాహోరీ నినాదాలు
- పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు వర్సెస్ జన సైనికులు
- పిఠాపురం రైతులకు 15 కోట్ల పంట సహాయంగా అందజేత.



**పిఠాపురం, అమరావతి న్యూస్, నవంబర్ 19:** రైతులు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రైతుల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పిఠాపురం పట్టణంలో గల అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన పియం- కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత కార్యక్రమంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ వాటాతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సంవత్సరానికి రూ 20000 వేలు పెట్టుబడి సాయంగా అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో భూమి కలిగిన రైతులందరికీ ఈ పథకం వర్తిస్తుందని, ఈ పంట నమోదయిన తర్వాత కౌలు రైతులకు కూడా రెండు విడతలుగా పెట్టుబడి సాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మూడు మండలాల్లో 23,105 మంది రైతులకు రెండో విడతలో రూ. 15.02 కోట్లు జమ కానున్నాయని తెలిపారు.

**ఇరు పార్టీల శ్రేణులు హోరాహోరీ నినాదాలు**

కార్యక్రమం ఆరంభంలో కార్యకర్తలంత సమన్వయంతో వ్యవహరించినప్పటికీ ముగిసే సమయంలో జన సైనికులు జై జనసేన అని తెలుగు తమ్ముళ్లు జై తెలుగుదేశం అంటూ హోరాహోరీగా నినాదాలు చేసుకున్నారు. గతంలోనూ పలు వేదికలపై ఇదే తరహా నినాదాలు తీవ్రమైన పరిస్థితులకు దారితీసాయి. కూటమి పొత్తు ధర్మంలో భాగంగా ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రి పరస్పరం సానుకూల దృక్పథంతో ఉన్నప్పటికీ పిఠాపురం లో మాత్రం సమన్వయం కొరవడుతుంది, భవిష్యత్తులో ఈ పరిణామాలుకి ఏ పరిస్థితులకు దారితీస్తాయో అని పలువురు నాయకులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ, ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్, బిజెపి పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వరరావు,పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్ర వర్షిని, అగ్రికల్చర్ ఏడి స్వాతి, ఏవో గంగాధర్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టు తీర్పు అమలులో

# ఉదాసీనత ప్రదర్శించవద్దు...

### బిజెపి సీనియర్ నేత ఎం మాలకొండయ్య దువ్వూరి సుబ్రహ్మణ్యం



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 19..** వీధిలో తిరిగే కుక్కలు ఆవులు కు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలులో ఎటువంటి ఉదాసీనత ప్రదర్శించరాదని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత ఎనిమిరెడ్డి మాలకొండయ్య సిటిజన్స్ ఇనిషియేటివ్ కార్యదర్శి దువ్వూరి సుబ్రహ్మణ్యం, యార్లగడ్డ రామ్ కుమార్ బుధవారం కార్పొరేషన్ ఆఫీస్ లో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నీ కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వీధి కుక్కలు కు సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి వారికి అందిన లేఖను మున్సిపల్ కమిషనర్ కు అందజేశారు. మాలకొండయ్య దువ్వూరి సుబ్రహ్మణ్యం యార్లగడ్డ రామ్ కుమార్ లతో మాజీ కౌన్సిలర్ జీవీఎస్ శర్మ,సెంట్రల్ మండల బిజెపి నాయకులు గోడి వెంకట్ కందాల రవి ఉన్నారు. కాకినాడ నగరంలో కుక్కలకు శాశ్వత ఆశ్రయ గృహాలు లేనందున నగర పొలిమేరలో మూడు ఎకరాల భూమికి తక్కువ కాకుండా భూమిని సేకరించి శాశ్వత ఆశ్రయ గృహాలను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. నగరంలో 16 వేల కుక్కలు ఉన్న నేపథ్యంలో ఈ మేరకు స్థలం అవసరమని వారు అభిప్రాయ పడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా నగరంలో కుక్కలను పట్టి శాశ్వత ఆశ్రయ గృహాలకు తరలించాలని వారు కోరారు. కుక్కలు వాటి మానసిక స్థితికి అనుగుణంగా స్వేచ్ఛగా తిరిగేలా శాశ్వత ఆశ్రయ గృహాల నిర్మాణం జరగాలని, నిర్మాణాల విషయంలో అవసరమైతే పశువైద్యుల సలహా తీసుకోవాలని వారు సూచించారు. నగరంలో రోడ్లమీద తిరుగుతున్న ఆవులు వాహనాలు కారణంగా గాయాల పాలవుతున్నాయని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రోడ్ల మీదే తిరిగే ఆవులను సైతం ఆశ్రయ గృహాలకు తరలించాలని అవసరమైతే ఇందుకోసం జంతు హింస నివారణ సంఘం స్థలాన్ని తాత్కాలికంగా వినియోగించు కొని విషయాన్ని పరిశీలించాలని వారు కమిషనర్ కు సూచించారు. సిమ్లా మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో వీధి కుక్కలకు కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ క్యూఆర్ కోడ్, జిపిఎస్ లు అమర్చాలి. మున్సిపాలిటీ ప్రవేశపెట్టే ప్రతి సంవత్సర బడ్జెట్లోనూ వీధి కుక్కలు ఆవుల ఆహారానికి తగినన్ని నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. వీధి కుక్కలు ఆవులకు అందించే ఆహార విషయంలో రాజీ పడరాదని కేటాయించిన నిధులు అవినీతి లేకుండా వీటి ఆహారానికి వినియోగించాలని వారు కమిషనర్ నీ కోరారు. షెల్టర్ హోమ్స్ లో అదే విధంగా కుక్కలకు ఏ బి సి ఆపరేషన్లు నిర్వహిస్తున్న థియేటర్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిరంతరం ఆ సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని ఈ బృందం కార్పొరేషన్ అధికారుల్ని డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా ప్రతి వీధి కుక్కకు అనిమల్ భర్త కంట్రోల్ ఆపరేషన్ నిర్వహించాలని, అదేవిధంగా ఆశ్రయ గృహాలలో ఉంచిన కుక్కలు, ఆవులకు సంబంధించిన రికార్డులు విధిగా నిర్వహించాలని వారు కోరారు. నిర్దిష్ట కాలంలో పశు వైద్యులు ఆశ్రయ గృహాలలో ఉంచిన కుక్కలు ఆవుల ఆరోగ్య పరిస్థితులను సమీక్షించే విధంగా అవసరమైన వైద్యాన్ని అందించే విధంగా ఏర్పాటు చేయాలని వారు కమిషనర్ ని కోరారు. కుక్కలకు ఇచ్చే యాంటీ రాబిస్ ఇంజక్షన్ల యొక్క శక్తి ఒక సంవత్సర కాలమే ఉంటుందంటున్న నేపథ్యంలో ప్రతి సంవత్సరము ప్రతి కుక్కకు యాంటీ రాబిస్ ఇంజక్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని వారు కమిషనర్ ని కోరారు. ఆశ్రయ గృహాలలో ఉంచిన జంతువులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా కోర్టు నిర్ణయించిన గడువు అనంతరం వీధులలో కుక్కలు మరియు ఆవులు వంటి జంతువులు ఎక్కడైనా కనిపించినా మున్సిపల్ అధికారులు కోర్టుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వారు మున్సిపల్ అధికారులకు సూచించారు.



### ఐటిసి ఆధ్వర్యంలో

## ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం

**పల్నాడు, నవంబర్ 19,(మనసులో మాట):** అసిస్ట్- ఐటిసి ఆధ్వర్యంలో బెల్లంకొండ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సర్పంచులకు ఎస్హెచ్జి వివోఏలకు సిఆర్పి లకు ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో అసిస్ట్ నుండి అనిల్ కుమార్ పిపిటి ద్వారా ఘన ద్రవ వ్యర్థాలు నిర్వహణపై అవగాహన కల్పించారు.గ్రామాలలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడి పొడి చెత్తలుగా వేరు చేసి హరితరాయబారులకి అందించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వాటి నందు తడి చెత్తను ఎరువుగాను పొడి చెత్తను రీ యూస్ రీసైకిల్ ద్వారా వాటి ఉత్పత్తిని తగ్గించడానికి కృషి చేయాలని తెలియజేశారు.ద్రవ వ్యర్థాలను కూడా సోప్ పిట్లు ద్వారా కమ్యూనిటీ పిట్స్ ద్వారా వాటి యొక్క నిర్వహణ కూడా చేసి గ్రామాలలో రహదారులపై ఖాళీ ప్రదేశాలలో పారవేయకుండా మురుగునీటి కాల్వలో ఏ అడ్డంకులు లేకుండా ప్రవహించేలాగా ప్రయత్నం చేయాలని తెలియజేశారు.అసిస్ట్ జిల్లా ట్రైనర్ సిహెచ్ బోల్లయ్య మాట్లాడుతూ గ్రామాలలో తడి పొడి చెత్త వేరు చేసి సేకరించాలని తద్వారా గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ రథాలను ఉపయోగించుకొని గ్రామాలలో పొడి చెత్త లేకుండా బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా పరిశుద్ధ గ్రామాలుగా ఉండాలని తెలియజేశారు. ఘన ద్రవ వ్యర్థాలు నిర్వహణకు హరిత రాయబార్లు చెత్త సేకరించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేసి ఐఇసి మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బెల్లంకొండ మండల ఎంపీడీవో సునీత, ఏపీఓ మేరీ, ఎం సి ఓ సాంబయ్య , అన్ని గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎస్ హెచ్ జి మెంబర్సు, సీఆర్పీలు అసిస్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సి ఓ అనిల్ కుమార్, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత అన్నదాత సుఖీభవ నిధులు విడుదల



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 19..** జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మురారి గ్రామంలోని కాకతీయ ఫంక్షన్ హాల్ లో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో జగ్గంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు,జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ ప్రారంభించారు. రైతులు పండించే పంటకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం- పిఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోందని వారు అన్నారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నదాత సుఖీభవ పథకం రైతులకు ఆర్థిక భరోసాని ఇస్తుందని అన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని రైతులు, కూటమి నాయకులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఈ సందర్భంగాపోతుల మోహనరావు, తుమ్మలపల్లి రమేష్, అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు మాట్లాడుతూ సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి, భూమి సాగు చేసుకునే కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ. 14 వేలు, పిఎం కిసాన్ పథకం ద్వారా రూ. 6 వేలు ఆర్థిక సహాయం రైతులకు అందజేస్తున్నామని అన్నారు.అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ ద్వారా జగ్గంపేట నియోజకవర్గంలో మొదటి విడత 30.371, రెండవ విడత 30820 మంది మొత్తం61,191 రైతులకు రైతులకు గానూ 41 కోట్ల 21 లక్షలు నిధులు జమ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మూడు విడతలలో రైతులకు రూ. 20 వేలు అందజేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. అన్నదాత కుటుంబాల్లో ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో జగ్గంపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. సంక్షేమం అభివృద్ధి పనులు చేపడుతూ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమం లో తోట రవి, అడబాల భాస్కరరావు, బస్వా వీరబాబు, జాస్తి వసంత్, పైడిపాల సూరిబాబు, తోట గాంధీ, కంటిపూడి సత్యనారాయణ, చావా చౌదరి, కందుల కొండయ్య చౌదరి (బాబ్జి) దాపర్తి సీతారామయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు, గండేపల్లి జగ్గంపేట కిర్లంపూడి గోకవరం వ్యవసాయ అధికారులు, జగ్గంపేట ఉద్యాన అధికారిని, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి అభినందనలు



**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 19:** ఉత్తరప్రదేశ్ లోని హెచ్ ఆర్ ఐ టి యూనివర్సిటీలో నిర్వహించిన 44వ జాతీయ షూటింగ్ బాల్ పోటీలలో కొత్తలంక జడ్పీ హైస్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థిని గెద్దాడ మేఘన ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం పొందినట్లు పాఠశాల హెచ్ఎం గోవర్ధనగిరి రావు తెలిపారు. ఈ సందర్భంగా బాలిక ను హెచ్ఎం తో పాటు ఎస్.ఎం.సి చైర్మన్ జైను బాబ్జి, పిడి కె.సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఇందిరా గాంధీకి ఘన నివాళి



**పిఠాపురం (మనసులో మాట), నవంబరు19:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కే వెంకటలక్ష్మి , కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎండీ సాల్మాలు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇందిరా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ భారతదేశ ఉక్కు మహిళగా పేర్గాంచిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు మరువలేమన్నారు. పేద ప్రజల కోసం, పేద ప్రజల అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎండీ సాల్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ఉండాలని, చట్ట సభల్లో కూడా ప్రభుత్వం మహిళలకు సమాన హక్కులు కల్పించారని, మహిళలందరూ ప్రధాని ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకుని ధైర్య సాహసాలతో ఉండాలన్నారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని ఆమె తెలిపారు. అనంతరం గ్రంథాలయ అధికారి ఆర్ వెంకట్రావు ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలో గల వివిధ పాఠశాలల విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ మూలపాలెం విచ్చేసిన విశాఖ ఎంపీ భరత్ కలిసిన ఎమ్మెల్యేలు

**అమలాపురం (మనసులో మాట) నవంబరు 19 :** విశాఖపట్నం ఎంపీ మతుకుమెల్లి భరత్ ను అమలాపురం,పీగన్నవరం నియోజవర్గ ఎమ్మెల్యేలు ఎస్ మూల పొలం ఆయన స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి కలిశారు. భరత్ స్వగృహం అయినవిల్లి మండలం ఎస్ మూలపొలం బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా అమలాపురం పి గన్నవరం ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనందరావు గిడ్డి సత్యనారాయణలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే జిల్లా జగదీశ్వరి రాష్ట్ర తెదేపా కార్య నిర్వహణ కార్యదర్శి మెట్ల రమణబాబు,ఆముడా చైర్మన్ అల్లాడి సోంబాబు, అంబాజీపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ చిట్టూరి శ్రీ నివాస్ లు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం భరత్ ప్రసిద్ధి చెందిన దేవాలయాలైన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి మురమళ్ళ వీరేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## విద్యా శాఖలో మంగారాణికి దక్కిన గౌరవం..

**-రాష్ట్ర స్థాయిలో వెలువడే 'మన బడి' మాసపత్రికలో ప్రత్యేక వ్యాసం..**






**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** స్థానిక లాల చెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మోటూరి మంగారాణి రాష్ట్ర విద్యా శాఖ నుండి ప్రత్యేక గౌరవం దక్కింది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా శాఖ పాఠశాలల చిన్నారులకు వివిధ అంశాలను ప్రచురించే 'మన బడి' మాస పత్రికలో మంగారాణి గురించి ఒక వ్యాసం ప్రచురించారు. రాష్ట్ర స్థాయి విద్యా శాఖ మాస పత్రికలో తన గురించి వ్యాసం ప్రచురించడం పట్ల మంగారాణి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మంగారాణికి దక్కిన ఈ గౌరవం పట్ల అర్బన్ రేంజ్ డీఐ బీ దిలీప్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని యు విజయలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ కందికొండ రమేష్ తదితరులు అభినందించారు.

## వాడపల్లి వెంకన్న ఉండి ఆదాయం రూ కోటి 59 లక్షలు



**ఆత్రేయపురం (మనసులో మాట) నవంబర్ 19..** కోనసీమ తిరుమల గా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ఉండి లెక్కింపు బుధవారం నిర్వహించారు. 27 రోజులకు రూ, కోటి 59, లక్షల 44,వేల 749 వివిధ సేవల ద్వారా ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు. పర్యవేక్షకులుగా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, వి సత్యనారాయణ, రామలింగేశ్వరరావు తనిఖీదారు రాజమండ్రి, వై వి వి సత్యనారాయణ ఈవో గ్రేడ్ థర్డ్ గ్రూపు ఆలయాలు వెల్ల గ్రామస్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ.5 వేల కోట్లతో తొలిదశ డ్రెయిన్ల నిర్మాణం

**- మంత్రి నారాయణ**

- ▸▸ అక్రమ నిర్మాణాలకు రాజీ లేదు..కఠిన చర్యలు తప్పవు
- ▸▸ ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌కు వెంటనే దరఖాస్తు చేయాలి
- ▸▸ రాజమహేంద్రవరంలో 180 కి.మీ. కొత్త డ్రెయిన్లు..రూ.75 కోట్లు అంచనా



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** నియమాలు పాటించకుండా నిర్మించిన అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ నారాయణ స్పష్టం చేశారు. నగర అభివృద్ధి, పుష్కర పనులపై బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ రాహుల్ మీనా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పీ నారాయణ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి పొరపాట్లకు తావు ఇవ్వకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. డివియేషన్లతో నిర్మాణాలు చేసినవారు వెంటనే ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని, లేని పక్షంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ పరిష్కారానికి విస్తృత రోడ్ల ప్రతిపాదనలు చెయ్యడం జరుగుతోందని, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని రహదారుల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. బొమ్మూరు - సరస్వతి ఘాట్ వరకు 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు అవసరం అన్నారు. మధురపూడి%-% కడియం, దివాన్ చెరువు రోడ్డు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయన్నారు. మున్సిపాలిటీల్లో 3 దశల్లో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా డ్రెయిన్ల నిర్మాణానికి మొత్తం రూ. 29 వేల కోట్లు అవసరమని, వీటిని మూడు ప్రాధాన్యతలుగా విభజించినట్లు తెలిపారు. అందుకు అనుసరించి కేటాయింపులు చేయనున్నట్లు తెలిపారు. మొదటి ప్రాధాన్యత ప్రాంతాలకు రూ.5 వేల కోట్లు , రెండో దశకు మరో రూ. 5 వేల కోట్లు, మూడో దశకు రూ. 19 వేల కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మొదటి దశను మూడు సంవత్సరాల్లో పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి చెప్పారు. రాజమహేంద్రవరం నగరంలో 180 కి.మీ. మేర తొలి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా డ్రెయిన్ల నిర్మాణం పనులు ప్రతిపాదించినట్లు తెలిపారు. నగరానికి మొత్తం 862 కి.మీ. డ్రెయిన్లు అవసరం కాగా, ప్రస్తుతం 527 కి.మీ. నిర్మాణాలు పూర్తై ఉండగా, అమృత్ ద్వారా 30 కి.మీ. పనులు జరుగు తున్నాయన్నారు. మిగిలిన 303 కి.మీ.లో 180 కి.మీ.ను తొలి ప్రాధాన్యతగా గుర్తించి రూ. 65-75 కోట్లు అంచనా వేసినట్లు మంత్రి వెల్లడించారు. టీడీఆర్ బాండ్లలో పెండింగ్‌లో ఉన్న 40 బాండ్లు నెల రోజుల్లోగా క్లియర్ చేయాలని, ఇకపై భూసేకరణకు సంబంధించిన బాండ్లను 21 రోజుల్లో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డ్సులో జల్ సంచాయ్-జన్ భాగీదారీ విభాగంలో నాలుగో ర్యాంకు సాధించినందుకు కార్పొరేషన్ సిబ్బందిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తా

- కాపవరం శివాలయం అన్న సమారాధనలో కంబాల
- అన్న సమారాధనకు లక్ష విరాళం
- రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 19 :** హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామం అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి, శివాలయం ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. తొలిత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు బాణాసంచా కాల్పులతో, పూలు జల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమందరం భారతీయులమని, కులమతాలకు అతీతంగా అన్నాదమ్ముల్లాగా కలిసికట్టుగా జీవించాలని సూచించారు. ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తూ ఉంటానని తెలిపారు. రంపచోడవరం, రాజానగరం, జగ్గంపేట నియోజకవర్గాల్లో ప్రజలకు కోట్లాది రూపాయలు సొంత నిధులు ఖర్చు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాపవరం సర్పంచ్ జాజుల రాము, ఎంపీటీసీ సభ్యుడు కలచర్ల నాగు, చిన్నారావు, వెంకటేశ్వర్లు, పెద్దకాపు, కటకం చలం, దుర్గాచారి, సలాది వెంకటేశ్వరరావు, జాజుల తాతారావు, ఐల్ల దుర్గారావు, శీలం దుర్గారావు, హరిబాబు, బాను, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర తదితరులు పాల్గొన్నారు

### రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం

# సంక్షేమం వ్యవసాయం పరిశ్రమలు అభివృద్ధి

**రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగూరు నారాయణ**



**పెద్దాపురం (మనసులో మాట) నవంబర్ 19..** కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట శ్రీ సూర్య కళ్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కాకినాడ జిల్లా ఇన్చార్జి పి. నారాయణ రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ముఖ్య అతిథులుగా హాజరై కాకినాడ జిల్లాలోని 1,50,475 మంది రైతులకు మొత్తం రూ.99.88 కోట్ల రూపాయల మెగా చెక్కును రైతులకు అందజేశారు.

తొలుత సామర్లకోట శ్రీ సూర్య కళ్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత ఆర్థిక సహాయం విడుదల కార్యక్రమంలో భాగంగా సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగూరు నారాయణ ఎంపీ సానా సతీష్ బాబు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఎమ్మెల్యే చినరాజప్ప ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ పేరాబత్తుల రాజశేఖరం తదితరులతో కలిసి ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత ఆర్థిక సహాయం విడుదల కార్యక్రమం ఈ రోజు రాష్ట్రం మొత్తం పండగ వాతావరణంలో జరుగుతుంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులకు 20 వేల రూపాయలు ఇస్తామని ఎన్నికల ముందు మాట ఇచ్చామన్నారు. డబ్బులు లేకపోయినా ఇచ్చిన మాట ప్రకారం వరుసగా రెండో సారి రైతుల హామీ నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 6 వేలు రాష్ట్ర ప్రభుత్వం 14 వేల రూపాయలు రైతులకు అందిస్తుందన్నారు. పీఎం కిసాన్ కింద మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం రూ.2 వెల చొప్పున ఇస్తుందని మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున జమ చేస్తున్నమని మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు రెండో తేదీన మొదటి విడత కింద నిధులు జమ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2 వేలరూపాయలు రాష్ట్ర ప్రభుత్వం 5వేల రూపాయలు చొప్పున నిధులు జమ చేస్తున్నామన్నారు. రెండో విడత కింద నేడు నేరుగా రైతు సోదరులకు బ్యాంకు ఖాతాల్లో మరో రూ.7 వేలరూపాయలు జమ చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని సరైన ప్రణాళిక అవగాహన లేక ఆర్థిక వ్యవస్థ అంతా చిన్నాభిన్నం చేసిందని మంత్రి తెలిపారు. దీని కారణంగా మన నెత్తిన 10 లక్షల కోట్ల అప్పులు పెట్టిందన్నారు. ఈ అప్పులన్నీ టాక్స్ ల రూపంలో మనమే చెల్లిస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉన్న అపార అనుభవంతో ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని నెరవేరుస్తుందని రాష్ట్రంలో డబ్బులు లేకపోయినా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లను పెంపుదల మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామన్నారు. యువ నాయకులు మంత్రి లోకేష్ నాయకత్వంలో నిరుద్యోగ యువత కోసం డీఎస్సీ నోటిఫికేషన్ తో సుమారుగా 16 వేల ఉద్యోగాలను భర్తీ సక్రమంగా పూర్తి చేశారన్నారు. ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామన్నారు. ఆటో డ్రైవర్లకు మత్స్యకారులకు రైతులకు ఇలా రాష్ట్రంలో అందరికీ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేస్తు న్నామన్నారు. పెట్టుబడులు రాకుంటే ఉద్యోగాలు ఉండవని 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని పెట్టుబడులను ఆకర్షించేందుకు మంత్రులుగా తాము విదేశాలకు సైతం వెళ్తున్నామని ఆయన తెలిపారు. ఒక్కొక్క మంత్రికి రెండు దేశాల చొప్పున పెట్టుబళ్లు ఆహ్వానానికి వెళ్ళామన్నారు. తాను దుబాయ్ సౌత్ కొరియా లో పర్యటించి అనేక వ్యాపారవేత్తలను కలిసి రాష్ట్రానికి ఆహ్వానించామన్నారు. దీని ద్వారా విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ లో .13 లక్షలకు పైగా ఎంఓయులు కుదిరాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమము వ్యవసాయం పరిశ్రమలు అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందన్నారు. 2024లో ఎన్నికలకు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 90 శాతం హామిలును పూర్తి చేస్తామన్నారు. మిగిలిన 10 శాతం కూడా వీలైనంత తొందరలో పూర్తి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని మంత్రి నారాయణ తెలిపారూపాయలు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద ఈరోజు రైతుల ఖాతాల్లో రెండో విడతగా నగదు జమ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ పథకం కింద పెద్దాపురం నియోజకవర్గంలోని 14,921 మంది రైతులకు 10.02 కోట్లు రూపాయలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి జమ కానున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఈరోజు జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని వీటన్నింటినీ రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద రెండో విడత రైతులకు పెట్టుబడి సాయం కింద 1,50,475 మంది రైతులకు మొత్తం రూ.99.88 కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ. 75.24 కోట్లు, పిఎం కిసాన్ కింద రూ.24.64 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. గతంలో ఎవరికైనా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద డబ్బులు పడని వారికి రెండో విడతలో జమవుతాయన్నారు. ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అనంతరం పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు సుమారుగా రూ 16 లక్షల రూపాయల విలువైన చెక్కులను మంత్రి నారాయణ ఎంపీ సానా సతీష్ బాబు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతులు మిదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎన్ విజయ్ కుమార్.ప్రజా ప్రతినిధులు రైతులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు



## 23 న అనపర్తిలో మెగా జాబ్ మేళా

- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 19:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో 'వికాస' సహకారంతో ఈ నెల 23న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. బుధవారం కలెక్టరేట్ లో ఇందుకు సంబంధించి గోడ పత్రికను కలెక్టర్ కీర్తి చేకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ అనపర్తిలో ఈ నెల 23న ఆదివారం "వికాస" ఆధ్వర్యంలో సుమారు 33 ఎంఎన్ సీ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులందరూ సద్వినియోగ పరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. టెక్నికల్ నాన్ టెక్నికల్, ఐటీ, ఫార్మా, హెల్త్ కేర్, బ్యాంకింగ్ వంటి వివిధ రకాల విభాగాల్లో సుమారుగా 33 కంపెనీ లలో 1,200 ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని, మెరుగైన ఉపాధి అవకాశాలను పొందాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందు కోసం నియోజక వర్గ స్థాయిలో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 23న ఆదివారం అనపర్తి ఎస్ఆర్ జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు నకళ్ళతో హాజరు కావాలని వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు కోరారు.

### అన్నదాతకు అండగా

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వం

**- సొసైటీ అధ్యక్షుడు గాజింగం**



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 19 :** మండల కేంద్రమైన గోకవరం సొసైటీ ఆవరణలో బుధవారం జరిగిన పీఎం సమ్మన్ నిధి, అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గాజింగం సత్తిబాబు, మండల బిజెపి అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రం లోని ఎన్డీఏ ప్రభుత్వం రైతాంగం సంక్షేమం కోసం అన్నదాతకు అండగా నిలవడం కోసం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పీఎం సమ్మాన్ నిధి ద్వారా ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి 6000 రూపాయలు చొప్పున, మూడు విడతలుగా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం రెండవ విడతగా దేశం మొత్తం 9 కోట్ల మంది లబ్ధిదారుల కుటుంబాలకు 18 వేల కోట్ల రూపాయలు తమిళనాడులోని కోయంబత్తూర్ లో భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కడపలో సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా ప్రతి రైతు కుటుంబానికి రెండవ విడతగా 5000 రూపాయలు రాష్ట్రం మొత్తం 2342 కోట్ల రూపాయలు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2000, రాష్ట్ర ప్రభుత్వం 5000 కలిపి మొత్తం ప్రతి రైతు కుటుంబానికి రూ 7,000 బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందని, రైతే దేశానికి వెన్నుముఖ అని, రైతాంగం సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ దాసరి సురేష్, బిజెపి నాయకులు కటకం బూరేశ్వరరావు, మామిడి వీర వెంకట సత్యనారాయణ, రేవాడ అచ్చిరాజు, రేవాడ వీరబాబు, సింగారపు రవి, సత్యనారాయణ, ఏసు, సూరిబాబు, బేబీ రావు తదితరులు పాల్గొన్నారు

## యాంటీ మైక్రోబియన్ రెసిడెంట్ అవేర్నెస్ వీక్

**వైద్యులు నర్సులు మెగా మెడికల్ సిబ్బంది విద్యార్థులు ర్యాలీ**




**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 19..** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఏన్టిమైక్రోబియాల్ రెసిస్టెంట్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా నేడు హాస్పిటల్ ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యులు నర్సులు పారామెడికల్ సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ర్యాలీకి జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి నేతృత్వం వహించారు.ఎమ్మార్ పెరుగుతున్న నేపథ్యంలో యాంటీబయాటిక్స్‌ను జాగ్రత్తగా వైద్యుల సలహా మేరకు మాత్రమే వాడాలని ఆమె ప్రజలకు సూచించారు.యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ వల్ల సాధారణ ఇన్ఫెక్షన్లకే చికిత్స క్లిష్టతరం అవుతుందని ఆమె పేర్కొన్నారు.ప్రజల్లో బాధ్యతాయుతమైన మందుల వినియోగంపై అవగాహన పెంచడం ఈ ర్యాలీ ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ సీఎస్ఆర్ఎంవో డా.కోమల మైక్రోబయాలజీ హెచ్ఓడి డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు



### పేదవాడికి వైద్యం దూరం చేస్తే

# చూస్తూ ఊరుకోం

**చినవలసల గ్రామంలో ఘనంగా రచ్చబండ, కోటి సంతకాల సేకరణలో పొన్నాడ**

**తాళ్ళరేవు (మనసులో మాట), నవంబరు 19:** పేదవాళ్ళకి వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు తీసుకు వస్తె, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తుందని, తాము చూస్తూ ఊరుకోబొమనీ ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం గాడిమొగ పంచాయితీ పరిధిలోని చినవలసల, సుంకరపాలెం గ్రామాలలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవింద్ కుమార్ అధ్యక్షతన కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పొన్నాడ మాట్లాడుతూ పేదవాడికి వైద్యాన్ని దూరం చేసే కుట్రలను ప్రజలు తిప్పుకొట్టాలన్నారు. మెడికల్ కళాశాలలో ప్రభుత్వం ద్వారానే నిర్వహించాలని, కూటమి ప్రభుత్వ%శీ% కళ్ళు తెరిచి ప్రైవేటీకిరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఈసీ మెంబర్ పితాని బాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ%శీ% వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఎవరూ అధైర్యపడవద్దని అండగా ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారం లోకి వచ్చి జగన్ ముఖ్య మంత్రి అవుతారన్నారు. అలాగే నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, కాశి బాలముని కుమారి, ఢిల్లీ నారాయణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పొన్నాడను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉంగరాల సంతోష్, వల్లభుని దొరబాబు, నాయకులు అంకాడి అంజిబాబు, పోతాబత్తుల నూకరాజు, రేకాడి నరసింహమూర్తి, కొక్కిలిగడ్డ లోకేష్, పేస్సింగి వీరప్రసాద్, కోపనాతి వీరబాబు, అరదాడి రమణ, పోతుల రత్నకుమారి, పందిరిపల్లి రాజేష్, పెట్ల సూర్యనారాయణ రాజు, చెక్కా కామేశ్వరరావు, కోరుకొండ కిరణ్ కుమారి, మోర్త భీమాబాయి, వెంటపల్లి నూకరాజు, దడాల జగదీశ్వరరావు, పేర్ని ఆదినారాయణ మూర్తి, కొల్లు శ్రీను, కోటికలపూడి చందు, కామాడీ భైరవమూర్తి, మట్టా లింగమూర్తి, రెడ్డి నాగేశ్వరరావు, సంగాడి శ్రీనివాసరావు, గునిపె విష్ణు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గాడి మొగ పంచాయతీ పరిధిలోని చినవలసల, పెదవలసల లక్ష్మీపతిపురం గ్రామ పెద్దలు, వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైజాగ్ ఎంపీ ని కలిసిన తాడి నరసింహారావు



**ముమ్మిడివరం(మనసులో మాట) నవంబరు 19:** వైజాగ్ ఎంపీ మతుకుమల్లి భరత్ అయినవిల్లి మండలం ఎస్. మూలపొలం స్వగ్రామం కి విచ్చేసిన సందర్భంగా ఎంపీ ను డా. బీ. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత జిల్లాలో తెలుగుదేశం కార్యక్రమం లు గురించి, తెలుగుదేశం పార్టీ ని పటిష్టం చేసే ప్రణాళిక లు గురించి ముమ్మిడివరం నియోజకవర్గం లో అభివృద్ధి పనులు గురించి భరత్ అడిగి తెలుసుకున్నారని నరసింహారావు తెలిపారు.

# మత్స్యకారుల వ్యాపార వృద్ధికి ప్రభుత్వం అండ

### - మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు (మనసులో మాట) నవంబర్ 19..** దేశంలోని మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో మత్స్య రైతులు, మత్స్యకారులను సహకార సంఘం నుండి సమృద్ధి వైపు నడిపించేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 100 మంది కన్నా ఎక్కువ ఉన్న మత్స్యకార సొసైటీలకు సంఘ కార్యకలాపాల కోసం సంవత్సరానికి రూ. 2.5 లక్షలు ఇస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అలా రెండేళ్లలో రూ. 5 లక్షలు ఉచితంగా సంఘం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో ఎఫ్ఎఫ్ పీవో (ఫిష్ ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్) గా ఏర్పడిన కోరుమామిడి ది వడ్డీస్ పిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీకి యాజమాన్య ఖర్చుల నిమిత్తం ఈ నిధులు రావడం జరిగిందని, రాష్ట్రంలో ఇదే ప్రథమమని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఈ నిధులు ఆఫీస్ నిర్మాణానికి, ఫర్నీచర్ ఏర్పాటుకు, మేనేజ్ మెంట్ చేసే సిబ్బందికి వేతనం క్రింద వినియోగించుకోవచ్చన్నారు. 100 కన్నా తక్కువ సభ్యులు ఉన్న సంఘాలకు కూడా న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఈడీకి మంత్రి దుర్గేష్ సూచించారు. ప్రతి మత్స్యకారుడు నేషనల్ ఫిషరీ డెవలప్ మెంట్ ప్లాట్ ఫామ్ (ఎన్ఎఫ్ డీపీ)లో రిజిస్టర్ అయి ఉండాలని, రిజిస్టర్ చేసుకున్న మత్స్యకారులకు మాత్రమే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ గ్యారెంటీ సదుపాయం అందుతుందన్నారు. క్రమం తప్పకుండా ప్రతి సభ్యుడు తన వాటా నిధి నుండి రూ. 2000 సంఘం ఖాతాలో జమ చేసుకుంటే ఈక్విటీ షేర్ క్రింద ప్రభుత్వం మరో రూ. 2000 జమ చేస్తుందన్నారు. అలా ఒక్కో సంఘానికి ఆయా సభ్యులు జమ చేసిన మొత్తం రూ. 10 లక్షలు అవుతుందని అప్పుడు ప్రభుత్వం కూడా అందించే ప్రోత్సాహం అందిస్తుందన్నారు. తద్వారా పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ద్వారా వ్యాపారాలు పెంచుకునేందుకు అవకాశం ఉందని, క్రమం తప్పకుండా డబ్బు కట్టుకుంటే ప్రభుత్వం తక్కువ వడ్డీకి రూ. 50 లక్షలు నుండి రూ. కోటి దాకా రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా మత్స్యకారులు, చేపల పెంపకం దారులు, మత్స్యకార్మికులు, మత్స్య విక్రేతలు లబ్ధి పొందవచ్చని సూచించారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధి చేయడం, చేపల ఉత్పత్తి పెంచడం, మత్స్యకారుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో వంద మంది సభ్యులు ఉండేలా సంఘాలను ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి దుర్గేష్ కోరుమామిడి ది వడ్డీస్ పిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులకు రూ. 2.54 లక్షల చెక్కును పంపిణీ చేశారు.

# అయిదేళ్లపాటు రైతులను నిర్లక్ష్యం చేసిన వైసీపీ

- ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు
- అన్నదాత సుఖీభవ ద్వారా 16 వేల మంది రైతులకు రూ. 11.51 కోట్లు జమ
- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి
- సీఎం, డిప్యూటీ సీఎం, ప్రధానమంత్రి చిత్రపటాలకు రైతులు ధాన్యంతో అభిషేకం



**తణుకు (మనసులో మాట) నవంబర్ 19..** అయిదేళ్ల వైస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులను నిర్లక్ష్యం చేశారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేశారని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకంలో భాగంగా రెండో విడత రైతుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా బుధవారం తణుకు కమ్మ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను మోసం చేశారన్నారు. అయిదేళ్లలో రైతులను బూతులు తిడుతూ వారి పట్ల అవహేళనగా మాట్లాడుతూ స్థానికంగా మంత్రిగా పని చేసిన కారుమూరి వెంకటనాగేశ్వరరావు వ్యవహరించారని ఆరోపించారు.

### దాతృత్వం చాటుకున్న కిర్లంపూడి

# విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

### గుండెకు రంధ్రంతో బాధపడుతున్న బాలుడికి 3 లక్షల రూపాయలు అందజేత



**కిర్లంపూడి (మనసులోమాట) నవంబరు 19..** దాతృత్వం ఉంటే మన దగ్గర లేకపోయినా ఎదుటి వారి ద్వారా కూడా సహాయపడవచ్చని జిల్లా విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం,కిర్లంపూడి మండలం విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గానుగుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు నిరూపించారు.కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన 7 సంవత్సరాల నెల్లిపూడి కార్తీక్ కు గుండెకు రంధ్రం పడి అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ఆపరేషన్ కు 7 లక్షల రూపాయలు అవసరం కాగా, నాలుగు లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరయ్యాయి.మరో మూడు లక్షలు రూపాయలు దాతల సహాయం కోసం బాలుడు తల్లి సోషల్ మీడియా ద్వారా తెలియజేయడంతో విషయం తెలుసుకున్న కిర్లంపూడిమండలం విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం, జిల్లా సంఘం నాయకులు సోషల్ మీడియా ద్వారా విషయాన్ని విస్తృతపరిచారు.దీంతో విషయం తెలుసుకున్న హైదరాబాద్ కు చెందిన విశ్వంలోవిలీనం ట్రస్ట్ అధినేత పెంటా శ్రీనివాస ఆచార్య కాకినాడ నగరానికి చెందిన బంగారు పనివారల సంఘం తరపున అరటకట్ల రామ్మోహన్ రావు, కాకినాడ జిల్లా విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం, కిర్లంపూడి మండలం విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం, జగపతినగరం గద్వాల్ యూత్ సభ్యులు కిర్లంపూడి కామాక్షి జూయలర్స్ అధినేత, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తల వీరప్రసాద్, బ్రహ్మంగారి ఆలయ కమిటీ సభ్యులు కొత్తల శ్రీను, మరో దాత మండా శ్రీరామ్ ద్వారా సేకరించిన మొత్తం 3 లక్షల రూపాయలను బాధిత బాలుడు కార్తీక్ తల్లి నెల్లిపూడి శివగనిదుర్గకు బుధవారం కిర్లంపూడి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కిర్లంపూడి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అందజేశారు. ఈ సందర్భంగా బాధితుని తల్లి శివగనిదుర్గ మాట్లాడుతూ నా బాబు ఆపరేషన్ కోసం సొంత బిడ్డలా ఆదరించి 3 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేసినందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. మండల కమిటీ నాయకులు గానుగుల శ్రీనివాసరావు, కొత్తల వీరప్రసాద్ మాట్లాడుతూ మన సంఘ బిడ్డకు ఆపద వచ్చిందని తెలియజేయగానే మన సంఘ శ్రేయోభిలాషులు స్పందించి ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం కార్యదర్శి కొమ్మోజు సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ముదపాక రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదగాడు నరసింహమూర్తి, పలువురు రాష్ట్ర,జిల్లా నాయకులతోపాటు మండల కమిటీ కార్యదర్శి పెదగాడి లోవరాజు, దివిలి అచ్చారావు, కొత్తల శ్రీను,లక్కోజు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



# 23న మెగా జాబ్ మేళా

- నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలి
- అనపర్తి ఎమ్మెల్యే ఎమ్మెల్యే నల్లమిల్లి

**అనపర్తి( మనసులో మాట) నవంబరు 19:** అనపర్తి మండలం రామవరంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మీడియా మాట్లాడుతూ, అనపర్తి నియోజకవర్గం పరిధిలో మెగా జాబ్ మేళాను అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ బాయ్స్ హైస్కూల్ లో నవంబర్ 23వ తేదీ ఆదివారం నిర్వహించడం జరుగుతుందని, వికాస సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతోందని, దాదాపుగా 20,000 వేకెన్సీస్ కి సంబంధించి ఈ జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతోందని అన్నారు.. ముఖ్యంగా ఉదయం 8 గంటల నుంచి అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ బాయ్స్ హైస్కూల్ లో ఈ కార్యక్రమం మొదలై, సాయంత్రం వరకు జరుగుతుంది.అదే రోజున ఆఫర్ లెటర్స్ కూడా ఎవరైతే ఎంపికైన వారున్నారో, వారందరికీ ఇవ్వటం జరుగుతుంది. ప్రధానంగా దాదాపుగా పెద్ద పెద్ద కంపెనీలు 35 కంపెనీలు దీనిలో భాగస్వామ్యం వహిస్తా ఉన్నాయి. పీపుల్ టెక్ గాని,సదర్ ల్యాండ్ కానీ,ఇసుజి, టాటా ఎలక్ట్రానిక్స్ గాని,హెూండాయ్ , అలాగే యాక్సిస్ బ్యాంకు , డెక్కన్ ఫార్మా వంటి ప్రముఖమైన కంపెనీలు దీనిలో పాటిస్పేట్ చేస్తా ఉన్నాయి . ఈరోజు నుంచి కూడా అనపర్తిలో ఏదైతే మా కార్యాలయం ఉందో ఆ కార్యాలయంలో కూడా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది. తప్పనిసరిగా ఈ సదవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కొరత ఉన్నాను.అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ బాయ్స్ హైస్కూల్ లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం మొదలవుతుంది తప్పనిసరిగా అందరూ ఈ సదవకాశాన్నీ వినియోగించుకోవాలని ఏదైతే ప్రభుత్వం ఇవాళ చంద్రబాబు నాయుడు కాని,లోకేష్ గాని ఎన్నికల ముందు నిరుద్యోగులకని, ఆ రోజు ప్రామిస్ చేశారో ఆ ప్రామిస్ కి అనుగుణంగా ఇవాళ అన్ని రకాలుగా ఉన్న అవకాశాలు అన్నిటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తావున్నాము. దానిలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతా ఉంది. పెద్ద ఎత్తున జరిగే ఈ మెగా జాబ్ మేళాని అందరూ తమ తమ అర్హతలను బట్టి ఉద్యోగాలను సాధించుకునే దిశగా ప్రయత్నం చేస్తారని, మీ అందరి ప్రయత్నానికి మా అందరి మద్దతు ఉంటుందని, తప్పనిసరిగా అందరికీ మా సహకారంతో మీరందరూ మీ ఉద్యోగాలని సాధించాలని విజ్ఞప్తి చేసుకుంటూ, తప్పనిసరిగా నవంబర్ 23వ తేదీ ఆదివారం నాడు ఉదయం 8 గంటల నుంచి అనపర్తి శ్రీ రామారెడ్డి జడ్పీ బాయ్స్ హైస్కూల్ లో ఈ కార్యక్రమం మొదలు పెట్టడం జరుగుతోంది ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని సవినయం గా విజ్ఞప్తి చేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకాడ వెంకటరావు కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సహకారం.

### ఐదు లక్షల రూపాయల చెక్కులు అందించిన

# యువ నేతలు బొద్దిరెడ్డి



**ఏలేశ్వరం (మనసులో మాట) నవంబర్ 19..** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం నగర పంచాయతీ లోని 6 వ వార్డులో మేస్త్రీ కాకాడ రాజు ఇటీవల సోమవారం గ్రామం వద్ద 16వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం తో జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సహకారాలతో ప్రభుత్వం అందించిన నష్టపరిహారంగా 5 లక్షలు రూపాయలు కాకాడ రాజు కుటుంబ సభ్యులకు బుధవారం ఏలేశ్వరం టౌన్ టిడిపి యువ నాయకులు బొదిరెడ్డి గోపాలకృష్ణ,మూది నారాయణస్వామి చేతులా మీదగా కుటుంబ సభ్యులకు అందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కోణాల వెంకటరమణ పెంద్ర శ్రీను ఎండగుండి నాగబాబు అనంతరపు రాజు సామంతుల గోపి నడిపల్లి శివ సిహెచ్ సి వైస్ చైర్మన్ జొన్నాడ వీరబాబు శంకర్ గెద్ద అప్పన్న బుర్ల మణికంఠ కాకర వెంకటరావు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

# కవి ఆవంత్స సోమ సుందర్ కు ఘన నివాళి



**పిఠాపురం ( మనసులో మాట), నవంబరు 19:** ప్రముఖ అభ్యుదయ కవి, 'వజ్రాయుధం' ఆవంత్స సోమ సుందర్ జయంతిని పిఠాపురం లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్ఆర్ బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆవంత్స సోమ సుందర్ చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జన విజ్ఞాన వేదిక ప్రతినిధి డాక్టర్ ఎన్ సూర్యనారాయణ మాట్లాడుతూ కవి సోమ సుందర్ సాహిత్య లోకానికి చేసిన సేవలను వివరించారు. తెలుగు సాహిత్య రంగంపై సోమసుందర్ వేసిన ముద్ర చిరస్మరణీయమైనదని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ నేటి యువత వజ్రాయుధ కవి ఆవంత్స సోమ సుందర్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మానవతా విలువలు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవ పథకం అధికారులు కాశీ విశ్వనాథం, శోభన బాబు, హుస్సేన్ మొహియుద్దీన్, లెక్చరర్ శారద పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్విజ్ పోటీలు



**ప్రత్తిపాడు (మనసులోమాట), నవంబరు 19:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గెద్దనాపల్లి శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి దన్నిన శంకరరావు సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నూకరాజు, సాయికుమార్, లోవరాజు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాలన్నారు. దిన పత్రికలు చదవటం వల్ల ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అన్ని విషయాలు అవగతం అవుతాయన్నారు. గ్రంథాలయ ఉద్యమ సారథులు అయ్యంకి వెంకటరామయ్య, చిలకమర్తి లక్ష్మీనరసింహ పంతులు వంటి ఎందరో మహానుభావులు కృషి వల్ల స్వాతంత్రానికి ముందు నుండి చాలా గ్రామాల్లో గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి అన్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరగటం వల్ల వార్తా పత్రికలు వదిలేసి సెల్ ఫోన్లలో వాట్సప్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాలపై ఆధారపడి సమగ్రంగా ఏ విషయాన్ని తెలుసుకోలేని పరిస్థితికి నేటి సమాజం అలవాటు పడిపోయిందన్నారు. మనం ప్రతి విషయాన్ని చదవటం నేర్చుకుంటే జీవితాంతం చదివిన విషయాన్ని జ్ఞాపకం పెట్టుకోవచ్చు అన్నారు. ఈ క్రమంలోనేటి విద్యార్థులు చూడటం కంటే చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. గ్రంథ పాలకుడు శంకర్రావు మాట్లాడుతూ విద్యార్థులు, యువత, గ్రామస్థులు తరచూ గ్రంథాలయానికి వచ్చి పత్రికలు, పుస్తకాలు చదవటాన్ని దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని అన్నారు. ఈ గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు ఉన్నాయని, పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అంతా ఇక్కడ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, పుస్తక ప్రియులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆదాయ వనరులు పెంచుకోవటం పై అవగాహన



**తణుకు (మనసులో మాట) నవంబర్ 19..** అత్తిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయము నందు బుధవారం ఎంపీపీ మక్కా సూర్యారావు మరియు ఎంపీడీఓ పి. శామ్యూల్ అధ్యక్షాతన మండల లెవెల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ – 5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ ఆన్యువల్ యాక్షన్ ప్లాన్( 2025 – 2026)పై ట్రైనింగ్ ఏర్పాటు చేసి కార్యక్రమము ప్రారంభం అయింది. ముందుగా మహాత్మ గాంధీ కి మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసారు. అనంతరం కార్యక్రమమునకు ముఖ్య అతిథి గా వచ్చిన ఎంపీపీ మక్కా సూర్యారావు కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. అలాగే గ్రామ పంచాయతీల యొక్క ఆదాయ వనరులు పెంచుకోవడం ఎలా అనే అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి. శామ్యూల్ , మండలములోని సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,డిప్యూటీ ఎంపీడీఓ , ఎన్. ఆర్. ఇ.జి.ఎస్ ఎ.పి.ఓ ప్రసాద్ ,పంచాయతీ కార్యదర్శి లు,ఎం. ఓ. టి లు బి.జి.ప్రసాద్, ఎం.శ్రీఖర్,సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం | చిత్తూరు | కడప
గురువారం 20 నవంబర్ 2025




## ఎమ్మెల్యేను సన్మానించిన ఖాజీ ఫక్రుద్దీన్

**పలమనేరు నవంబర్ 20( మనసులో మాట) :** పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని బైరెడ్డిపల్లి మండలానికి చెందిన ఫక్రుద్దీన్ ఖాజీ బుధవారం సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. బైరెడ్డి పల్లి మండలం కడపనత్తం గ్రామానికి చెందిన హిదయతుల్లా కుమారుడైన ఫక్రుద్దీన్ ను ఖాజీగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. బైరెడ్డి పల్లి మండలంలోని 17 మసీదులకు తనను ఖాజీగా నియమించి ప్రభుత్వానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజా పీర్, ఇమామ్ సాబ్, పాల్ రసూల్ భాషా, హఫీజ్ హుస్సేన్, ఇబ్రహీం, అసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### కె.హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో
## ఎన్‌సి సి గ్రూపు కమాండర్ సందర్శన



**ధర్మవరం (మనసులో మాట) నవంబర్ 19..** పట్టణం లోని కె.హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు కల్నల్ అలోక్ త్రిపాఠి, గ్రూప్ కమాండర్ , ఎన్ సి సి గ్రూప్ కర్నూల్, కల్నల్ మానీష్ సుబ్బా ఆఫీసర్ కమాండింగ్ 6(ఏ) బి ఎన్. ఎన్ సి సి, అనంతపురం, కల్నల్ ఎల్. డి. రోడ్రీజ్ 6(ఏ) గర్ల్స్ బి ఎన్ అనంతపురం, ఇతర ఎన్. సి. సి. సిబ్బంది కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల తో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కల్నల్ అలోక్ త్రిపాఠి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్ సి సి ప్రాధాన్యత ను వివరించి, చేయాల్సిన ఆవశ్యకత ను వివరించారు. భవిష్యత్తు లో చేరడం వల్ల ఉండే ఉపయోగాలను తెలిపారు. జీవితంలో అత్యున్నత స్థానానికి చేరుటలో ఎన్ సి సి కీలక పాత్ర పోషిస్తుందని ఎన్.సి.సి.క్యాడెట్లకు అభివందనలు తెలిపారు. ఈ కార్యక్రమం ఎన్.సి.సి.ఎ.ఎన్.ఓ. లెఫ్టినెంట్ యస్. పావని, పర్యవేక్షణ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ . పావని, ఎస్.చిట్టెమ్మ, ఎ కిరణ్ కుమార్ ,డా ఎస్. షమీఉల్లా డా.. బి. గోపాల్ నాయక్ యం భువనేశ్వరి , యం పుష్పావతి, బి.ఆనంద్,జీ. మీనా, జీ.ధనుంజయ తదితర అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.




### ఆంధ్రప్రదేశ్ క్రీడాకారునికి
## రజత పథకం

**ధర్మవరం నవంబర్ 19 (మనసులో మాట)..** మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామములో ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం విక్రాంత్ 45 కేజీల విభాగంలో రెండవ స్థానములో నిలుస్తూ తద్వారా రజత పథకం సిల్వర్ మెడల్ సాధించడం జరిగిందని పాఠశాల హెడ్మాస్టర్ పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ సబ్ జూనియర్ జూడో పోటీలలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారునికి రజత పథకం సిల్వర్ తెలంగాణలోని హైదరాబాదులో 16వ తేదీ నుంచి జరుగుతున్న జాతీయ సబ్ జూనియర్ జూడో ఛాంపియన్షిప్లో ఆంధ్రప్రదేశ్లోని సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలోని చిగిచెర్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి 45 కేజీల విభాగంలో రెండవ స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయమని వారు తెలిపారు. ఈ 45 కేజీల పోటీలలో మొత్తం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల క్రీడాకారులు మొత్తం 32 మంది పాల్గొనడం జరిగిందని వారు తెలిపారు. మణిపూర్ రాష్ట్రానికి స్వర్ణ పథకం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రజత పథకం మధ్యప్రదేశ్ గుజరాత్ రాష్ట్రాలకు కాంక్ష పథకం సాధించడం జరిగిందని తెలిపారు. జాతీయ సబ్ జూనియర్ జూడో పోటీలలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారునికి 10 సంవత్సరాల తర్వాత వెండి పథకం సాధించడం విశేషమని వారు అభినందించారు.

## నేటినుండి అయ్యప్ప మాల ఆధారణ భక్తాదులకు
## అన్నవితరణ
### బిజెపి జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి



ధర్మవరం నవంబర్ 19 (మనసులో మాట) పట్టణం లోని శ్రీ షిరిడి సాయిబాబా మంది రములో ఈనెల 20వ తేదీ గురువారం నుండి అయ్యప్ప స్వామి మాలాధారణ భక్తాదులకు అన్న వితరణ కార్యక్రమాన్ని (భిక్ష) నిర్వహిస్తున్నట్లు బిజెపి జిల్లా కార్యదర్శి డోల రాజారెడ్డి దంపతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం వల్ల ఆ దంపతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మాలాధారణ వేసిన అయ్యప్ప భక్తులు తప్పకుండా ఈ భిక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాన్ని డోలా రాజారెడ్డి దంపతులు నిర్వహించడం శుభదాయకమని, ఇది దైవ సేవతో సమానమని షిరిడి సాయిబాబా సేవా సమితి కమిటీ వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.


### ఎస్ వి సి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు



పలమనేరు నవంబర్ 20 (మనసులో మాట): స్థానిక ఎస్ వి సి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.... విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వెళ్లి గొప్ప పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని తెలిపారు. గ్రంథాలయాలలో వివిధ రంగాలకు సంబంధించిన పుస్తకాలు ఉంటాయని వాటిని చదవడం వల్ల విశ్వసనీయ సమాచారాన్ని తెలుసుకోవచ్చని పుస్తక పఠనం వ్యక్తి యొక్క వికాసానికి తోడ్పడుతుందని విద్యార్థులకు సూచించారు. క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు ఎవరైతే వెళతారో వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నందీశ్వరయ్య మాట్లాడుతూ... ఫాదర్ ఆఫ్ లైబ్రరీగా ఎస్సార్ రంగనాథన్ గురించి విశేషంగా విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు తలచుకుని పుస్తకాన్ని చదివితే తలెత్తుకొని తిరిగేలా పుస్తకాలు మారుస్తాయని సూచించారు. లైబ్రరీ ఇంచార్జ్ డాక్టర్ ఈ వాసు మాట్లాడుతూ... ప్రతిరోజు దినపత్రికలు వార మాస పత్రికలను సంపాదకీయాలను చదవాలని సూచించారు. ఐక్యూ ఎస్ ఎ కోఆర్డినేటర్ డాక్టర్ బెనజీర్ మాట్లాడుతూ.... చిరిగిన చొక్కా అయినా తొడుక్కోగానే ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కొని కందుకూరి వీరేశలింగం పంతులు నిర్వచనాలను మరొకసారి విద్యార్థులకు సూచించారు. లైబ్రరీఏయన్ వెంకట సుధా, సంచాలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశికళ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గొట్లూరులో పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ

- వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు-రైతు అభివృద్ధే లక్ష్యం: మంత్రి సత్యకుమార్ సందేశం
- వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగమే భవిష్యత్తు : మంత్రి సత్యకుమార్ యాదవ్
- వ్యవసాయం దేశపు వెన్నెముకురైతు కోసం 20,000 వార్షిక అండ : ఎంపీ పార్థసారథి
- సూపర్ సిక్స్‌తో ప్రజల నమ్మకం తిరిగి తెచ్చుకున్న ప్రభుత్వం: గొట్లూరులో పరిటాల శ్రీరామ్
- అన్నదాత సుఖంగా ఉంటే రాష్ట్రం సుఖంగా ఉంటుంది : మధుసూదన్ రెడ్డి



ధర్మవరం రూరల్, నవంబర్ 19 (మనసులో మాట) ధర్మవరం రూరల్ మండలం, గొట్లూరు గ్రామంలో పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి, ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి గార్లతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ,. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వంటి చారిత్రాత్మక పథకాలను అమలులోకి తీసుకువచ్చారని, గత పదేళ్లలో 11 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి 20 విడతల్లో రూ.3,70,000 కోట్లు నేరుగా జమ చేసినట్టు తెలిపారు. ఇవాళ కోయంబత్తూరులోంచి ప్రధాని గారు 21వ విడతగా మరో రూ.18,000 కోట్లను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేయడం దేశవ్యాప్తంగా వ్యవసాయం పట్ల ప్రభుత్వం చూపుతున్న అంకితభావానికి నిదర్శనం అని అన్నారు. రాష్ట్రంలో అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నో ఆర్థిక సమస్యల మధ్య కూడా రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చే రూ.6,000కు తోడు రాష్ట్ర ప్రభుత్వం మరింత ముందడుగువేసి రూ.14,000 అందిస్తూ ఏడాదికి రైతుకు మొత్తం రూ.20,000 ఇవ్వడం ద్వారా, అన్నదాతకు గౌరవం ఇవ్వడం తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈరోజు రెండవ విడత కింద కేంద్రం రూ.2,000, రాష్ట్రం రూ.5,000 చొప్పున మొత్తం రూ.7,000 రైతుల ఖాతాల్లోకి జమ చేసినట్లు తెలిపారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగం పెరిగి పంటాల ఉత్పత్తి, మార్కెట్ అవకాశాలు, ధరలు రంగాల్లో మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ రమణా నాయక్, ఏడి లక్ష్మానాయక్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ముస్తఫా, ఆర్ ఎస్ కె సిబ్బంది, మార్కెట్ యార్డ్ చైర్మన్ అంబటి అరుణశ్రీ, వైస్ చైర్మన్ అయ్యప్ప, ఏపీ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, గొట్లూరు సర్పంచ్ పిట్ట నరసమ్మ, బిజెపి రూరల్ మండల అధ్యక్షులు చంద్ర, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలకు రూ. 25.83 కోట్ల చెక్కు
### పండుగ వాతావరణంలో అన్నదాత సుఖీభవ రెండో విడత పంపిణిలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



పలమనేరు నవంబర్ 20 ( మనసులో మాట) :రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, ఎటువంటి ఆదాయం లేకున్నా అన్నదాతలకు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతన్నలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటున్నదని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన అన్నదాత సుఖీభవ రెండో విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేపట్టి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ శాఖా అధికారులు కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరించగా పలువురు వక్తలు ప్రశంగించారు. తదనంతరం ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం నియోజకవర్గంలోని పలమనేరు మండలానికి చెందిన 5478 మంది రైతులకు రూ. 3.53 కోట్లు, బైరెడ్డిపల్లి మండలంలోని 7983 మంది రైతులకు రూ. 5.26 కోట్లు, పెద్దపంజాణిలో 7553 మంది రైతులకు రూ. 5.06 కోట్లు, వి. కోటకు గాను 9903 మందికి రూ. 6.59 కోట్లు, గంగవరం మండలానికి సంబంధించి 7451 మంది రైతులకు గాను 5.37 కోట్లకు చెందిన మొత్తం రూ. 25.83 కోట్ల చెక్కును ఆయన రైతులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఈ రోజు రైతన్నల ఖాతాలో నగదు జమ కావడం ఆనందించదగ్గ విషయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్ వి బాలాజీ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, సోమశేఖర్ గౌడ్, ఆనంద్, నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, ఖాజా, నాగరాజుల దీపికా కృష్ణమూర్తి, కిరణ్, బిఆర్సి కుమార్, భాస్కర్ యాదవ్, సెల్వరాజ్, గణేష్, నాగరాజ్, సుధాకర్, కృష్ణారెడ్డి, తో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దిలీప్ కుమార్, సింగిల్ విండో అధ్యక్షులు, కౌన్సిలర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు, అగ్రికల్చర్ ఆఫీసర్లు సంధ్యా, రఖీభా, హేమలత, అప్పోజీ, గీతా కుమారి, సిరికల్చర్ ఆఫీసర్ ఫిరోజ్ భాషా లతో తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ రక్షణకు ధర్మవరం న్యాయవాదుల ఐక్య సంకల్పం
### - గుంటూరు మహాసభకు ఘన మద్దతు -




**ధర్మవరం నవంబర్ 19 (మనసులో మాట)..** రాజ్యాంగ పరిరక్షణకు ఈనెల 22వ తేదీన గుంటూరులో కాన్స్టిట్యూషన్ డే జరుగుతున్న సందర్భంగా ధర్మవరం కోర్టు ఆవరణంలో దానికి సంబంధించిన పోస్టర్లు న్యాయవాదులు విడుదల చేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు, న్యాయ వ్యవస్థ బలోపేతానికి, ప్రజాస్వామ్య విలువల నిలబెట్టడానికి ధర్మవరం న్యాయవాదులు ఐక్యంగా సంకల్పం ప్రకటించారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 22, న గుంటూరులో జరగబోయే రాజ్యాంగ దినోత్సవ మహాసభకు ధర్మవరం తరపున ఘన మద్దతు తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్పందన లభిస్తోంది అని న్యాయవాదులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ మంత్రి , ప్రముఖ న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు, సీనియర్ అడ్వకేట్లు వివిధ జిల్లాల మేధావులు ఈ సభలో పాల్గొనబోతున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఈడబత్తిని ప్రసాద్, నరసింహామూర్తి, భాస్కర్, పెద్దన్న, బాబా, అశోక్, రంగా నాయుడు, విశ్వనాథ్, శివ బాబు, ధర్మవరం బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జ్ సాకే వినయ్ కుమార్, పార్టీ కార్యదర్శి సాకే హరికుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## యువత వ్యవసాయం వైపు అడుగులు వేయాలి..



**ధర్మవరం నవంబర్ 19 (మనసులో మాట)..** ధర్మవరం నియోజకవర్గంలో 39వేల మంది రైతులకు రూ.26.50 కోట్ల లబ్ది చేకూర్చడం జరిగిందని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలోనే హెచ్చెల్సీ-హంద్రీనీవాను అనుసంధానం చేస్తాం అని తెలిపారు. పరిశ్రమలు ఎంత అవసరమో.. వ్యవసాయం కూడా అంతే అవసరమని తెలిపారు. వ్యవసాయం అన్నది రోజు రోజుకు తగ్గిపోతుందని... ఇది దేశానికే ప్రమాదకరమని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ రెండో విడత నిధులు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గొట్లూరు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్, హిందూపురం ఎంపీ పార్థసారథి, జనసేన ఇన్ ఛార్జి చిలకం మధుసూదన్ రెడ్డి, రైతులు, అధికారులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు ఎంతో ఇబ్బంది పడ్డారని.. అలాంటి కష్టాల నుంచి సూపర్ సిక్స్ అనే ఒక బలమైన అస్త్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. దీనిపై ప్రజలు కూడా నమ్మి కనీవినీ ఎరుగని రీతిలో మనకు విజయాన్నందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం మొదలుపెట్టిందన్నారు. ఇందులో భాగంగా పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద మొదటి విడత ఒక్కో రైతుకు 7వేల రూపాయలు అందించినట్లు తెలిపారు. ఇప్పుడు రెండో విడత కింద మరో 7వేల రూపాయలు అందుతుందన్నారు. దీనివలన రైతులు జీవితాలు బాగుపడతాయని తాము చెప్పడం లేదని.. కానీ రైతులకు ఎంతో కొంత సాయంగా ఇది ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారత దేశంలో వ్యవసాయ భూమి ఎక్కువగా ఉందన్నారు. కానీ ఇటీవల చాలామంది రైతులు వ్యవసాయంలో గిట్టుబాటు ధరలు రాక , పంటలు పండక.. సాగుకు దూరమవుతున్నారన్నారు మంత్రి సత్య కుమార్ సహకారంతో ధర్మవరం నియోజకవర్గంలో చాలా ప్రాంతాలకు సాగునీరు అందుతోందన్నారు. ప్రస్తుతం హెచ్చెల్సీ నీరు తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం రూరల్ మండలాలకు అందడం లేదన్నారు. మంత్రి సత్య కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారంతో హంద్రీనీవా, హెచ్ఎల్సీ కాలువలు అనుసంధానం చేసి మూడు మండలాలకు సాగునీరు ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇది త్వరలోనే సాధ్యమవుతుందని పరిటాల శ్రీరామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



## ప్రపంచ ఏఎంఆర్ అవగాహన వారోత్సవాలు

పలమనేరు నవంబర్ 20 ( మనసులో మాట): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన ఆరోగ్యకరమైన మహిళలు- బలమైన కుటుంబాలుగా తీర్చిదిద్దే ప్రపంచ ఏ.ఎం.ఆర్ అవగాహన వారోత్సవాలు 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరిగే కార్యక్రమాలలో భాగంగా 19వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించుటకు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రపంచ ఏ ఎం ఆర్ అవగాహన వారోత్సవాలు అనేది భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన దేశవ్యాప్త ఆరోగ్య కార్యక్రమం ఇది భారతదేశం అంతట మహిళలు పిల్లలు ఆరోగ్యం పోషక ఆహారాన్ని మెరుగుపరచడం పై దృష్టి సాధించి మహిళల యొక్క ఆరోగ్యం పై కీలక పాత్రను తెలియజేశారు. మహిళలు యుక్త వయసు బాలికలు పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుట, పోషక ఆహారం పరిశుభ్రతపై ఆరోగ్యం కౌన్సిలింగ్ అవగాహన నిర్వహించుట, రోగ నిరోధకత పిల్లల ఆరోగ్య కవరేజీని బలోపేతం చేయడం, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ యుగంధర్, ఆర్ ఎం ఓ, డాక్టర్ లత, సచివాలయ సిబ్బంది, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల సాధారణ సర్వసభ్య సమావేశం




**పలమనేరు నవంబర్ 20 ( మనసులో మాట):** మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం 2గంటలకు ఎంపీపీ రోజా అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరైనారు. ఇందులో ఒక్కొక్క శాఖ అధికారులు వచ్చి ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఏమి అభివృద్ధి చేశా రో తెలియజేశారు. మొదట ఆరోగ్య శాఖకు సంబంధించి డాక్టర్ కులమాసనపల్లె పీహెచ్సీ లో రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. వెలుగు సంబంధించి గ్రూపు మహిళలకు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. 96 సంఘాలు ఉన్నాయన్నారు. రెవెన్యూ శాఖలో తాసిల్దార్ మాట్లాడుతూ... ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంకను ఇతర ప్రాంతాలలో ఉన్న కుటుంబ సభ్యులు 620 రేషన్ కార్డులు పెండింగ్లో ఉన్నాయన్నారు. ఎస్సీ కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు గ్యాస్ కనెక్షన్ పొందని వారిని 81 మందిని గుర్తించడం జరిగిందన్నారు. దారిద్ర రేఖ కొద్దిగా ఉన్న కుటుంబ సభ్యులకు నివాస స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జల్లిపేట సంబంధించి స్మశానం సర్వే చేయాలని ఓ మహిళ సమావేశంలో తాసిల్దారుకు విన్నవించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ముడి వారి పల్లె రోడ్డు, ఊసరపెంట రోడ్డు, ఏటిగడ్డ ఇండ్లు, బీసీ హాస్టల్, సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామాలలో త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏ గ్రామంలో కూడా రాగును ఏ గ్రామంలో కూడా త్రాగునీటికి ఇబ్బందులు పడకూడదన్నారు. మోటర్లు రిపేరీ వచ్చినప్పుడు దానికి ఖర్చు ఎక్కువగా చేస్తున్నారని ఎంపీడీవో భాస్కర్ తెలియజేశారు. నాణ్యత మోటర్లు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, ఎంపీడీవో భాస్కర్,ఎంపీపీ రోజా, వైస్ ఎంపీపీ జయ శ్రీ,సింగల్ విండో అధ్యక్షులు పెద్దబ్బ, వైస్ ఎంపీపీ గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన ఇందిరాగాంధీ జయంతి వేడుకలు..
### గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి




**ధర్మవరం నవంబర్ 19 (మనసులో మాట)..** పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల పౌర శాఖ గ్రంధాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఇందిరాగాంధీ జయంతి వేడుకలను గ్రంధాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హరిజనవాడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ కవితా పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంధాలయ అధికారిని, ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఇందిరాగాంధీ జీవిత చరిత్ర గురించి వారు ప్రధానంగా పనిచేస్తున్న రోజులు తీసుకున్నటువంటి అనేక సాహసోపేతమైన నిర్ణయాన్ని గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. అదేవిధంగా మహిళా సాధికారిక పై అవగాహన కల్పిస్తూ నేడు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా భారత తొలి రాష్ట్రపతి ద్రౌపతి ముర్మూ అని తెలుపుతూ, మహిళలకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది రాము, రమణ నాయక్, సరస్వతమ్మ ,గంగాధర్ తో పాటు వెన్నెల, రాజేశ్వరి, వైష్ణవి, కేపీఎల్ మున్సిపల్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**పెనుమూరు, నవంబర్ 19 ( మనసులో మాట):** గంగాధరనెల్లూరు నియోజకవర్గం వెదురు కుప్పం మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరమునకు గాను స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అన్నపూర్ణ శారద బుధవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని, కళాశాలలోని ఇంటర్మీడియెట్ తత్సమానమైన అర్హత కలిగిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు విద్యా శాఖాధికారులకు విన్నవించామని తెలిపారు. కోర్సులలో చేరాలనుకొనే వారు 21-11-2025 లోపు సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 -2026 విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో అందుబాటులో ఉండే వివిధ కోర్సులు, బీఏ హానర్స్ ఎకనామిక్స్, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులన్నీ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో చేరదలిచిన వారు సంబంధించిన సర్టిఫికెట్లన్నీ (టీసీ, స్టడీ, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్,) ఒరిజినల్తో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో కళాశాలలో ఈ నెల 21వ తేదీ లోపు సంప్రదించాలన్నారు. వివరాలకు.. భరణి నాథ్ రెడ్డి 9885125771, నరేంద్ర బాబు 7702917803, భీమ మోహన రావు 9704425888 సంప్రదించాలని కోరారు.

# ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

- ఐదురోజుల కస్టడీకి కోర్టు అనుమతి




**హైదరాబాద్,నవంబర్ 19 (మనసులో మాట):**

పైరసీ సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్టైన తరవాత పోలీసులు కస్టడీ కోరారు. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు రవి కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి నుంచి ఐబొమ్మ రవిని కస్టడీలోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించనున్నారు. పైరసీ మాఫియాకు సంబంధించిన వివరాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు.వారం రోజుల పాటు ఇమంది రవిని కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి.. రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించారు. కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసుపై ఈడీ దృష్టి సారించింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐబొమ్మ కీలక సూత్రధారి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు గత శనివారం కూకట్‌పల్లిలో అరెస్టు చేశారు. ఓటీటీ వేదికల్లోని కంటెంట్ సహా కొత్తగా రిలీజ్ అయిన సినిమాలు పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగించాడు. గత ఏడేళ్లుగా ఐ బొమ్మ, బప్పం, ఐవిన్, ఐరాధ టీవీ పేర్లతో వెబ్‌సైట్‌లు నిర్వహించాడు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
గురువారం 20 నవంబర్ 2025


## ఇస్లాంలో బలిదానానికి తావులేదు

**ఉమర్‌ది ముమ్మాటికీ ఉగ్రవాదమే**

**ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించిన ఓవైసీ**



**హైదరాబాద్,నవంబర్19 (మనసులో మాట):**

ఎర్రకోటవద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీకి చెందిన వీడియో ఒకటి వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అందులో అతడు ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ మాట్లాడాడు. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. అయితే, ఆత్మాహుతి దాడి గురించి ఉమర్ చేసిన వ్యాఖ్యలను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఇస్లాంలో ఆత్మహత్య, అమాయకులను చంపడం ఘోరమైన పాపమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ఢిల్లీ పేలుళ్ల నిందితుడు ఉమర్ నబీ ఆత్మాహుతి బాంబు దాడిని సమర్థిస్తున్న వీడియో ఒకటి ప్రచారంలో ఉంది. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. అయితే, ఇస్లాంలో ఆత్మహత్య, అమాయకులను చంపడం ఘోరమైన పాపం. ఇలాంటి చర్యలు దేశ చట్టాలకు కూడా పూర్తి విరుద్ధం. దీన్ని తప్పుగా అర్థం చేసుకోవడానికి ఏమీ లేదు. ఇది ముమ్మాటికే ఉగ్రవాదమే' అని ఒవైసీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు దేశ రాజధాని సమీపంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం, ఢిల్లీ పేలుడుతో ముడిపడి ఉన్న ఉగ్రవాద మాడ్యూల్‌పై ఒవైసీ కేంద్రాన్ని ప్రశ్నించారు. 'గత ఆరు నెలల్లో స్థానిక కశ్మీరీలు ఎవరూ ఉగ్రవాద సంస్థల్లో చేరలేదని ఆపరేషన్ సిందూర్, మహదేవ్ సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటుకు తెలిపారు. మరి ఈ గ్రూపు ఎక్కడి నుంచి వచ్చింది..?' అంటూ ఆయన నిలదీశారు. ప్రస్తుతం ఒవైసీ ట్వీట్ వైరల్ అవుతోంది. కశ్మీర్‌కు చెందిన కొందరు వైద్యుల మాటున ఉగ్రకార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్న సమయంలోనే ఈ నెల 10వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ వద్ద కారులో పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 15 మంది మరణించారు. ఇక ఈ పేలుడుకు పాల్పడింది ఓ వైద్యుడిగా అధికారులు గుర్తించారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ వైద్యుడు ఉమర్ నబీగా గుర్తించారు. ఈ మేరకు అతడితో సంబంధం ఉన్న వ్యక్తులను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ విచారణలో ఉమర్ ఓ కరుడుగట్టిన ఉగ్రవాది అని తేలింది. ఉగ్ర దాడుల గురించి అతడు ఉద్వేగభరితంగా మాట్లాడేవాడని సన్నిహితులు తెలిపారు.

## పార్టీలో ఉంటూనే సొంతవారిపై పోస్టులు

**ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదు**

**కార్యకర్తలకు బీజేపీ చీఫ్ హెచ్చరిక**




**హైదరాబాద్,నవంబర్ 19 (మనసులో మాట):**

పార్టీ కార్యకర్తలకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు వార్నింగ్ ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా సరే ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం అని హెచ్చరించారు. టైమ్ కూడా ఇవ్వం అని, అవసరం అయితే జైలుకు పంపిస్తాం అని కార్యకర్తలతో అన్నారు. కొందరు తాము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిత్వంను అస్సలు చంపుకోవద్దని సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి రామచందర్ రావు విజ్ఞప్తి చేశారు. బీజేపీ సోషల్ మీడియా, లీగల్ సెల్ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. 'పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం, టైమ్ కూడా ఇవ్వం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫేక్ అకౌంట్స్ ద్వారా బీజేపీపై పోస్టులు పెడుతున్నాయి. పార్టీ నేతలు ఒక మంత్రి దగ్గరకు వెళితే.. పిర్యాదు చేసేందుకు వెళ్లారని రాశారు. ఆ పేపర్ మీద రూ.5 కోట్ల పరువు నష్టం దావా వేశాం. మేము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారు. కేసులు పెట్టీ జైలుకు పంపిస్తాం. ఇప్పటికే కేసులు పెట్టాం. పార్టీ మీద ఎవరు పోస్టులు చేసినా కౌంటర్ ఇవ్వండి. బీజేపీ చిల్లర రాజకీయాలకు భయపడదు. దమ్ముంటే ముందుకు వచ్చి మాట్లాడండి' అని రామచందర్ రావు అన్నారు. 'డబ్బులిస్తే ఏది పడితే అది రాస్తున్నారు, మాట్లాడుతున్నారు. ఎవరిని ఉపేక్షించేది లేదు. యూట్యూబ్‌లో మాట్లాడుతున్నారు. ఒకరు దుబాయ్, మరొకరు అమెరికాలో ఉండి తిడుతున్నారు. మీరు ఇండియాకు రండి మీ సంగతి చెబుతాం. పార్టీ కార్యకర్తలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ నేతలు ఎవరిని ప్రోత్సహించినా, వాటిని ఫార్వర్డ్ చేసినా సిరియస్ యాక్షన్ ఉంటుంది. నా మీద కూడా ఫేక్ వార్తలు వస్తాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు వార్నింగ్ ఇస్తున్నా, మా మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయకండి. సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి విజ్ఞప్తి చేస్తున్నాం.. మీ వ్యక్తిత్వంను చంపుకోవద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కోరారు.

# పాలనలో ఇందిరాగాంధీ ఓ రోల్‌మోడల్

**ఆమె స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం**

**ఇందిరకు ఘనంగా నివాళి అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి**

- జయంతి వేడుకల సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ




**హైదరాబాద్,నవంబర్19 (మనసులో మాట):**

పరిపాలనలో ఇందిరా గాంధీ ఒక రోల్ మోడల్ అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. బలహీన వర్గాలకు ఇందిరమ్మ పాలన సువర్ణ అధ్యాయమని సీఎం రేవంత్ చెప్పారు. భూ సంస్కరణలతో పేదలకు భూ పంపిణీ చేశారని గుర్తుచేశారు. పాకిస్తాన్‌ను విడగొట్టి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారని, ప్రపంచ దేశాల బెదిరింపులకు ఇందిరమ్మ భయపడలేదని సీఎం రేవంత్ తెలిపారు. మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా.. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తున్నామని, మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిథ్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లను చేశామని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ పాలన దేశానికి దిక్సూచి అని సీఎం రేవంత్ కొనియాడారు. వైఎస్ఆర్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించారని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వామ్యులను చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. 65 లక్షల చీరలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పంపిణీ చేస్తామని, డిసెంబర్ 9 వరకూ ఇంటింటికీ చీరల పంపిణీ కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మార్చి ఫస్ట్ నుంచి 8 వరకూ రెండో విడతలో చీరల పంపిణీ ఉంటుందని, రెండో విడతలో 35 లక్షల చీరలను పట్టణాల్లో పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం డిసెంబరు 9 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకు నియోజకవర్గానికో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి.. వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తామని వివరించారు. ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశాం. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోంది. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలని సీఎం అన్నారు.

# మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అమెజాన్‌తో సంప్రదింపులు

**మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్‌లు, సోలార్ ప్లాంట్లు, బస్సులు**



- తెలంగాణ సంప్రదాయానికి అనుగుణంగా చీరెల పంపిణీ
- మహిళల ఉన్నతి-తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ
- సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) తయారు చేస్తున్న వివిధ వస్తువులను అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు అమెజాన్ వంటి సంస్థలతో ఒప్పందాల కోసం సంప్రదింపులు జరుపుతున్నట్టు సీఎం ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని సీఎం ఎ. రేవంత్ రెడ్డి బుధవారం నెక్లెస్ రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే 'ఇందిరా మహిళా శక్తి' చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం, రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లాల్లోని మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తెలంగాణ సంప్రదాయంలో ఆడబిడ్డలకు పుట్టింటివారు, అన్నదమ్ములు సారె చీర పెట్టడం ఆనవాయితీగా ఉందని, అదే విధంగా రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డను తోబుట్టువుగా భావించి తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి మహిళకు చీర అందిస్తుందని సీఎం అన్నారు. కోటి మంది అర్హులైన మహిళలకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

### చీరెల పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ

మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి పేరిట ఈ చీరెల పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతిమండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నవంబర్ 19 నుంచి డిసెంబర్ 9 వరకు 18 ఏళ్లు నిండిన మహిళలకు చీరెల పంపిణీ పూర్తి చేయాలని, ఇందుకోసం 65 లక్షల చీరలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు 35 లక్షల చీరలు పంపిణీ చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి మహిళకు చీర అందుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రజాప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సీపెక్) సమాచారాన్ని దగ్గర పెట్టుకొని ప్రతి మహిళకు చీర అందేలా చూడాలని, చీర అందించే సమయంలో ఆధార్ తీసుకొని, ముఖ గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని సీఎం కలెక్టర్లకు సూచించారు.

### మహిళా సంఘాలకు ప్రోత్సాహం:

మహిళల ఉన్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పెట్రోల్ బంక్‌లు, సోలార్ ప్లాంట్లు, బస్సులు మహిళా సంఘాలకు కేటాయిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన వడ్డీ లేని రుణాలను ఇవ్వడంతో పాటు అందుకు సంబంధించిన నిధులు కూడా విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు ఆర్టీసీ బస్సుల నిర్వహణలో మహిళలను యజమానులను చేశామన్నారు. పాఠశాల యూనిఫాంలు కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి రూ.30 కోట్ల ఆదాయం సమకూరిందని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో రూ.534 కోట్ల పనులు చేపట్టామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల బాధ్యతను కూడా మహిళా సంఘాలకే అప్పగించామని సీఎం వివరించారు. శిల్పారామం పక్కన రూ.వందల కోట్ల విలువైన 3 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళల గౌరవం పెంచాలనే ఉద్దేశంతోనే ఈ చీరెల పంపిణీని చేపట్టామన్నారు. రేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ చీరలు అందిస్తున్నామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ... మహిళా సంఘాల ఆర్థిక క్రమశిక్షణ కారణంగా బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వారి దగ్గరికే వస్తున్నాయని కొనియాడారు. 98 శాతం రుణ చెల్లింపుతో సంఘాలు తమ క్రమశిక్షణను చాటుతున్నాయన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరెల పంపిణీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని సూచించారు. ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలనే ఉద్దేశంతోనే ఆకాశం రంగును చీరలకు ఎంచుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సంఘాల ప్రశంసలు:

నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతితో మాట్లాడిన సీఎం, వారి సంఘం ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్ ఎలా నడుస్తోందని అడిగారు. నెలకు రూ.4 లక్షల రాబడి వస్తోందని ఆమె సీఎంకు తెలియజేశారు. ఇతర జిల్లాల నుంచి సంఘాలను తీసుకెళ్లి వారి పని తీరును చూపించాలని సీఎం కలెక్టర్లకు సూచించారు. అలాగే, రాజన్న సిరిసిల్ల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య మాట్లాడుతూ, ఇస్తున్న చీరెల డిజైన్లు ఎంతో బాగున్నాయని కృతజ్ఞతలు తెలిపారు. 9 మీటర్లు, 6 మీటర్ల చీరలు తమకు నచ్చినట్లు ఉన్నాయని, సంతోషంగా ఉందని ఆమె అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి చీరలు ఇవ్వడం ద్వారా తమకు యూనిఫాం వచ్చిందనే సంతోషం ఉందన్నారు. ఈ చీరలు ధరించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆమె అన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న చలితీవ్రత

## ఏజెన్సీలో మరింత పడిపోతున్న ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్,నవంబర్19 (మనసులో మాట):**

రాష్ట్రంలో చలిగాలులు తీవ్ర పెరుగుతోంది. దీనికితోడు రాత్రపూట చలి పెరిగింది. ఏజెన్సీ జిల్లాల్లో చలి పంజావిసురుతోంది. కొన్ని జిల్లాలలో వచ్చే రెండు రోజులు తీవ్రమైన చలి గాలులు వీస్తాయని వాతావరణశాఖ ఒక ప్రకటనలో హెచ్చరించింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్‌లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొన్నది. ఆదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కుమ్రంభీం, నిర్మల్ జిల్లాలతోపాటు మరో ఐదు జిల్లాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉన్నదని తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-యూలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.8 డిగ్రీలు, రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 14 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, చలిగాలుల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరించారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 19నాటికి దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నదని ప్రకటించింది. దీని ప్రభావంతో ఈ నెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 24 నుంచి 27వరకు తెలంగాణ, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. చలికి వర్షాలు తోడైతే ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలుంటాయని.. చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

# సింగరేణి భవన్ వద్ద కవిత ఆందోళన

## అదుపులోకి తీసుకున్న పోలీసులు



**హైదరాబాద్,నవంబర్ 19 (మనసులో మాట):**

నాంపల్లిలోని సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో.. కవితతో పాటు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు తిప్పారపు సారయ్య సహా పలువురు నాయకులను నాంపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. పోలీసుల కళ్లుగప్పి ఆమె ఆటోలో సింగరేణి భవన్‌కు చేరుకుని ముట్టడికి ప్రయత్నించారు.

# హిడ్మాను పట్టుకుని కాల్చారు

## మావోలు పోలీసుల ముందు లొంగిపోవాలి

## మాజీ మావోయిస్ట్ జంపన్న కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,నవంబర్ 19 (మనసులో మాట):**



పోలీస్ ఎన్‌కౌంటర్లో నిన్న మృతి చెందిన మావోయిస్ట్ నేత హిడ్మాను పోలీసులు పట్టుకొని చంపేశారని మావోయిస్టు మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు జంపన్న ఆరోపించారు. ఈ అంశంపై జంపన్న మాట్లాడుతూ.. ఎన్‌కౌంటర్ తీరు పూర్తిగా పట్టుకుని కాల్చినట్లుగానే ఉందన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు అడవుల్లో ఉండి ప్రాణాలు కోల్పోకండని జంపన్న మావోలకు హితవు పలికారు. 'పోలీసులు ముందు లొంగిపోవడం అవమానకరం ఏమి కాదు.. ప్రజల్లో ఉండి ప్రజలకోసం పోరాటం చేయొచ్చని,ప్రాణాలతో ఉండడం చాలా ముఖ్యం అన్నారు. మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటీలో తాను 17 ఏళ్ళ పాటు పని చేశానని, మావోయిస్టు పార్టీ ఇప్పుడు పూర్తిగా క్షీణించిందని ఆయన అన్నారు. భద్రత దళాలకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థ గతం కంటే భారీగా పెరిగిందని, మరో వైపు మావోయిస్టులకంటే పోలీసులకు టెక్నాలజీ, అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయని జంపన్న చెప్పారు. 'హిడ్మాను పోలీసులు పట్టుకొని చంపేశారు.. ఇది బూటకపు ఎన్‌కౌంటర్. ఎదురు కాల్పులు జరిగినట్లు ఎక్కడా ఆనవాళ్లు లేవు. ఏపీలో ఎవరినైనా చంపాలనుకుంటే అంతమంది మావోయిస్టులు యాక్షన్ చేయరు. ఏదైనా టార్గెట్‌లో యాక్షన్ చేయాలి అంటే ఐదు మందికి మించి ఉండరు. పదుల సంఖ్యలో యాక్షన్ అనేది పార్టీ అనుమతించదు. ఈ ఎపిసోడ్‌లో మధ్యవర్తిత్వం చేసిన వారు మోసం చేసినట్లు కనిపిస్తుందని జంపన్న వ్యాఖ్యానించారు. పార్టీలో హిడ్మాకు మంచి గుర్తింపు ఉంది. యాక్షన్ చేయడంలో హిడ్మా దిట్ట. నేను కేంద్ర కమిటీలో ఉన్న సమయంలో పలు సందర్భాల్లో హిడ్మాతో నాకు పరిచయం ఉంది. హిడ్మా యాక్షన్లో ఉన్నాడు అంటే.. సక్సెస్ చేసుకొనే వస్తాడు అనే నమ్మకం పార్టీలో ఉంది. యాక్షన్ చేయాలి అంటే ఒక వ్యక్తి నిర్ణయం ఉండదు. పార్టీ నాయకత్వం నిర్ణయం ప్రకారమే యాక్షన్ చేయాల్సి ఉంటుంది.హిడ్మా తరువాత మావోయిస్టు పార్టీ కనుమరుగైందనేది నేను నమ్మను. ఇక కేంద్ర కమిటీలో దేవ్ జీ , గణపతి, పల్లా రాజిరెడ్డి, గణెలిష్, సాగర్, జనార్దన్ తోపాటు ఇంకా కేంద్ర కమిటీలో ఉన్నారు. ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, బీహార్, మధ్య ప్రదేశ్‌లో ఇంకా మావోయిస్టులు సాయుధ పోరాటం చేస్తున్నారు.' అని జంపన్న ఆంధ్రజ్యోతితో తన అభిప్రాయాల్ని పంచుకున్నారు.

# ఏటా ధాన్యం కొనుగోళ్లలో తకరారు

- రైతులకు సకాలంలో అందని భరోసా
- పండించిన పంటలు అమ్ముకోవడంలో తంటాలు



**హైదరాబాద్,నవంబర్19 (మనసులో మాట):**

ఏటా ధాన్యం కొనుగోళ్ల సమయంలో తకరారు తప్పడం లేదు. రైతులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడం లేదు. మార్కెట్ కమిటీలు ఉత్సవవిగ్రహాలుగా మారాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇప్పుడు రైతుల పక్షాన ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్, వైకాపాలు తమ హయాంలో లోపాల గురించి మాట్లాడడం లేదు. గతంలో రైతుల ఆందోళనలను తక్కువచేసారు. అందుకే ఎవరు అధికారంలో ఉన్నా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. ఇకపోతే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. కొండంత లక్ష్యం పెట్టుకున్న ప్రభుత్వం కొంటున్నది మాత్రం కొంతే. తేమ, తాలు, రంగుమారిందంటూ కొర్రీలు పెడుతుండటంతో అన్నదాతలు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి 40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 15 లక్షల టన్నులు మాత్రమే. వానకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రణాళిక ప్రకారం అక్టోబర్‌లో 6.89 లక్షల టన్నులు, నవంబర్‌లో 32.95 లక్షల టన్నులు, డిసెంబర్‌లో 27.03 లక్షల టన్నులు, జనవరిలో 8.12 లక్షల టన్నులు కొనుగోలు చేయాలి. దీని ప్రకారం నవంబర్ నెలాఖరు వరకు 39.84 లక్షల టన్నుల కొనుగోలు చేయాలి. కానీ, 15 లక్షల టన్నులతో సరిపెట్టింది. ఇందులో దొడ్డు ధాన్యం 8 లక్షల టన్నులు కాగా సన్నధాన్యం 7 లక్షల టన్నులు ఉంది. వానకాలం సీజన్‌లో 65.96 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా 159 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని సర్కారు అంచనా వేసింది. ఇందులో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం సుమారు రూ. 20 వేల కోట్ల నిధులు అవసరం. సర్కారు వైఖరిని చూస్తుంటే కొనుగోళ్ల లక్ష్యం నెరవేరేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం కొనుగోలు ప్రారంభించి దాదాపు రెండు నెలలు కావొస్తున్నది. కానీ ఇప్పటికీ మొత్తం కేంద్రాలు ప్రారంభించకపోవడం గమనార్హం. ఈ సీజన్‌లో మొత్తం 8,332 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు 7,300 కేంద్రాలను మాత్రమే ప్రారంభించింది. అంటే ఇంకా వెయ్యికి పైగా కేంద్రాలు ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. ల÷తులు తమ ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామంటూ అధికారులు, అటు ప్రభుత్వ పెద్దలు గొప్పగా ప్రకటించారు. కానీ వారి ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. రైతులు తమ ధాన్యం విక్రయించి వారాలు గడుస్తున్నా డబ్బులు అందడంలేదు. ప్రస్తుతం రైతులకు రూ. 2 వేల కోట్లకు పైగా చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

# మహిళల హక్కుల బలోపేతానికి కృషి

- రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి సీతక్క



**హైదరాబాద్,నవంబర్ 19 (మనసులో మాట):**

రాష్ట్రంలో మహిళల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, హక్కుల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిశలా శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ అన్నారు. మహిళల సమస్యలు అనే అంశంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నేడు బేగంపేటలోని ప్రజా భవన్లో నిర్వహించిన ఒక రోజు రౌండ్ టేబుల్ సమావేశానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. పలువురు మహిళా ఐఏఎస్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, మహిళలు ఎదుర్కొంటున్న వివక్షతను రూపుమాపే విధంగా నిపుణులు, మేధావులు, అధికారుల సలహాలు తీసుకుంటామని అన్నారు. మహిళల సంక్షేమం, భద్రత విషయంలో ఎన్నో చట్టాలు ఉన్నా.. సమాజ పోకడల వల్ల కొన్నిసార్లు ఆచరణకు నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కులు తెలుసుకోలేని పరిస్థితి కొన్నిసార్లు ఎదురవుతోందని అంటూ, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళలకు విద్యా, ఉపాధి ఉద్యోగ, భద్రత విషయాల్లో ఎలాంటి ఫెసిలిటీస్ ఇవ్వాలి అన్న అంశాలపై చర్చించి నివేదిక రూపొందించాలని సూచించారు. మహిళా విధానము ఎలా ఉంటే బాగుంటుంది అనే అంశంపై రౌండ్ టేబుల్ కన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకొని, ఇక్కడ వచ్చే సలహాలు, సూచన ప్రాతిపదికగా మ-రోసారి త్వరలో భారీ సదస్సును నిర్వహిస్తామని సీతక్క వెల్లడించారు. ÷న్నారులు, పిల్లలు, మహిళలు ఉపాధి విద్య అంశాల్లో ప్రభుత్వం ఇంకా ఏమి చేయాల్సి ఉందో తెలుసుకుంటామని చెప్పారు. ఎన్నో ఆటంకాలను చేదించి దేశ ప్రధానిగా ఈ దేశ అభివృద్ధిలో ముద్ర వేసిన ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళలు ఆత్మగౌరవంతో ఎదగాలనీ ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళల ఆర్థిక సాధికారత కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు చట్టాలు, విధానాలు తీసుకొచ్చుకునే విధంగా.. మీరిచ్చే సూచనలు సలహాలు ఉపయోగపడుతుందని, ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఒక చర్చ మాత్రమే కాదు..భవిష్యత్తు మహిళా విధానానికి పునాది వేసే చారిత్రక ఘట్టమని స్పష్టం చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు శైలజా రామయ్యర్, అనిత రామచంద్రన్, దివ్య , దాసరి హరిచందన లతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖ మహిళా ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

## తాజాగా తులంపై 100 పెరుగుదల

**హైదరాబాద్,నవంబర్ 19 (మనసులో మాట):**

బంగారం ధరలు కొనుగోలుదారులకు మళ్లీ షాక్ ఇచ్చాయి. ధరలు తగ్గినట్టే తగ్గి మరోసారి పైకి కదిలాయి. మార్కెట్‌లో మంగళవారం ధర భారీగా దిగివచ్చినప్పటికీ తాజాగా బుధవారం మళ్లీ పెరిగింది. డిమాండ్ బలంగా ఉండడంతో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ధర పెరిగినట్లుగా ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. 24 క్యారెట్ల బంగారంపై రూ.1500 పెరిగి తులానికి రూ.1,27,300కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1500 పెరిగి తులానికి రూ.1,26,700కి చేరుకుంది. అదే సమయంలో వెండి ధర సైతం భారీగానే పెరిగింది. రూ.4వేలు పెరిగి కిలోకు రూ.1.60లక్షలకు ఎగిసింది. దాంతో మూడురోజుల తర్వాత ధరలు బులియన్ మార్కెట్‌లో ధరల తగ్గుదలకు బ్రేక్ పడినట్లయ్యింది. యూఎస్ లేబర్ మార్కెట్‌లో బలహీనమైన సంకేతాలు వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలను సజీవంగా ఉంచాయని విశ్లేషకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ వం-ˆసగా రెండో సెషన్‌లో పెరిగాయి. ఔన్స్‌కు 1.14 శాతం పెరిగి 4,114.01 డాలర్లకు చేరుకుంది. ఔన్సుకు వెండి ధర 3.09 శాతం 52.26 డాలర్లకు పెరిగింది. బుధవారం రాత్రి ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ అక్టోబర్ సమావేశం వివరాలు వెల్లడికానుండగా.. పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని.. దాంతో స్పాట్ గోల్డ్ 4,084 డాలర్ల కంటే ఎక్కువగా ట్రేడ్ అవుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.1,24,860 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,14,450 పలుకుతున్నది. ఇక కిలో వెండి రూ.1.76లక్షల వద్ద ట్రేడవుతున్నది.

# ఉమామహేశ్వర రిజర్వాయర్ వద్దేవద్దు

## భూముల జోలికి వస్తే ఖబర్దార్

## హెచ్చరించిన బల్మూర్ రైతులు

**నాగర్ కర్నూల్,నవంబర్ 19(మనసులో మాట):**

కాంగ్రెస్ నాయకులు కమిషన్లకు కక్కుర్తిపడి ఉమామహేశ్వర రిజర్వాయర్ ను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని బల్మూరు రైతులు ఆరోపించారు. భూముల జోలికి వస్తే ఖబర్దారని రైతులు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పంట బోనస్ ఇవ్వడానికి మొఖం లేదు కానీ రిజర్వాయర్ కడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలో ఉమామహేశ్వర రిజర్వాయర్ కోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో ఆలయం ఎదుట హామీలిచ్చి రిజర్వాయర్‌ను కట్టమని చెప్పినా నాయకులే నేడు రైతులకు అవసరం లేని రిజర్వాయర్ నిర్మించేందుకు బలవంతంగా భూమలు లాక్కోవాలని చూస్తే సహించబోమని అన్నారు. కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, ఇంజినీర్లను బతికించడానికి ప్రాజెక్టును కడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టు జోలికి రావొద్దని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని, రిజర్వాయర్ కోసం విలువైన మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామిక దేశంలో రాజరీక పాలన సాగదని హెచ్చరించారు.

# వచ్చే దసరా నాటికి ఉప్పల్ కారిడార్



## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,నవంబర్ 19 (మనసులో మాట):**

ఉప్పల్ - నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు 2026 దసరా నాటికి కచ్చితంగా పూర్తిచేస్తామని రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగా ఆర్అండ్‌బీ, నిర్మాణ సంస్థను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్డు మార్గంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి మంత్రి.. వెంటనే బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉప్పల్ - వరంగల్ మార్గంలో అధికారులు ఇప్పటికే బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఉప్పల్ - వరంగల్ మార్గంలో ప్రయాణించే వారికి, మేడారం వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. మొత్తం 5.5 కి.మీ గాను 1.5కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మేడారం జాతర ప్రారంభమయ్యే నాటికి బీటీ రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా 2026 దసరా నాటికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్ - నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభిస్తామని పునరుద్ఘాటించారు.

# పథకాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఉమ్మడి జిల్లా అభివృద్ధి నా లక్ష్యం
- మెదక్ లో త్వరలో క్యాన్సర్ ఆస్పత్రి
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు




మెదక్, నవంబర్ 19 (మనసులో మాట):

జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు మానిటరింగ్ కమిటీ (దిశ) సమీక్ష సమావేశం బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , డిఆర్ఓ భుజంగరావు, డిఆర్డిఓ శ్రీనివాసరావు తదితర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల ప్రగతి, పథకాల అమలులో ఎదురయ్యే సమస్యలు, వీటి పరిష్కారం, బడ్జెట్ వినియోగం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, నిధుల వినియోగం తదితర అంశాలను సమీక్షించారు. గత సమావేశంలో చేసిన సిఫార్సులపై తీసుకున్న చర్యలపై వివం-మైన చర్చ జరిగింది. జిల్లాలో అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర పథకాలు వ్యవసాయ, విద్య, ఆర్ అండ్ బి, పీఎంఏవై, జాతీయ గ్రామీణ జీవనోపాధి , రహదారి అభివృద్ధి, ఇతర సంక్షేమ పథకాలు ఎంపీ అధికారులను సమర్థవంతమైన అమలు, ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా కార్యక్రమాలు తీర్చిదిద్దాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఫీల్డ్ లెవల్ మానిటరింగ్ పెంచాలని, ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడాలని తెలిపారు. సమావేశములో చర్చించిన నూతన అంశాలు, పరిష్కరించాల్సిన సమస్యలు, శాఖల సూచనలు తదితర అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని బాధ్యత వహించే అధికారులకు మార్గదర్శకాలు ఇవ్వడం జరిగింది. సమావేశ వివరాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ తో మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, మెదక్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ప్రజల్లో క్యాన్సర్ పట్ల అవగాహన పెంపొందించడానికి భారత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఇందులో భాగంగా మెదక్ లో నూతన క్యాన్సర్ హాస్పిటల్ ను నిర్మాణం చేపట్టేందుకు . జిల్లా కలెక్టర్ గారి ప్రత్యేక చొరవతో 1000 గజాల స్థలం ఏర్పాటు చేసే విధంగా పటిష్ట కార్యచరణ ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, కొత్త పథకాలు ప్రతి ఇంటికి చేరవేసే విధంగా దిశ కమిటీ లో చర్చించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పెండింగ్ ఉన్న నేషనల్ హైవే అంశాలు అటవీ శాఖ అనుమతులు నరసాపూర్ ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న నేషనల్ హైవే 765 డి.జి రోడ్డుకు సంబంధించి, గుమ్మడిదల నర్సాపూర్ ఎలివెంటల్ క్యారిడార్ డి.పి.ఆర్ సంబంధించి చర్చించడం జరిగిందని తెలిపారు. ప్రైవేట్ సంస్థల యాజమాన్యాన్ని ఒప్పించి మొట్టమొదటిసారిగా దేశంలోనే ఏ జిల్లాలో ప్రారంభం కాని విధంగా మెదక్ జిల్లాలో 1000 గజాల స్థలం లో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించి క్యాన్సర్కు చికిత్సలు అందించే విధంగా జిల్లా కలెక్టర్ గారి చొరవతో త్వరితగతిన ఈ కార్యక్రమం ముందుకు పోతుందన్నారు. దేశంలోనే 736 జిల్లాలో ఎక్కడా ప్రారంభం కానీ ప్రిలిమినరీ క్యాన్సర్ టెస్టింగ్ మెదక్లో ప్రారంభం కావడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. జిల్లాలు ప్రతి వారం మండల కేంద్రంలో క్యాన్సర్ ప్రిలిమినరీ పరీక్షల కొరకు ఒక బస్సు తయారు చేస్తున్నట్లు భారత్ రాజ్ నిక్ సంస్థ ముందుకు వచ్చిందని పీడీఎల్ పటాన్చెరువు వారు ఒక బస్సు కొనుగోలు చేసి ఇవ్వడానికి సి ఎస్ ఆర్ నిధులు కింద లెటర్ అందజేయడం జరిగింది అన్నారు. ఈ బస్సు ద్వారా ప్రతి మండల కేంద్రంలో హై స్కూల్ ఆవరణలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేసి చికిత్స చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాదాపు 69 లక్షల 59 వేల రూపాయలతో భారత్ డైనమిక్ లిమిటెడ్ సంస్థలు బస్సు కొనుగోలు చేసి ఇవ్వడానికి ముందుకు వచ్చినందుకు ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు కృతజ్ఞతలు తెలిపారు. రఘునందన్ రావు కూతురు స్వయానా డాక్టర్ కావడంతో బస్సు ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ కు వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ దిశ మీటింగ్లో చర్చించిన అంశాలను, సమస్యలను అధికారులు పష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు, పాల్గొన్నారు.

# ఓడిన చోటే గెలిచి చూపిద్దాం

- జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కండి: కేటీఆర్
- జూబ్లీహిల్స్ సమీక్షా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు




హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఉపఎన్నికల ఫలితాలు, పార్టీ బలోపేతంపై చర్చించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు (కేటీఆర్) అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు), జూబ్లీహిల్స్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... దివంగత నాయకులు గోపీనాథ్ మరణం తర్వాత ఆయన కుటుంబానికి పార్టీ అండగా నిలిచిందని గుర్తు చేశారు. గోపీనాథ్ సతీమణి సునీతమ్మ గెలుపు కోసం పార్టీ అధినేత కె.సి.ఆర్. నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పనిచేసిన తీరును ఆయన ప్రశంసించారు. రాబోయే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం, శాసనసభ ఎన్నికల్లో వారు పడ్డ కష్టానికి మించి తాము పనిచేస్తామని, "కాలికి బలపం కట్టుకొని తిరుగుతాం" అని కేటీఆర్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

## దొంగ ఓట్లు, అక్రమాలతోనే కాంగ్రెస్ గెలుపు

ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు (బీజేపీ) అక్రమాలకు పాల్పడ్డాయని కేటీఆర్ ఆరోపించారు. కర్ణాటక నుంచి మనుషులను తెచ్చి దొంగ ఓట్లు వేయించుకున్నారని, షేక్‌పేట, ఎర్రగడ్డ వంటి ప్రాంతాల్లో రిగ్గింగ్ చేశారని మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకుని, డబ్బు, మద్యం పంచి కాంగ్రెస్ గెలిచిందని, ఇది నైతిక గెలుపు కాదని విమర్శించారు. వ్యక్తిగత విషాదంలో ఉన్నప్పటికీ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన హరీశ్ రావును ఆయన కొనియాడారు.

## జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. త్వరలోనే సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, ఆ వెంటనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని 407 బూతుల్లో ఒక్కో బూత్‌కు 10 మంది చొప్పున, మొత్తం 4 వేల మందితో పటిష్టమైన సైన్యాన్ని నిర్మించుకోవాలని సూచించారు. గతంలో నష్టపోయిన చోటే తిరిగి బలాన్ని పుంజుకోవాలని, "ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలి" అనే సామెతను గుర్తు చేస్తూ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజల సమస్యలపై ఇప్పటి నుంచే పోరాటం మొదలుపెట్టాలని, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ ప్రారంభించాలని ఆయన పిలుపునిచ్చారు.

## నైతిక విజయం బీఆర్ఎస్‌దే: హరీశ్ రావు


జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాలపై బీఆర్ఎస్ నాయకులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పోరాటస్ఫూర్తితో పనిచేసిన కార్యకర్తలదే నైతిక విజయమని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 18,000 ఓట్లు మాత్రమే వచ్చిన జూబ్లీహిల్స్‌లో, ఈ ఉపఎన్నికలో 75,000 ఓట్లు సాధించడం కార్యకర్తల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం సాంకేతికంగా గెలిచి ఉండవచ్చని, కానీ నైతిక విజయం మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి సునీతమ్మదేనని హరీశ్ రావు అన్నారు. మైనారిటీల మద్దతు కోల్పోతున్నామని గుర్తించిన కాంగ్రెస్, చివరి నిమిషంలో హడావుడిగా అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం బీఆర్ఎస్ పోరాట ఫలితమేనని వ్యాఖ్యానించారు. "అప్పుడప్పుడు అనైతిక విజయం, అధర్మం కూడా గెలుస్తూ ఉంటుంది. కానీ అంతిమ విజయం ధర్మానిదే" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని, తమను ఇబ్బంది పెట్టిన వారిని ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని హరీశ్ రావు హెచ్చరించారు.

## రూ. 150 కోట్లు ఖర్చు పెట్టి గెలిచారు: తలసాని శ్రీనివాస్ యాదవ్

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఉపఎన్నిక ఫలితాలపై అధైర్యపడొద్దని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు. అధికార పార్టీ దుర్వినియోగం, పోలీసుల జోక్యం, విచ్చలవిడి డబ్బు పంపిణీ ఫలితాన్ని ప్రభావితం చేశాయన్నారు. ప్రజలు కాంగ్రెస్ 'ఆరు గ్యారెంటీలను 420 హామీలు'గా భావిస్తున్నారని, నిరుపేదలు తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రలోభాలకు గురయ్యారని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవడానికి రూ. 150 కోట్లు ఖర్చు పెట్టి ఈ ఎన్నికను గెలిచారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుత ఫలితం ఓటమి కాదని, కేటీఆర్, హరీష్ రావుల నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రోడ్ల మీదకు తీసుకొచ్చామని తెలిపారు. రాబోయే రెండేళ్ల తర్వాత బలమైన 'తుఫాను' వస్తుందని, అప్పుడు కాంగ్రెస్ ఉనికి ఉండదని జోస్యం చెప్పారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండి, బూత్ కమిటీలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

- జెరియాట్రిక్ సేవలను విస్తరించాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహా



హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):

దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అనుగుణంగా వారికి అవసరమైన వైద్య సేవలను విస్తరించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులలో (హాస్పిటల్స్‌లో) జెరియాట్రిక్ సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం మంత్రి, జనరల్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ప్రత్యేక ఆసుపత్రుల ఆవశ్యకత

జీవన ప్రమాణాలు పెరగడం వల్ల వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోందని మంత్రి దామోదర్ అన్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా చైల్డ్ హెల్త్ కేర్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టుగానే, జపాన్, ఇటలీ తరహాలో వృద్ధుల కోసం ప్రత్యేక ఆసుపత్రులు నిర్వహించాల్సిన ఆవశ్యకత భవిష్యత్తులో ఏర్పడుతుందన్నారు. వృద్ధాప్యంలో వచ్చే మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని అన్ని ఆసుపత్రులలోనూ జెరియాట్రిక్ సేవలను విస్తరించాలని సూచించారు.

## డీఎంహెచ్‌వోలకు సూచనలు:

ప్రతి జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్), జిల్లా హాస్పిటల్‌లో ఇప్పటికే జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేశామన్న విషయాన్ని ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుల జాబితాలు సిద్ధం చేసుకుని, వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోలదేనని మంత్రి ఆదేశించారు. "గత ప్రభుత్వం తరహాలో అరకొర భవనాలు కట్టి వదిలేయడం లేదు. ప్రతి ఆసుపత్రిలోనూ అవసరమైన మేర డాక్టర్లను, నర్సులను, ఇతర సిబ్బందిని నియమిస్తున్నాం. ఈ రెండేళ్లలో 9 వేలకుపైగా పోస్టులు భర్తీ చేశాం. మరో 7 వేలకుపైగా పోస్టులు భర్తీ అవుతున్నాయి. మ్యాన్ పవర్‌తో పాటు మీరు అడిగిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇక మీ దగ్గరకు వచ్చే రోగులకు (పేషెంట్లకు) సేవ చేయడం మీ చేతుల్లోని ఉంది" అని మంత్రి అన్నారు.

## నిర్లక్ష్యం వహించవద్దు:

ప్రభుత్వ ఆసుపత్రులను మీ సొంతంగా భావించి, అక్కడికి వచ్చే రోగులకు మంచి సేవలు అందించి రక్షించుకోవాలి. డీఎంహెచ్‌వోలు, ఆసుపత్రి సూపరింటెండెంట్ల హాజరు (అటెండెన్స్) ను తాము నిరంతరం పరిశీలిస్తున్నామని (మానిటర్ చేస్తున్నామని) తెలిపారు. నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, ఎంతటివారిపైన అయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సచివాలయంలో ఆరోగ్య శిబిరం

## ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. సచివాలయం మూడో అంతస్తులో, ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం రేనోవా ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఈ ఏఐ ఆధారిత మెగా కార్డియాక్ హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరానికి వచ్చిన ఉద్యోగులకు రేనోవా ఆసుపత్రి వైద్య సిబ్బంది అత్యాధునిక పరికరాల సహాయంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ముఖ్యంగా రక్తపోటు (బి.పి), రక్తంలో గ్లూకోజ్ (జి.ఆర్.బి.ఎస్), గుండె సంబంధిత పరీక్షలు అయిన ఈసీజీ మరియు 2డి ఎకో పరీక్షలను నిర్వహించారు. ఉద్యోగులకు ఉచితంగా గుండె వైద్యం (కార్డియాలజీ) మరియు సాధారణ వైద్య సేవలు (జనరల్ ఫిజీషియన్) కన్సల్టేషన్ సేవలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ... మారుతున్న జీవనశైలిలో భాగంగా ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే అని ఆయన స్పష్టం చేశారు. సచివాలయ ఉద్యోగులకు ఉచితంగా వైద్య సేవలు, పరీక్షలు అందించేందుకు ఆరోగ్య శిబిరం పెట్టినందుకు గాను, రేనోవా ఆసుపత్రి వైద్య సిబ్బందిని మంత్రి అభినందించారు.

# ఆ భూమి జోలికి వెళ్లకండి

## హైడ్రాకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):

శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగం పేట రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 16లోని 10 ఎకరాల 20 గుంటల భూమి జోలికి వెళ్లవద్దని హైకోర్టు హైడ్రా అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. సంబంధిత భూమి యజమానులను ఇబ్బందిపెట్టవద్దని పేర్కొన్నది. ఈ మేరకు భూమి యజమానులు బుధవారం (19.11.2025) తేదీన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కోర్టు ఉత్తర్వులతోపాటు దరఖాస్తును అందజేశారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో తమ భూమిపైకి వచ్చి ఇబ్బంది పెట్టవద్దని అందులో కోరారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగం పేటలోని సర్వే నంబర్ 16లో 10 ఎకరాల 20 గుంటల భూమి వై అంతిరెడ్డి సహా 9 మంది పేర్లపై ఉన్నది. సున్నం చెరువుకు సమీపంలో ఉన్న ఈ భూమి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధుల్లోకి వస్తుందని హైడ్రా అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు తమ భూమిలో ఫెన్సింగ్ వేయడానికి జేసీబీలను తీసుకువచ్చి భూమిని స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా ప్రయత్నించారని, తమ భూమిని ఎందుకు చదును చేస్తున్నారని ప్రశ్నిస్తే తమకు పై నుంచి ఆదేశాలు ఉన్నాయని చెప్పడంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. వాస్తవానికి తమ భూమి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో లేదని పిటిషనర్లు తెలిపారు. గతంలోనే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు ఇక్కడ సర్వే చేసి, ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే తమ కొంత భూమిని స్వాధీనం చేసుకున్నారని, బఫర్ జోన్‌లోకి వచ్చే 30 మీటర్ల భూమిని స్వాధీనం చేసుకుని, అందులో వంద అడుగుల రోడ్డును నిర్మించారని తెలిపారు. ఎఫ్‌టీఎల్ పరిధి నుంచి 30 మీటర్లలోపు ఎలాంటి కట్టడాలు ఉండకూడదని 07.04.2012లో ఇచ్చిన జీవో 168 పేర్కొంటున్నది. దీని ప్రకారంగా చూసినా తమ భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండే ఆస్కారమే లేదని, బఫర్‌జోన్‌లో కూడా లేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోకి రాని తమ భూమి విషయంలో జోక్యం చేసుకునేందుకు హైడ్రా అధికారులకు ఎలాంటి అధికారం లేదని కోర్టుకు విన్నవించారు. ఇది పట్టాభూమి కావడంతో బఫర్ జోన్ మీదుగా వెళ్లిన వంద ఫీట్ల రోడ్డుకు జీహెచ్ఎంసీ తమకు డెవలప్‌మెంట్ రైట్స్ సర్టిఫికెట్ రూపంలో దాదాపు ఎకరంన్నర భూమికి నష్టపరిహారం కూడా చెల్లించిందని కోర్టుకు తెలిపారు. హైడ్రా అధికారులు రాత్రి పూట భూముల్లోకి వచ్చి, బుల్డోజర్లతో భవంతులను ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేస్తున్న అంశాన్ని ప్రస్తావించిన పిటిషనర్లు.. తమ భూమిలోని నిర్మాణాల విషయంలోనూ ఇలానే జరుగుతుందేమోననే ఆందోళనలు వ్యక్తం చేశారు. తమ భూమి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో లేనందున వారిని జోక్యం చేసుకోవద్దని ఆదేశించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ల అనుభవంలో ఉన్న భూమి విషయంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు జోక్యం చేసుకోవద్దని పేర్కొంటూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

# ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నవంబర్ 22న జాబ్ మేళా

హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):

ఉస్మానియా విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ)లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ (నవంబర్ 22, 2025) న ఒక బృహత్తర ఉద్యోగ మేళాను నిర్వహించనున్నారు. మిత్రా ఏరిన ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆర్ట్స్ కళాశాల (కాలేజీ) ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు ఈ జాబ్ మేళా ప్రారంభమవుతుంది. టెక్నీషియన్ మరియు సర్వీస్ అడ్వైజర్ పోస్టులకు సంబంధించి మొత్తం 25 ఖాళీలను ఈ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ. 15,000 నుండి రూ. 25,000 వరకు వేతనం ఉంటుంది. అర్హతలు: ఈ ఉద్యోగాలకు డిగ్రీ, బి.టెక్, డిప్లమా (మెకానికల్, డీజిల్ మెకానికల్), ఐ.టి.ఐ. పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. వయసు 18 నుండి 30 సంవత్సరాల మధ్య ఉన్న యువతీ యువకులకు మాత్రమే ఈ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఉప ముఖ్య (డిప్యూటీ చీఫ్) అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులతో నవంబర్ 22, 2025 న నేరుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయానికి హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం సంస్థ మానవ వనరుల (హెచ్.ఆర్.) విభాగాన్ని 7799884996 లేదా 7799464344 నంబర్లలో సంప్రదించవచ్చు.

# హిడ్మాను చంపి.. ఎన్‌కౌంటర్ అంటారా

## మావోయిస్టులపై దాడులను వెంటనే ఆపాలి

## సీపీఐ నేత కూనంనేని డిమాండ్

హైదరాబాద్,నవంబర్ 19 (మనసులో మాట):



మావోయిస్టు అగ్ర నేత హిడ్మాను చంపి.. దాన్ని ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల అంశంపై చర్చించేందుకు గురువారం నాడు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిడ్మా కోరితే ఆశ్రయం ఇచ్చే వాళ్లమని అన్నారు. అతన్ని తానే డీజీపీకి సరెండర్ చేయించేవాడిని అని పేర్కొన్నారు. హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలు తెలుసుకోవాలని కూనంనేని సూచించారు. ఇలా చంపడం సరికాదని.. అరెస్టు చేసి చట్టం ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే విచారణకు ఆదేశించాలని అన్నారు. దేవ్‌జీ కూడా పోలీసుల చెరలో ఉన్నట్లు తెలుస్తోందని.. అసలు పోలీసుల చెరలో ఎంతమంది ఉన్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి నాటికి మావోయిజం లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇదేమైనా యుద్ధమా అని ఆయన ప్రశ్నించారు. దండకారణ్యంలో విలువైన ఖనిజ సంపద కోసమే ప్రభుత్వం మావోయిస్టులను హతమారుస్తుందని ఆరోపించారు. ఏకపక్ష కాల్పులను కూడా బండి సంజయ్ ఎన్‌కౌంటర్‌గా చెప్పడం దారుణమని మండిపడ్డారు. హింసను వీడి, శాంతియుత పరిష్కారాల దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని సూచించారు.

# నిజామాబాద్ టౌన్‌ప్లానింగ్‌లో ఏసీబీ సోదాలు

పలు ఫిర్యాదులు రావడంతో రంగంలోకి ఏసీబీ




**నిజామాబాద్,నవంబర్19 (మనసులో మాట):**

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ భవనంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ విభాగాలలో తమ పనుల నిమిత్తం జనాలతో హడావిడిగా ఉన్న సమయంలో ఒక్కసారిగా ఏసీబీ అధికారులు వచ్చి నేరుగా టౌన్ ప్లానింగ్ కార్యాలయంలోకి వెళ్లారు. దీంతో ఏం జరిగిందోనని అధికారులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై పలు ఆరోపణలు రావడంతో ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. టౌన్ ప్లానింగ్ విభాగంలో పలువురు సిబ్బంది పై పలు ఫిర్యాదులు రావడంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. కాగా, టౌన్ ఎ÷-లానింగ్ కార్యాలయంలో ఏసీబీ బృందం ్గళ్లైను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పూర్తి సమాచారం తనిఖీల అనంతరం వెల్లడిస్తామని ఏసీబీ అధికారి పేర్కొన్నారు.

# సత్తా చాటిన తెలంగాణ క్రీడాకారులు




**హైదరాబాద్ నవంబర్ 19 (మనసులో మాట):**

అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఇటానగర్ వేదికగా జరిగిన యోనెక్స్%-%సన్‌రైజ్ 48వ ఇంటర్ స్టేట్, ఇంటర్ జోనల్ అండ్ జూనియర్ నేషనల్స్ బ్యాడ్మింటన్ టోర్నీ బుధవారం అట్టహాసంగా ముగిసింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన బ్యాడ్మింటన్ ప్రతిభావంతులు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు మరోసారి తమ సత్తాను నిరూపించుకున్నారు. ముఖ్యంగా అండర్%-%19 బాలికల విభాగంలో తెలంగాణ క్రీడాకారిణులు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ప్రత్యర్థులను అదరగొట్టారు. పోటీల ఆసాంతం దూకుడును కొనసాగించిన రాష్ట్ర జూనియర్ బాలికల జట్టు, కీలకమైన తుది మ్యాచ్‌లో చెలరేగి ఆడి జాతీయ విజేతల కిరీటాన్ని కైవసం చేసుకుంది. అదే విభాగంలో ఢిల్లీ జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. మరోవైపు, తెలంగాణ బాలుర జట్టు కీలకమైన సెమీఫైనల్ పోరులో ఢిల్లీ జట్టుతో తడబడి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. పోటీలన్నింటిలోనూ మంచి నైపుణ్యం ప్రదర్శించినప్పటికీ, సెమీఫైనల్‌లో చేసిన కొన్ని కీలక పొరపాట్లు వారికి విజయాన్ని దూరం చేశాయి. ఈ సందర్భంగా తెలంగాణ జట్టు సాధించిన విజయాలను జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో సాధించిన ఈ విజయాలు తెలంగాణ బ్యాడ్మింటన్‌కు మరింత గౌరవాన్ని తీసుకొచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ అద్భుత ప్రదర్శనతో రాష్ట్రం నుంచి మరిన్ని ప్రతిభావంతులు తయారవుతారని క్రీడా వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# ఎన్‌పీఎల్-6కు అన్ని విధాలా సహకారం

గ్రామీణ క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటా

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్గొండ, నవంబర్ 19 (మనసులో మాట):**

గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు తాను ఎల్లవేళలా సహకారం అందిస్తానని రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ నెల 28 నుంచి నల్గొండలో జరగనున్న ఎన్‌పీఎల్-6 టోర్నమెంట్ పోస్టర్‌ను మంత్రి బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. నల్గొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల వేదికగా ఈ నెల 28వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నల్గొండ మాజీ పురపాలక సంఘ (మున్సిపల్) అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు (వైస్ చైర్మన్) అబ్బగోని రమేష్ గౌడ్ తో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ టోర్నమెంట్‌కు అన్ని విధాలుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇలాంటి క్రీడా పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు. మాజీ పురపాలక సంఘ అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అబ్బగోని రమేష్ గౌడ్ మాట్లాడుతూ... మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి ఇటువంటి క్రీడలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. క్రీడాకారులంతా ఈ టోర్నమెంట్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ. 2,22,222 (రెండు లక్షల ఇరవై రెండు వేల రెండు వందల ఇరవై రెండు రూపాయలు), ద్వితీయ బహుమతిగా రూ. 1,11,111 (ఒక లక్ష పదకొండు వేల నూట పదకొండు రూపాయలు) అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆంగోతు ప్రదీప్ నాయక్, కేసాని వేణుగోపాల్ రెడ్డి, నిర్వాహకులు బోనగిరి ప్రభాకర్, ముత్తినేని నాగేశ్వరరావు, పాలకూరి శ్రీధర్, గంజి గిరి, కోమటిరెడ్డి శేఖర్ రెడ్డి, సాయి, చిన్ని రంగ, మధు, నవీన్ రెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

# మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

- ప్రజా సంఘాల డిమాండ్

**పెద్దపల్లి, నవంబర్ 19 (మనసులో మాట):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అని, దీనిపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ), సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, రైతుకూలీ సంఘం (ఆర్సీఎస్), విప్లవ రచయితల సంఘం (విరసం), తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్), ఏఐఎఫ్‌టీయూ సంయుక్తంగా ఈ డిమాండ్‌ను లేవనెత్తాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పత్రికా సమావేశంలో సీపీఐ, న్యూ డెమోక్రసీ, రైతు కూలీ సంఘం నాయకులు మాట్లాడుతూ... సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం భారత సైన్యం దేశ పౌరులనే వేటాడటం అమానుషం అని అన్నారు. మోడీ-అమిత్ షా కేవలం ఓట్ల దొంగలే కాదని, రక్తపిపాసులు అనే కఠోర సత్యం బహిర్గతమైందని విమర్శించారు. మధ్య భారతంలో ఖనిజ సంపద కోసం రక్తపుటేరులు పారిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలను అడవుల నుండి వెళ్లగొట్టడానికి మానవ హననం సాగిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో నెలకొన్న నిరుద్యోగం, ఆకలి చావులు, అసమానతలను రూపుమాపడం, దళితులు, మహిళలపై దాడులను అరికట్టడం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం మార్చి 2026 వరకు దృష్టి సారించాలని, అలాగే విద్యా, వైద్యం పేదలకు అందుబాటులోకి తీసుకురావడంలో కేంద్రం కృషి చేయాలని వారు కోరారు. అడవులను, సహజ సంపదను కాపాడే అమాయక ఆదివాసీలపై సాగిస్తున్న అమానుష దమనకాండ 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని బుద్ధిజీవులు, హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, కేంద్రం మొండి వైఖరిని వీడటం లేదని విమర్శించారు. మారేడుమిల్లి అడవులలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులైన కామ్రేడ్స్ మాడవి హిడ్మా, హేమతో పాటు మరో నలుగురి మృతిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని వారు బలంగా డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఆపరేషన్ కగార్ను తక్షణమే నిలిపివేయాలని, మధ్య భారతంలోని పోలీస్ శిబిరాలను ఎత్తివేయాలని, ఆదివాసీ ప్రాంతాల్లో మోహరించిన సాయుధ పోలీసు బలగాలను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు. పోలీసుల అదుపులో ఉన్న ఇతర మావోయిస్టు నాయకులకు ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా, వారిని వెంటనే న్యాయస్థానంలో హాజరుపరచాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు కట్టా విశ్వనాథం, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రత్న కుమార్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు స్థాలిన్, ఇతర ప్రజా సంఘాల నాయకులు లక్ష్మణ్, దీరజ్ తదితరులు పాల్గొన్నారు.




# భవిష్యత్తును ప్రపంచానికి చూపడమే మా విజన్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):**

యువ రాష్ట్రం తెలంగాణ గత రెండు సంవత్సరాలలో సాధించిన ప్రగతి, రాష్ట్ర భవిష్యత్తును ప్రపంచానికి చాటిచెప్పడమే 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047' ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ (ఎకానమీ) లక్ష్య సాధనలో ప్రతి శాఖ భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం ప్రజాభవన్‌లో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో కలిసి ఏర్పాటు చేసిన 2047 విజన్ డాక్యుమెంట్ వార్ రూమ్ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు యావత్ మంత్రివర్గ (క్యాబినెట్) కల అయిన మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనకు అందరూ కలిసి అడుగులు వేస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు. ఈ లక్ష్య సాధనలో అందరినీ భాగస్వాములు చేసి సమగ్ర డాక్యుమెంట్‌ను రూపొందించే బాధ్యతను సీఎం రేవంత్ రెడ్డి తనకు అప్పగించారని తెలిపారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఐఎస్‌బీ తో అధికారిక ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఇప్పటికే వివిధ శాఖల నుంచి నోడల్ అధికారులు అందించిన సమాచారం మేరకు ఐఎస్‌బీ బృందం ప్రాథమిక కసరత్తు పూర్తి చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతిని ప్రపంచానికి వివరించేందుకు వచ్చే నెల డిసెంబర్ 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమ్మిట్‌కు దేశవ్యాప్తంగా ప్రముఖులను, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సీఈఓలను ఆహ్వానించి దీనిని పెద్ద పండుగలా నిర్వహించనున్నట్లు తెలిపారు. తక్కువ సమయం అందుబాటులో ఉన్నందున, పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి విజన్ డాక్యుమెంట్‌ను తుది దశకు తీసుకురావాలని అధికారులకు సూచించారు.




### భవిష్యత్తు తరాలకు మేలు చేకూర్చేలా...

డిసెంబర్ 9తో ప్రజా ప్రభుత్వం రెండవ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, కేవలం రెండు సంవత్సరాల్లో ఏం చేశామని చెప్పడం కంటే కూడా, భవిష్యత్తు తరాలకు మేలు చేకూరేలా ఎలాంటి పునాదులు వేయబోతున్నాం, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీపడేలా ఎలా తీర్చిదిద్దబోతున్నాం అనే విషయాలను ప్రపంచానికి ఈ విజన్ డాక్యుమెంట్ ద్వారా వివరించనున్నట్టు ఆయన తెలిపారు. ఆర్థిక, పారిశ్రామిక, సేవారంగాల్లో (సర్వీసు సెక్టార్లలో) జీడీపీని పెంచి 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వివరించారు.

### అధికారులకు సూచనలు:

2047 విజన్ డాక్యుమెంట్, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అనే లక్ష్యాలు అసాధారణమైనవని, అందుకు పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ వలయ రహదారి (రీజినల్ రింగ్ రోడ్డు) పనులు పూర్తయితే దేశంలోని ఏ రాష్ట్రమూ తెలంగాణతో పోటీ పడలేదని స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య రానున్న పారిశ్రామిక సముదాయాల (ఇండస్ట్రియల్ క్లస్టర్లు) ద్వారా పెద్ద మొత్తంలో పెట్టుబడులు వస్తాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అన్ని శాఖల కార్యదర్శులు విజన్ డాక్యుమెంట్‌కు సంబంధించి తమ తమ శాఖల మంత్రులతో భేటీ అయి, మంత్రులు సూచించే సలహాలను డాక్యుమెంట్‌లో జోడించాలని సూచించారు. మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 13 శాతం జీడీపీ లక్ష్య సాధనలో ప్రతి శాఖ పాత్ర ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, 13 శాతం జీడీపీని ఎలా చేరుకోబోతున్నామో డాక్యుమెంట్‌లో వివరించాలని కోరారు. గురువారం అంతా శాఖల కార్యదర్శులు మంత్రులతో చర్చించి డాక్యుమెంట్‌ను తుది దశకు తీసుకురావాలని, ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేసి ఆమోదం తెలియజేస్తారని డిప్యూటీ సీఎం వివరించారు.

### ప్రభుత్వ విజయాల ప్రచారం ఆవశ్యకత:

రాష్ట్రంలో ఉన్న వనరులు, ప్రభుత్వం సాధించిన విజయాలను విస్తృతంగా ప్రచారం చేసుకోవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం అధికారులకు వివరించారు. ఉదాహరణకు, రోడ్లు భవనాల శాఖలో రెండు సంవత్సరాల కాలంలో 85 వేల కోట్ల రూపాయలకు సంబంధించిన పనులు చేపడుతున్నారని, అవి పూర్తయితే రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం పూర్తిగా మారుతుందని తెలిపారు. అదేవిధంగా, మహిళా శిశు సంక్షేమ శాఖలో డ్వాక్రా మహిళలకు 27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేయగా, ఐదు సంవత్సరాలలో లక్ష కోట్లు అందజేయనున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నార్త్ ఈస్ట్ కనెక్ట్ ఫెస్టివల్‌కు ఆతిథ్యం

- హైటెక్స్ వేదికగా రేపటి నుంచి సాంకేతిక, సాంస్కృతిక మహోత్సవం




**హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ వేదికగా చారిత్రాత్మకమైన "తెలంగాణ- నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్: ఏ టెక్నో-కల్చరల్ ఫెస్టివల్" పేరిట సాంకేతిక, సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపురల మధ్య సాంకేతిక, సాంస్కృతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, తద్వారా ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ ఉత్సవాన్ని రెండు విడతలుగా నిర్వహించనున్నారు. మొదటి విడత నవంబర్ 20 నుంచి 22 వరకు హైటెక్స్, రెండవ విడత నవంబర్ 25 నుంచి 27 వరకు రాజ్‌భవన్‌లో జరగనుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ కార్యాలయం, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు హైటెక్స్‌లో 'సంస్కృతుల సంగమం - సమృద్ధికి సోపానం' అనే అంశంతో ఈ ఉత్సవం ఘనంగా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర మంత్రులు, ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు, మంత్రులు హాజరు కానున్నారు.

### వివిధ కార్యక్రమాలు

మొదటి దశలో (నవంబర్ 20%-%22, హైటెక్స్) ప్రధానంగా సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ దశలో లలిత కళలు, ప్రదర్శన కళల ప్రదర్శన ఉంటుంది. సాహిత్యంపై చర్చలు, ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తారు. మహిళా సాధికారతపై దృష్టి సారించి, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేయడంతో పాటు, యువతకు ప్రాధాన్యతనిస్తూ క్రీడా సంబంధిత కార్యక్రమాలను నిర్వహిస్తారు. రెండవ దశలో (నవంబర్ 25%-%27, రాజ్‌భవన్ అండ్ క్షేత్ర సందర్శనలు) నైపుణ్యం, అభివృద్ధి అంశాలపై దృష్టి సారించనున్నారు. ఈ దశలో వైద్యం, ఆరోగ్య శాస్త్రాలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఐటీ (సమాచార సాంకేతికత), ఐటీఈఎస్ (ఐటీ ఆధారిత సేవలు) వంటి అంశాలపై ప్యానెల్ చర్చలు జరుగుతాయి. ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రులు, జీనోమ్ వ్యాలీ, టి-హబ్‌ను సందర్శిస్తారు. నవంబర్ 27న రాజ్‌భవన్‌లో ముగింపు వేడుకతో ఈ ఉత్సవం ముగుస్తుంది. ఈ ఉత్సవం తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల మధ్య అభివృద్ధి భాగస్వామ్యానికి కొత్త ఒరవడిని సృష్టిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# భారత్, రష్యాలది దశాబ్దాల స్నేహం

- తెలంగాణలో పెట్టుబడులకు స్వాగతం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):**

భారతదేశం, రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన స్నేహబంధం కొనసాగుతుందని, తెలంగాణ రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు రష్యా బృందం ఆసక్తి చూపడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుందని ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. వ్యవసాయం, విద్యుత్తు, రక్షణ (డిఫెన్స్), సహకార బ్యాంకు రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆయన రష్యా ప్రతినిధి బృందాన్ని కోరారు. బుధవారం సాయంత్రం ప్రజాభవన్‌లో గ్లోబల్ ట్రేడ్ మరియు టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (జీటీటీసీఐ), వీటీబీ రష్యన్ బ్యాంక్ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం చర్చించారు.

**తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామం:**

వ్యవసాయం, విద్యుత్తు, సాంకేతికత (టెక్నాలజీ) రంగాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని డిప్యూటీ సీఎం రష్యా ప్రతినిధి బృందానికి వివరించారు. ఒక సీజన్‌లో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఫార్మా, ఐటీ రంగాలకు తెలంగాణ రాష్ట్రం ప్రధాన కేంద్రంగా (హబ్‌గా) నిలిచిన విషయాన్ని లెక్కలతో సహా వివరించారు. మైనింగ్ రంగంలోనూ తెలంగాణ ముందంజలో ఉందని, 100 సంవత్సరాల పైబడిన చరిత్ర కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి 45 వేల మంది ఉద్యోగులతో కొనసాగుతున్న విషయాన్ని తెలిపారు. సింగరేణి విస్తరణలో భాగంగా క్రిటికల్ మినరల్ మైనింగ్ దిశగా ముందుకు పోతున్న విషయాన్ని వివరించారు. రక్షణ రంగంలోనూ హైదరాబాద్ దేశంలోనే ముందంజలో ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామం లాంటిదని, ఇక్కడ మంచి వాతావరణం, పరిశ్రమలు నెలకొల్పడానికి అవసరమైన భూమి, అంతర్జాతీయ విమానాశ్రయం (ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్), పెద్ద సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలలు, మంచి నైపుణ్యం ఉన్న, తక్కువ ధరకు లభించే మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని రష్యా బృందానికి వివరించారు.

**సహకార బ్యాంకు వ్యవస్థలో పెట్టుబడులకు ఆహ్వానం:**

దృఢమైన సహకార బ్యాంకు వ్యవస్థలో సాంకేతికత, పెట్టుబడులకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. తమ శాఖల అధికారులతో కూర్చుని చర్చించి మెరుగైన ఒప్పందాలు జరిగేలా ముందుకు వెళ్లాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని వివరించారు.

**రాష్ట్ర ప్రణాళికల వివరణ:**

2047 విజన్ డాక్యుమెంట్, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యసాధన, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మూసీ నది పునరుజ్జీవం వంటి రాష్ట్ర ప్రణాళికలను రష్యా బృందానికి డిప్యూటీ సీఎం వివరించారు.

# పేదల కోసం జీవితం అర్పించిన ఇందిరా

ఘనంగా మాజీ ప్రధాని జయంతి



**బాన్సువాడ, నవంబర్ 19 (మనసులో మాట):**

పేద ప్రజల కోసం తన సమస్త జీవితాన్నే అంకితం చేసిన దేశ మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా, రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు గారు ఆమె సేవలను ఘనంగా స్మరించారు. గరీబీ హటావో వంటి పథకాల ద్వారా పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన ఇందిరా గాంధీ బ్యాంకుల జాతీయీకరణ, భూసంస్కరణలు, మహిళల సాధికారత వంటి అనేక సంస్కరణల ద్వారా సామాజిక సమానత్వాన్ని బలోపేతం చేశారు. పచ్చ విప్లవానికి ఆమె ఇచ్చిన ప్రోత్సాహంతో దేశం ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించగా, విజ్ఞాన%-%సాంకేతిక రంగాల్లో భారత యువతకు విశాలమైన అవకాశాలు అందించారు. 1971 యుద్ధంలో ధైర్యంగా ముందుండి బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సాధనకు మద్దతు ఇచ్చి దేశ భద్రతకు అగ్రగామిగా నిలిచారు. గ్రామీణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక సదు-పాయాలను విస్తరించడంతోపాటు, పేదలకు గృహాలు, విద్య, ఉపాధి అవకాశాలు అందేలా అనేక సంస్కరణలు అమలు చేశారు. అంతర్గత భద్రత, దేశ సమగ్రత కోసం కఠిన నిర్ణయాలు తీసుకున్న ఆమె ప్రజాస్వామ్య విలువలను చివరి శ్వాస వరకు కాపాడిన మహనీయురాలిగా చరిత్రలో నిలిచారు. ఇందిరా గాంధీ సేవలు భారత రాజకీయ, సామాజిక రంగాల్లో చిరస్థాయి గుర్తింపును పొందాయని, ఆమె చూపిన మార్గం భావి తరాలకు ప్రేరణగా నిలుస్తుందని కాసుల బాలరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

**మంథని, నవంబర్ 19 (మనసులో మాట):**

మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో భారతరత్న, ఉక్కు మహిళ, తొలి మహిళా, ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు క్యాంపు కార్యాలయంలో శ్రీమతి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్, మాజీ ఎంపీపీ కొండ శంకర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గోట్కారి కిషన్ జి మాట్లాడుతూ.. శ్రీమతి ఇందిరా గాంధీ దేశ తొలి మహిళా ప్రధానిగా, కేంద్ర మంత్రిగా, పార్లమెంటరీ ప్రతిపక్ష నాయకురాలుగా, అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా శ్రీమతి ఇందిరా గాంధీ భారత దేశ ప్రజలకు అనేక సేవలను అందించారని కాంగ్రెస్ పార్టీ బలోపేతాని కోసం ఎంతగానో కృషి చేయడం జరిగిందని అన్నారు. బ్యాంకుల జాతీయకరణ చేసి ప్రజలకు లావాదేవీల సదుపాయం కల్పించడం జరిగింది, రాజభరణాల రద్దు చేయడం భూ సంస్కరణ తో భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ ద్వారా భూమిని అందించడం జరిగిందని అన్నారు. గరీబి హఠావో నినాదంతోటి ఈ దేశంలో ఉన్నటువంటి పేదరిక నిర్మూలన కోసం ప్రతి ఒక్కరికి కూడు గూడు గుడ్డ అందించడం కోసం వారు ఎంతగానో తోడ్పడడం జరిగిందనీ అన్నారు. 20 సూత్రాల ప్రణాళిక ద్వారా వారు దేశ అభివృద్ధి కోసం కృషి చేయడం జరిగింది అను పరీక్షలు నిర్వహించి శత్రుదేశాలను గడగడ లాడించడం జరిగిందని, పాకిస్తాన్ పైన యుద్ధాన్ని ప్రకటించి పాకిస్తాన్ ను ఓడించి తూర్పు పాకిస్తాన్ విభజించి బంగ్లాదేశ్ ఏర్పాటుకు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. ఆ మహనీయురాలు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం గూడులేని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్ళను కల్పించి గూడు కట్టించడం జరిగింది తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందించి కూడు కల్పించడం జరిగిందని వారు తెలిపారు. ప్రియతమ నాయకులు శ్రీధర్ బాబు మరియు శ్రీను బాబు నాయకత్వంలో శ్రీమతి ఇందిరా గాంధీ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మంథని నియోజకవర్గం అభివృద్ధి కోసం పని చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భరోసానిచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



**మంథని, నవంబర్ 19 (మనసులో మాట) :**

రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులకు భరోసానిచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మల్లారం, వెంకటాపూర్, నాగెపల్లి, భట్టుపల్లి వరి ధాన్యం కేంద్రాలను ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, ఆరెంద, స్వర్ణపల్లి, అడవిసోమన్ పల్లి, చిల్లపల్లి, మల్లేపల్లి, పోతారం, సిరిపురం కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ నాయకులు, రైతులు, హమలిలతో కలిసి ప్రార%శీ%భించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని, రైతుకు మద్దతు ధరతో పాటు క్వి%శీ%టాల్ కు రూ.500 బోనస్ ప్రభుత్వం ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని అన్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు దళారుల బారినపడి మోసపోకుండా ఉండేందుకు, ధాన్యం అమ్ముకోవడానికి వెళ్లే దూర భారాన్ని తగ్గించేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హాయాంలోనే అప్పటి పౌర సరఫరాల శాఖ మంత్రి, ప్రస్తుత ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఊరూర వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించడం జరిగిందని అన్నారు. ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం తాలు, తప్ప పేరిట వరి ధాన్యంలో కోత విధించేదని, కాంగ్రెస్ ప్రభుత్వం లో ఒక్క గింజ కూడా కటింగ్ లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. రైతులకు రైతు భరోసా, రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్లు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘ డైరెక్టర్లు ఆకుల రాజబాపు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, సిరిముర్తి ఓదెలు, లెక్కల కిషన్ రెడ్డి,కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి-మొండయ్య, దేవల్ల విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమాదేవి, మాజీ ఎంపిపి కొండ శంకర్, ఏఎంసి మాజీ చైర్మన్ ఆకుల కిరణ్, నాయకులు బూడిద శంకర్, ఊట్ల అనిల్, ఎరుకల ప్రవీణ్, అక్కపాక సంపత్, బిబ్బర కిషన్, తాళ్ల సత్యనారాయణ, గుమ్మడి రాజయ్య, రాజేంద్ర ప్రసాద్ తిరుపతి రెడ్డి, మానేం రాజేందర్, సత్యనారాయణ, జక్కు బాపు, చాట్లపల్లి శ్రీనివాస్, పందిళ్ళ నర్సయ్య, కాసిపేట వెంకటస్వామి, పొట్ల రవి, గూడ సత్యనారాయణ, గూడ మల్లారెడ్డి, కొండ మహేందర్, దబ్బేట శ్రీశైలం, మండపు మధు, కొటారి బాపు, కుంభం సమ్మిరెడ్డి, కనవేన కిష్టస్వామి, అప్పాల కుమార్, గట్టు శివ శంకర్, కుడుదుల మహాదేవ్, రవికుమార్, ఎరుకల రవి, శశికళ, ఎడ్ల ప్రమీల, కారెంగుల తిరుపతి, ఇసంపల్లి సత్యనారాయణ, తమ్మిశెట్టి సదయ్య, ఆత్కూరి రాజేశం,అనిల్, సాగర్, రాజేందర్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, నాయకులు, కార్యకర్తలు, రైతులు, హమాలీలు, మహిళలు, ఐకెపి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చీరల పంపిణీ కి ఏర్పాట్లు పూర్తి

అదనపు కలెక్టర్ శ్యామల దేవి



**ఆదిలాబాద్ నవంబర్19 (మనసులో మాట):**

జిల్లాలో మహిళల ఉన్నతి, తెలంగాణ ప్రగతి కార్యక్రమం కింద చీరల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల అధికారులు కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని 13,612 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,48,052 మంది మహిళలకు చీరలను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 1,04,379 చీరలు జిల్లాకు చేరినట్లు తెలిపారు. పంపిణీ షెడ్యూల్‌ను ఖరారు చేసి, లబ్ధిదారుల ఆధార్, ఫోటో, అవసరమైన వివరాల నమోదును తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. చీరల పంపిణీని సమన్వయంతో, పండగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ రవీందర్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఏపీఎం, డీపీఎం, మండల సమైక్య అధ్యక్షురాలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చీరల పంపిణీ కి సమగ్ర ప్రణాళిక

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం నవంబర్19 (మనసులో మాట):**

జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతతో, సమగ్రమైన ప్రణాళికతో అమలు చేయాలని అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అర్హత గల మహిళకు చీర అందేలా గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు పంపిణీ ప్రక్రియను నిష్పాక్షికంగా అమలు చేయాలని, ఎలాంటి తప్పిదాలు, ఆలస్యాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల్లో భౌతిక ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ, రశీదుల యాజమాన్యం పూర్తిగా పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ప్రత్యేక కౌంటర్లు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలతో సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నవంబర్ 19 నుండి డిసెంబర్ 9 వరకు, పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుండి 8 వరకు పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం 'జల్ సంచయ్ %-% జన్ భాగీదారీ' కార్యక్రమంలో జిల్లా సాధించిన జాతీయ అవార్డు సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మరియు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనలను మహిళ సంఘ సభ్యులు సత్కరించారు.

# భూమి విషయంలో ఎస్ఐ జోక్యం

ట్యాంక్ ఎక్కి మహిళ నిరసన

**మహబూబాబాద్,నవంబర్ 19(మనసులో మాట):**

తమ భూమి తమకు చెందకుండా ఎస్సై అడ్డుపడుతున్నాడంటూ, దీని వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఓ మహిళ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపింది. తమ భూమి విషయంలో ఎస్ఐ జోక్యంపై చర్యలు తీసుకోవాలని కోరింది. అయితే పోలీసులు సర్ది చెప్పి ఆమెను దింపారు. మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ కేంద్రానికి చెందిన మంగళంపల్లి ప్రసాద్‌కు ఇద్దరు సోదరులు. తమ తండ్రి వారసత్వంగా వచ్చిన 22 గుంటల వ్యవసాయ భూమిని ముగ్గురికి కాకుండా.. ఇద్దరికీ మాత్రమే పంపిణీ చేశాడు. దీంతో ప్రసాద్.. గత నెలలో తొర్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీన్ని పట్టించుకోకుండా ఎస్సై ఉపేందర్.. ప్రసాద్, ఆయన భార్య ఏకాంతను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వారికి రావాల్సిన ఏడు గుంటల భూమిని దక్కకుండా చేస్తున్నాడని ఏకాంత.. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి నిరసన తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటన స్థలానికి చేరుకుని ఆమెకు సర్ది చెప్పి.. కిందికి దింపేందుకు ప్రయత్నాలు చేసారు.

# లారా విలియమ్స్‌తో కేటీఆర్ భేటీ



**హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):**

కొత్తగా హైదరాబాద్‌లో నియమితులైన అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఇ. విలియమ్స్ బుధవారం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి. రామారావు (కేటీఆర్) ను మర్యాదపూర్వకంగా కలిశారు. బంజారా హిల్స్‌లోని నంది నగర్‌లో ఉన్న కేటీఆర్ నివాసంలో ఈ భేటీ జరిగింది. కాన్సుల్ జనరల్‌తో పాటు, న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం నుండి అమెరికా మినిస్టర్-కౌన్సిలర్ (రాజకీయ వ్యవహారాలు) ఆరోన్ కోప్, ఆర్థిక వ్యవహారాల విభాగం నుండి మెరెడిత్ మెట్జర్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## బీసీ ఉపకార వేతనాలకు ఈ నెల చివరి వరకు దరఖాస్తు గడువు

**సంగారెడ్డి, నవంబర్ 19 (మనసులో మాట):**

వెనుకబడిన తరగతుల (బీసీ) విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాల (స్కాలర్‌షిప్‌ల) దరఖాస్తులను ఈ నెల (నవంబర్) చివరి తేదీ లోపు తప్పనిసరిగా అందజేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఆకారపు జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలోని జడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల్లో 9, 10వ తరగతులు చదువుతున్న బీసీ మరియు ఈబీసీ (ఆర్థికంగా వెనుకబడిన తరగతుల) విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను, అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి రూ. 4 వేల చొప్పున ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరు చేయబడుతుందని అధికారి తెలిపారు. ఈ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని కూడా ఆయన వివరించారు: గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షల లోపు ఆదాయం ఉండాలి. పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షల లోపు ఆదాయం ఉండాలి. దరఖాస్తుతో జత చేయాల్సిన పత్రాలు: దరఖాస్తు సమయంలో విద్యార్థులు తమ ఆధార్ కార్డు, కులం ధృవీకరణ పత్రం, ఆదాయం ధృవీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజు ఛాయాచిత్రం (ఫోటో), బ్యాంకు పాస్ బుక్ ప్రతి (కాపీ), మరియు స్టడీ సర్టిఫికేట్ లను సిద్ధం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత, ఆ దరఖాస్తు యొక్క హార్డ్ కాపీలను (ముద్రించిన ప్రతులను), పైన పేర్కొన్న ధృవీకరణ పత్రాలను జతపరిచి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో తప్పనిసరిగా అందజేయాలని అధికారి జగదీష్ విద్యార్థులకు సూచించారు.

## వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

**అదనపు(రెవెన్యూ) కలెక్టర్ డి.వేణు**

**సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి**



**పెద్దపల్లి, నవంబర్ 19 (మనసులో మాట):**

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు(రెవిన్యూ)కలెక్టర్ డి.వేణు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవంలో అదనపు కలెక్టర్ డి.వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, కుటుంబంలోని పిల్లలు మంచి మార్గంలో నడిచేలా గైడ్ చేయడంలో వయోవృద్ధులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వయో వృద్ధులు తెలియజేసిన సమస్యలలో జిల్లా యంత్రాంగం పరిధిలోని సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. బ్యాంకు లలో వయో వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్.బి.ఐ నిబంధనలు ప్రకారం రుణాల జారీ అవకాశాలు పరిశీలిస్తామని తెలిపారు. వృద్ధులు తమ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పనితీరు పట్ల ఏదైనా సలహాలు ఉంటే తెలియజేయాలని, వాటిని సానుకూల దృక్పథంతో తీసుకొని పాటించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. వయో వృద్ధులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని, నలుగురితో స్నేహ పూర్వకంగా ఉండాలని, వీలైనంత వరకు తమ పనులు తామే చేసుకోవాలని నవ్వుతూ ఉండాలని అదనపు కలెక్టర్ కోరారు. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంతకుముందు జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ద్వారా గత సంవత్సరం నుండి ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాల వివరాలను, వృద్ధులకు చట్టాలపై సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు చట్టాలలో చేయవలసిన మార్పులపై, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను సభా దృష్టికి తీసుకొని వచ్చారు. అనంతరం వయో వృద్ధులను అదనపు కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, అదనపు డి.ఆర్.డి.ఓ రవీందర్, వయోవృద్ధులు, వయో వృద్ధుల ఆశ్రమాలు నిర్వహించు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, నవంబర్ 19 (మనసులో మాట):**

తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, వయోవృద్ధులకు త్వరితగతిన న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వృద్ధుల సామాజిక భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం ద్వారా వయోవృద్ధుల నుండి వచ్చిన ఫిర్యాదులను వెను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది వయోవృద్ధుల సమస్యలకు సంబంధించి 200 కు పైగా ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. వారి సామాజిక భద్రతకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేసిన పలువురిని జిల్లా కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు పెండ్యాల కేశవరెడ్డి, మోసం అంజయ్య, అడ్వకేట్ ఎర్రం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'సీనియర్ సాథి' ప్రారంభం

- వృద్ధుల సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, నవంబర్ 19 (మనసులో మాట):**

వృద్ధుల సంక్షేమం, ఒంటరితనాన్ని దూరం చేసే లక్ష్యంతో హైదరాబాద్ కలెక్టరేట్‌లో 'సీనియర్ సాథి' కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వృద్ధులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, సీనియర్ సిటిజన్స్ చట్టాన్ని సీరియస్‌గా అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అరుణ్, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. సీనియర్ సాథి కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను, ముఖ్యంగా అరుణ్‌ను మంత్రి అభినందించారు. కొంతమంది సమయం లేక, మరికొందరు కుటుంబ కారణాల వల్ల వృద్ధులను దూరం పెడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, వృద్ధులు తమ అనుభవాలను కుటుంబ సభ్యులతో పంచుకునే వారని, కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో వృద్ధులు ఒంటరిగా భావిస్తున్నారని అన్నారు. "నేను క్షేత్రస్థాయి (ఫీల్డ్) పర్యటనకు వెళ్లినప్పుడు, మా కొడుకు చూడడం లేదు, పట్టించుకోవడం లేదు అని ఫిర్యాదులు వస్తుంటాయి" అని మంత్రి తెలిపారు. సీనియర్ సిటిజన్స్ చట్టంపై మరింత అవగాహన కల్పించి, సమాజంలో పిల్లలు వృద్ధులను ఆరాధించేలా మార్పు తీసుకురావాలన్నారు. కావాలనే తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్న వారికి చట్టం ద్వారా శిక్షించి, యంగిస్తాన్ లాంటి సంస్థలు వారికి అండగా ఉండాలని కోరారు. ఉద్యోగ నియామక పత్రాలు అందజేసే సమయంలో ముఖ్యమంత్రి గారు కూడా, "మీరు మీ తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి, లేకపోతే మీ జీతాల నుండి కట్ చేస్తామని" స్పష్టంగా హెచ్చరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వృద్ధులు ఎప్పుడు, ఎవరి చేత సైబర్ నేరాలకు గురవుతారో తెలియదని, దీనిపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌లో స్థాపించిన ఈ కార్యక్రమం రోల్ మోడల్గా నిలిచి, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి (గ్రౌండ్‌లోకి) తీసుకెళ్లాలని సూచించారు. వృద్ధులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఏ ఇబ్బందులు లేకుండా సీరియస్‌గా చట్టాన్ని అమలు చేస్తుందని భరోసా ఇచ్చారు. తమ రవాణా శాఖ తరపున యూనిసెఫ్‌తో కలిసి రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అవగాహన కల్పిస్తున్నామని, రోడ్డు భద్రతపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, రోడ్డు ప్రమాదాల ద్వారా మరణాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్మాణంలో వాటర్ హార్వెస్టింగ్ (వర్షపు నీటి సంరక్షణ) నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. చివరిగా, పిల్లలకు చిన్నప్పటి నుండే ఇరిటేషన్ లేకుండా ఓర్పు (పేషన్స్) ఉండేలా వారికి ప్రత్యేక వగాహన కల్పించాలని సూచించారు.

# అర్హులకు ఇందిరమ్మ చీరల పంపిణీ

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి కృషి చేయాలని సమాఖ్య ప్రతినిధులకు పిలుపు



**నిజామాబాద్ నవంబర్ 19 (సమయం న్యూస్):**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ జిల్లాలో పూర్తి పారదర్శకంగా జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీ.సీలో పాల్గొన్న సమాఖ్య ప్రతినిధులకు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో "మహిళల ఉన్నతి - తెలంగాణ ప్రగతి" కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీకి చర్యలు తీసుకున్నామని అన్నారు. ఎలాంటి విమర్శలు, పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ అయ్యేలా సమాఖ్య ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. చీరల పంపిణీ కార్యక్రమం పర్యవేక్షణ కోసం నియోజకవర్గానికి ఒకరు చొప్పున స్పెషల్ ఆఫీసర్ ను నియమిస్తున్నామని అన్నారు. నిర్ణీత గడువు లోపు చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కోసం ప్రతి గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన యువతులు, మహిళల వివరాలను పక్కాగా సేకరించాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇతోధికంగా తోడ్పాటును అందిస్తూ, అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పాటుతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడమే కాకుండా సామాజికంగా కూడా ప్రగతి పథంలో పయనించేలా సమాఖ్యలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాల సభ్యులందరూ ఉచిత ఆరోగ్య పరీక్షలు చేసుకుని, అవసరమైన వారు చికిత్సలు పొందేలా మహిళా సమాఖ్యలు చొరవ చూపాలన్నారు. అదేవిధంగా ప్రతి మహిళ చదువుకునేలా వయోజన విద్యా కార్యక్రమం విజయవంతానికి తోడ్పాటును అందించాలని కలెక్టర్ సూచించారు. చదువు నేర్చుకున్న వారు ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలన్నారు. కల్తీ కల్లు, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై, ప్రత్యేకించి గర్భిణీలు వీటికి దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో కృషి చేస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులు సమాజానికి జ్ఞాన భాండాగారాలు



**కలెక్టర్ పి ప్రావీణ్య**

**కలెక్టరేట్లో ఘనంగా వయోవృద్ధుల వారోత్సవాలు**

**సంగారెడ్డి, నవంబర్ 19 (మనసులో మాట):**

వయోవృద్ధులు సమాజానికి జ్ఞాన బండాగారాలు అని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జిల్లా మహిళా శిశు, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు 2025 ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన తో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ... వయోవృద్ధులు మన సమాజానికి అపారమైన జ్ఞాన భాండాగారం. వారి అనుభవాలు, మార్గదర్శకాలు భవిష్యత్ తరాల నిర్మాణానికి దిక్సూచి లాంటివి అని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన చట్టాల పై సమగ్ర అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులు, సంఘాల ప్రతినిధులను ఆమె సూచించారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిన వయోవృద్ధుల సంక్షేమ చట్టం 2007 జిల్లాలో పటిష్టంగా అమలు అవుతుందన్నారు ఈ చట్టం అమలు కోసం జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా ఈ చట్టం ద్వారా పరిష్కరించిన వివిధ కేసుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. వివిధ రంగాలలో పనిచేసిన వయోవృద్ధులు వారి అనుభవాలను భావితరాలకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలోనారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వయోవృద్ధుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## మద్యం దుకాణం దరఖాస్తుదారుల ఎంపికకు లాటరీ

**మహబూబ్‌నగర్, నవంబర్ 19 (మనసులో మాట):**

జిల్లాలోని ఒక మద్యం దుకాణం (వైన్‌షాప్) కేటాయింపు కోసం బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో రీ-లాటరీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయేంద్రా బోయి గారి ఆధ్వర్యంలో ఎం.బి.ఎన్. 016 సంఖ్య గల వైన్‌షాపునకు ఈ లాటరీ ప్రక్రియ జరిగింది. ఈ లాటరీలో మొత్తం 28 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. లాటరీ డ్రా చేయగా, అందులో 22వ నెంబర్ గల దరఖాస్తుదారు జెట్టం శ్రీను ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమ నిర్వహణలో జిల్లా ఎక్సైజ్ అధికారి సుధాకర్, సహాయక ఎక్సైజ్ అధికారి నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెండో టెస్టులో గిల్ ఆడతాడా?



భారత్, సౌత్ ఆఫ్రికా మధ్య రెండవ టెస్ట్ నవంబర్ 22న గౌహతిలో ప్రారంభం కానుంది. అంతకుముందు టీమిండియాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఈ టెస్టులో టీమ్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడటం దాదాపుగా కష్టమని తెలుస్తోంది. కోల్‌కతా టెస్టు సందర్భంగా అతనికి నెక్ స్పాజమ్ వచ్చింది. దీని వల్ల గిల్ ఆసుపత్రిలో కూడా చేరాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ మధ్యలోనే రిటైర్డ్ హర్ట్ గా వెళ్లిపోయిన గిల్ రెండో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్‌కు దిగలేదు. ఇప్పుడు గిల్ నవంబర్ 18న ఈడెన్ గార్డెన్స్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదు. కెప్టెన్ కోలుకోవడానికి ఇంకా 5 నుండి 7 రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. గిల్ కోలుకుంటున్నాడని తెలిపిన బోర్డు.. రెండో టెస్టులో ఆడటంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత సమాచారం ప్రకారం, శుభ్‌మన్ గిల్ జట్టుతో గౌహతికి వెళ్తాడు అని బీసీసీఐ తెలిపింది. కానీ జట్టుతో పాటు గౌహతికి వెళ్లినా కూడా రెండో టెస్టులో గిల్ ఆడకపోవచ్చు. తనకు ఇప్పుడు విశ్రాంతి అవసరం. రెండో టెస్టులో గిల్ ఆడటంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని బోర్డు పేర్కొంది. గిల్ ఆడకపోతే, రిషబ్ పంత్ రెండో టెస్టులో కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది. టీమ్ మేనేజ్‌మెంట్ పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటుంది. అయితే భారత్ ప్లేయింగ్ XIలో పెద్ద మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉందని సంకేతాలు స్పష్టంగా ఉన్నాయి. యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని అధికారికంగా టెస్ట్ జట్టులోకి చేర్చుకుంది. ఈడెన్ గార్డెన్స్ టెస్టుకు ముందు నితీష్ ను రిలీజ్ చేసింది. తద్వారా అతను ఇండియా A జట్టులో భాగం అయ్యాడు. గౌహతి టెస్టులో గిల్ అందుబాటులో ఉండటం అనుమానంగా మారడంతో సెలెక్టర్లు వెంటనే నితిష్ రెడ్డిని తిరిగి పిలిపించారు. నవంబర్ 18న జట్టు ప్రత్యామ్నాయ శిక్షణా శిబిరంలో నితిష్ రెడ్డి పాల్గొన్నాడు. అతడు జట్టులో చేరడంతో భారత్ ప్లేయింగ్ ఎలెవన్ లో మార్పులు చేయడం ఖాయం. గిల్ ఆడకపోతే నితీష్ రెడ్డికి నేరుగా ప్లేయింగ్ XIలో అవకాశం లభిస్తుంది. సీనియర్లు సైతం ఇదే అభిప్రాయంతో ఉన్నారు. నితీష్ రెడ్డి తన టెస్ట్ కెరీర్‌లో 9 మ్యాచ్‌లు ఆడి 386 పరుగులు చేశాడు. ఇందులో ఒక అద్భుతమైన సెంచరీ ఉంది. అది కూడా ఆస్ట్రేలియాపై చేయడం విశేషం. బౌలింగ్‌లో 8 వికెట్లు తీశాడు. 2024లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత ఈ తెలుగు తేజం నిరంతరం భారత క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఫోకస్‌లో ఉన్నాడు. గిల్ అందుబాటులో లేకపోతే కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. లేనిపక్షంలో రాహుల్ కు తాత్కాలిక కెప్టెన్సీ బాధ్యత అప్పగించే అవకాశం లేకపోలేదు.

# చరిత్ర సృష్టించిన డారిల్ మిచెల్

## వన్డేల్లో నంబర్-1 బ్యాటర్‌గా రికార్డు



అంతర్జాతీయ క్రికెట్ మండలి బుధవారం మధ్యాహ్నం వన్డే, టెస్టు ఫార్మాట్‌లకు సంబంధించిన తాజా ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఈ ర్యాంకింగ్స్‌లో ఒక చారిత్రక మార్పు జరిగింది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ మూడు వారాల పాటు కొనసాగిన నంబర్-1 వన్డే బ్యాటర్ స్థానాన్ని కోల్పోయాడు. న్యూజిలాండ్‌కు చెందిన డాషింగ్ బ్యాట్స్‌మెన్ డారిల్ మిచెల్ అగ్రస్థానానికి చేరుకోవడంతో 46 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌కు చెందిన ఒక ఆటగాడు వన్డేల్లో నంబర్-1 బ్యాటర్‌గా నిలిచాడు. మరోవైపు టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో మాత్రం టీమిండియా స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. న్యూజిలాండ్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డారిల్ మిచెల్, వెస్టిండీస్‌తో నవంబర్ 16న జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో 119 పరుగుల అద్భుతమైన సెంచరీతో అదరగొట్టాడు. ఈ ప్రదర్శన అతనికి ర్యాంకింగ్స్‌లో భారీగా కలిసొచ్చింది. మిచెల్ ఏకంగా నంబర్-1 స్థానానికి చేరుకోవడం ద్వారా 1979లో గ్లెన్ టర్నర్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. దురదృష్టవశాత్తు, మిచెల్ నడుము నొప్పి కారణంగా ఈ సిరీస్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. మరోవైపు, పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 102 పరుగులు చేయడం వలన, ఆరు స్థానానికి చేరుకోగా, మహ్మద్ రిజ్వాన్ 22వ స్థానానికి, ఫఖర్ జమాన్ 26వ స్థానానికి ఎగబాకారు. వన్డే ఫార్మాట్‌లో బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ తన నంబర్-1 స్థానాన్ని కొనసాగించాడు. పాకిస్తాన్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో 3 వికెట్లు పడగొట్టి 11 స్థానాలు ఎగబాకి ఏకంగా 9వ స్థానానికి చేరుకున్నాడు. అలాగే, పాకిస్తాన్ పేసర్ హారిస్ రవూఫ్ 5 స్థానాలు మెరుగుపరుచుకుని 23వ స్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్‌కు చెందిన జాయ్‌డెన్ సీల్స్, రోస్టన్ చేజ్ కూడా ర్యాంకింగ్స్‌లో మెరుగుదల సాధించారు. టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా మొత్తం 6 వికెట్లు పడగొట్టడం వలన ఈ స్థానం పదిలమైంది. భారత స్పిన్నర్లలో కూడా మంచి పురోగతి కనిపించింది. కుల్‌దీప్ యాదవ్ రెండు స్థానాలు పైకి వచ్చి తన కెరీర్‌లో అత్యుత్తమంగా 13వ స్థానాన్ని చేరుకోగా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా నాలుగు స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో ఉన్నాడు. సౌతాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ ఈడెన్ గార్డెన్స్‌లో 8 వికెట్లు తీయడంతో 20 స్థానాలు పైకి వచ్చి 24వ స్థానంలో నిలిచాడు.

# కామెరాన్ గ్రీన్‌పై కన్నేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్



సన్ రైజర్స్ హైదరాబాద్.. మినీ వేలంలో పోటీకి సిద్ధమైంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కోరుతున్న ఆ ప్లేయర్ కోసం గట్టిగా పోటీ పడనుంది. ఐపీఎల్ ఫ్రాంచైజీలన్నీ కూడా తమ కోర్ టీంపై నమ్మకాన్ని ఉంచాయి. ముఖ్యంగా బెంచ్‌కే పరిమితమైన ప్లేయర్స్, నిలకడలేమి ఆటగాళ్లకు గుడ్ బై చెప్పేయడానికి సిద్ధమయ్యాయి. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికొస్తే.. ట్రావిస్ హెడ్‌ను ముంబై టీంకు ట్రేడ్ చేసి.. రోహిత్ శర్మను తీసుకుంటుందని.. అలాగే హెన్రిచ్ క్లాసెన్‌ను వేలంలోకి వదిలేసి.. మళ్లీ కొనుగోలు చేస్తుందని టాక్ వినిపించింది. అయితే వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ కావ్యపాప.. తన కోర్ టీంపై మళ్లీ భరోసాతో ముందుకు వెళ్తోంది. కావ్యా పాప కోర్ టీం విషయానికొస్తే.. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ కచ్చితంగా మరోసారి ఓపెనింగ్ బ్యాటర్లుగా బరిలోకి దిగనున్నారు. అలాగే మిడిలార్డర్‌లో ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ ఉండకనే ఉన్నారు. ఆ తర్వాత నితీష్ కుమార్ రెడ్డి, అనికేట్ దిగనుండగా.. వీరికంటే ముందు మరో ఆల్‌రౌండర్- కమ్ ఫినిషర్ రోల్ కోసం ఓ ప్లేయర్‌ను వేలంలో కొనుగోలు చేయడానికి హైదరాబాద్ యాజమాన్యం ఆసక్తిగా చూస్తోంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా అతడి కోసం కోట్లు అయినా ఖర్చు చేయాలని చెప్పాడట. అతడెవరో కాదు.. కామెరాన్ గ్రీన్. గాయం నుంచి కోలుకున్న ఈ ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్.. అటు వన్డేలు, ఇటు టీ20ల్లో దుమ్ములేపుతున్నాడు. అలాగే మరికొన్ని రోజుల్లో యాషెస్ టెస్ట్ సిరీస్ ప్రారంభం అవుతుండటంతో.. అందరి ఫోకస్ అతడిపైనే పడింది. ఇక్కడ కామెరాన్ గ్రీన్ కోసం హైదరాబాద్‌కు మినీ వేలంలో గట్టి పోటీ ఎదురయ్యేలా కనిపిస్తోంది. అటు కేకేఆర్, చెన్నై కూడా ఈ ఆల్‌రౌండర్ కోసం పోటీ పడుతున్నాయి. మరి ఎవరికి దక్కుతాడో చూడాలి.

# నంబర్ 1 స్థానం కోల్పోయిన రోహిత్ శర్మ



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మకి అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో స్వల్ప షాక్ తగిలింది. కేవలం మూడు వారాల పాటు నంబర్-1 స్థానంలో కొనసాగిన రోహిత్ శర్మ, ఆ కిరీటాన్ని ఇప్పుడు కోల్పోయాడు. ఆస్ట్రేలియా పర్యటనలో హాఫ్ సెంచరీ, సెంచరీ ఇన్నింగ్స్‌ల ద్వారా నంబర్-1 స్థానానికి చేరుకున్న రోహిత్, తాజా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి పడిపోయాడు. అయితే రోహిత్ శర్మను వెనక్కి నెట్టిన ఆ న్యూజిలాండ్ బ్యాటర్, అతడి కంటే కేవలం ఒక్క పాయింట్ మాత్రమే ముందుండటం విశేషం. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన మొదటి వన్డేలో మిచెల్ సెంచరీ (119 పరుగులు, 118 బంతులు) చేయడంతో, ఈ ప్రదర్శన అతడికి ర్యాంకింగ్‌లో బాగా కలిసొచ్చింది. అంతకుముందు మూడో స్థానంలో ఉన్న మిచెల్, ప్రస్తుతం 782 రేటింగ్ పాయింట్స్ తో నంబర్-1 స్థానాన్ని దక్కించుకున్నాడు. రోహిత్ శర్మ ఇప్పుడు 781 రేటింగ్ పాయింట్స్ తో రెండో స్థానానికి పడిపోయాడు. ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు ఇబ్రహీం జద్రాన్ మూడో స్థానంలో ఉన్నాడు. డారిల్ మిచెల్ అగ్రస్థానానికి చేరుకోవడం న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన రికార్డు. ఎందుకంటే సుమారు 47 సంవత్సరాల తర్వాత న్యూజిలాండ్‌కు చెందిన ఒక బ్యాటర్ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఇంతకుముందు 1979 సంవత్సరంలో గ్లెన్ టర్నర్ నంబర్-1 వన్డే బ్యాటర్‌గా నిలిచాడు. డారిల్ మిచెల్ ఈ ఏడాది (2025) అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఈ సంవత్సరం 16 ఇన్నింగ్స్‌లలో 54.35 సగటుతో 761 రన్స్ చేశాడు. రోహిత్ శర్మ వన్డే ర్యాంకింగ్‌లో కేవలం ఒక్క పాయింట్ తేడాతో వెనుకబడటం వలన నంబర్-1 స్థానాన్ని తిరిగి దక్కించుకోవడానికి అతనికి వెంటనే ఒక చక్కటి అవకాశం ఉంది. నవంబర్ 30 నుంచి భారత్, సౌతాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లలోనూ రోహిత్ శర్మ మంచి ప్రదర్శన చేస్తే, డారిల్ మిచెల్‌ను దాటి మళ్లీ అగ్రస్థానాన్ని సొంతం చేసుకోవడం ఖాయం. రోహిత్ శర్మ ప్రస్తుతం టీ20, టెస్ట్ ఫార్మాట్‌ల నుంచి రిటైర్మెంట్ తీసుకుని కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో డారిల్ మిచెల్ (782), రోహిత్ శర్మ (781) మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. ఆ తర్వాత, ఇబ్రహీం జద్రాన్ (764), శుభమాన్ గిల్ (745), విరాట్ కోహ్లీ (725) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. భారత బ్యాటర్లలో శ్రేయస్ అయ్యర్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. శ్రీలంక ఆటగాడు చరిత్ అసలంక 3 స్థానాలు దిగజారి తొమ్మిదో స్థానానికి పడిపోవడం వలన బాబర్ ఆజం (ఆరో స్థానం) ప్రయోజనం కలిగింది.



# భారత్‌కు ఘోర పరాజయం..!

## 2-1తో భారత్-ఏ జట్టు సిరీస్ కైవసం

సౌతాఫ్రికా-ఏతో అనధికార మూడు వన్డేల సిరీస్‌లో భారత్-ఏకు ఘోర పరాజయం ఎదురైంది. రాజ్‌కోట్ వేదికగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో తిలక్ వర్మ సారథ్యంలోని భారత్-ఏ జట్టు 72 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఈ సిరీస్‌ను భారత్-ఏ జట్టు 2-1తో కైవసం చేసుకుంది. ఆఖరి అనధికార వన్డేలో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా-ఏ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 325 పరుగుల భారీ స్కోర్ చేసింది. లుహన్ డ్రీ ప్రిటోరియస్(98 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లతో 123), రివల్డో మూన్‌సమీ(130 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 107) సెంచరీలతో రాణించారు. భారత్-ఏ బౌలర్లలో ఖలీల్ అహ్మద్, ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా రెండేసి వికెట్లు తీసారు. అనంతరం భారత్ 49.1 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని(66 బంతుల్లో 8 ఫోర్లతో 66), ఇషాన్ కిషన్(67 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించగా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ తిలక్ వర్మ(11), అభిషేక్ శర్మ(11), రుతురాజ్ గైక్వాడ్(25) దారుణంగా విఫలమయ్యారు. సౌతాఫ్రికా బౌలర్లలో పీటర్(4/48) నాలుగు వికెట్లు తీయగా.. మోరెకి(2/56) రెండు వికెట్లు పడగొట్టాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌కు సన్నాహకంగా ఈ మూడు అనధికార వన్డేలను నిర్వహించారు. ఈ టోర్నీలో రాణించిన ఆటగాళ్లకు భారత వన్డే జట్టులో చోటు దక్కే ఛాన్స్ ఉంది. ఈ సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ 117, 68 పరుగులతో రాణించాడు. అతనికి సౌతాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌లో అవకాశం దక్కవచ్చు. ఈ మూడు వన్డేల్లో తిలక్ వర్మ, అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చారు. నవంబర్ 30 నుంచి భారత్, సౌతాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. తొలి వన్డే రాంచీ వేదికగా జరగనుండగా.. రెండో వన్డే డిసెంబర్ 3న రాయ్‌పూర్, డిసెంబర్ 6న వైజాగ్ వేదికగా మూడో వన్డే జరగనుంది.

# అండర్ 14, 16 క్రీడా టోర్నీలను రద్దు చేయండి

## ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు



దేశ రాజధాని న్యూఢిల్లీలో అండర్ 14, 16 క్రీడా టోర్నీలను రద్దు చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం ఢిల్లీలో నెలకొన్న వాయు కాలుష్యంపై చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అండర్ 16, అండర్ 14 ఇంటర్ జోనల్ క్రీడా టోర్నీలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ఢిల్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయవాది అపరాజితా సింగ్ వేసిన పిటిషన్‌ను బీఆర్ గవాయ్-కే వినోద్ చంద్రన్ ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ కాలుష్యం మధ్య క్రీడా టోర్నీలు నిర్వహిస్తే.. పిల్లలను గ్యాస్ చాంబర్స్‌లో పెట్టినట్లవుతుందని, వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. కాలుష్యం తగ్గేవరకు పాఠశాలల్లో క్రీడా టోర్నీలు నిర్వహించవద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఈ టోర్నీలు నిర్వహించాలని సూచించింది. అవసరమైతే కాలుష్యం తగ్గే వరకు టోర్నీలను వాయిదా వేయాలని పేర్కొంది. ఈ మేరకు ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌కు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. కాలుష్యం తీవ్రంగా ఉండే నవంబర్, డిసెంబర్ నెలల్లో ఎలాంటి క్రీడా ఈవెంట్స్ నిర్వహించవద్దని పేర్కొంది.



# వారణాసి నుంచి రణకుంభ పాట విడుదల

దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం వారణాసి. ఈ సినిమాకు కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవవహరిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీత అందించబోతున్నాడు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే ఇటీవలే ఈ మూవీ గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఈవెంట్‌ను జరుపుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పాడిన పృథ్వీరాజ్‌కి సంబంధించిన 'రణ కుంభ' పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. 'ప్రళయం ప్రళయం' అంటూ సాగే ఈ పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. 'వారణాసి' సినిమాకు సంబంధించి ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుక మొదట ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అయ్యింది. అయితే తాజాగా ఈ వేడుకకు సంబంధించిన మొత్తం వీడియోను చిత్రబృందం యూట్యూబ్ వేదికగా వదిలింది. గంట 37 నిమిషాల నిడివి కలిగిన ఈ వీడియో ప్రస్తుతం డిజిటల్ వేదికగా వైరల్‌గా మారింది. కాగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోకు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

# డిసెంబర్ 31 నుంచి నటనకు ఇక స్వస్తి

## సినీ ప్రస్థానానికి గుడ్‌బై చెప్పిన నటి తులసి



ప్రముఖ నటి తులసి తన దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు పలికారు. డిసెంబరు 31 నుంచి అధికారికంగా రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. తన రిటైర్‌మెంట్ జీవితాన్ని షిరిడీ సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపి అభిమానులను భావోద్వేగానికి గురిచేశారు. 1967లో బాలనటిగా రంగప్రవేశం చేసిన తులసి ఇప్పటి వరకు సుమారు 300కు పైగా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఇటీవలి వరకు ఆమె అనేక సినిమాల్లో క్యారెక్టర్ పాత్రలు వేసి మెప్పిస్తూ వచ్చారు. డిసెంబరు 31న షిరిడీ దర్శనానికి వెళ్తున్నానని, ఆ రోజు నుంచే తన రిటైర్‌మెంట్ ఉంటుందని ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. రిటైర్‌మెంట్ జీవితాన్ని సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1967లో తులసి సినీ రంగ ప్రవేశం చేశారు. 1974లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం 'ఆరంగేట్రం'లో బాలనటిగా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి భాషల్లో సుమారు 300 చిత్రాల్లో నటించారు. కన్నడ దర్శకుడు శివమణిని వివాహం చేసుకున్న తర్వాత కొంతకాలం నటనకు విరామం ఇచ్చారు. ఆనంతరం క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీ ఎంట్రీ ఇచ్చారు.విశ్వనాథ్ సినిమాల్లో ఎక్కువగా నటించిన తులసికి బాలనటిగా శంకరాభరణం ఎనలేని కీర్తిని తీసుకు వచ్చింది. ఆ తర్వాత చిరంజీవి హీరోగా వచ్చిన శుభలేఖ సినిమాలో సుధాకర్‌కు జోడీగా మెప్పించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.



# ఆంధ్రా కింగ్ తాలూకా ట్రైలర్ విడుదల

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేష్ బాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్-మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే ఈ చిత్రంలో రామ్.. ఒక సూపర్ స్టార్‌కి వీరాభిమానిగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ ఉపేంద్ర గారు పోషించిన 'ఆంధ్రా కింగ్' పాత్రకు రామ్ ఎంతటి డైహార్డ్ ఫ్యాన్ అనే అంశాన్ని ట్రైలర్ హైలైట్ చేసింది. రామ్ పోతినేని ఎనర్జీ, మాస్ డైలాగ్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తున్నారు.

# మరో వివాదంలో నటుడు ధనుష్

## టీవీ నటి మాన్యా ఆనంద్ సంచలన వ్యాఖ్యలు





నిత్యం ఏదో ఓ వార్తలో ప్రధానంగా నిలిచే తమిళ స్టార్ హీరో ధనుష్ పై మరో కొత్త వివాదం రేగింది. ఈసారి ప్రముఖ టీవీ నటి మాన్యా ఆనంద్ చేసిన సంచలన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించిన విషయాలు ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో పెద్ద కలకలం రేపుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. ధనుష్ హీరోగా చేస్తున్న ఓ సినిమాలో ముఖ్యమైన పాత్ర ఇస్తామని చెప్పి ఆయన మేనేజర్ శ్రేయాస్ తనను సంప్రదించాడని, నేను కూడా 'ఒక మంచి అవకాశం వస్తుందని నిజంగా నమ్మాను. కానీ రోజులు గడిచేకొద్దీ వాళ్లు అడిగిన మాటలు, ప్రవర్తన చూసి నేను షాక్ అయ్యానని పేర్కొంది. 'పాత్ర కోసం కొన్ని కమిట్‌మెంట్‌లు ఇవ్వాలి' అని సూచిస్తూ, ధనుష్‌తో 'అడ్జస్ట్మెంట్' చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆమె ఆరోపించింది. వారి అసలు ఉద్దేశం త్వరగానే తెలుసుకుని నేను జాగ్రత్త పడ్డానని కానీ పాత్ర కోసం మహిళలపై ఇలాంటి ఒత్తిడి తేవడం చాలా తప్పని మాన్యా ఇంటర్వ్యూలో తెలిపింది. ఆ విషయం నన్ను తీవ్రంగా కలచివేసిందని వివరించింది. ఇంకా మాన్యా మాట్లాడుతూ..ఇలాంటి ఒత్తిళ్లు, 'అడ్జస్ట్మెంట్' పేరుతో జరిగే అనైతిక డిమాండ్లు చిత్రపరిశ్రమలో ఇంకా కొనసాగుతున్నాయని, కొత్తగా వచ్చే నటీమణులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు భయంతో బయట పెట్టలేరని, ఈ విషయాలు బహిరంగంగా చెప్పడానికి చాలా ధైర్యం కావాలని, తనలాంటి వారు మాట్లాడితేనే మార్పు వస్తుందని ఆమె అన్నారు. అయితే.. అమె ఈ ఘటన ఎప్పుడు జరిగింది, ఏ సినిమా విషయంలో చోటు చేసుకున్నది, ఇప్పుడే ఎందుకు బయట పెట్టిందనే విషయాలు మాత్రం చెప్పలేదు. అయితే అయితే ధనుష్, లేదా ఆయన టీమ్, మేనేజర్ శ్రేయాస్ ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. అయితే.. వైరల్‌గా మారిన ఈ వివాదంపై అరోపణలు చేసిన నటి మాన్యా ఆనంద్ స్పందించి ఇన్స్టాలో ఓ న్యూస్ షేర్ చేసుకుంది. నా ఇంటర్వ్యూ అధారంగా చాలా ఛానళ్లు ధనుష్‌పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని స్పష్టం చేసింది. దయచేసి ఒరిజినల్ వీడియోను చూసి ఓ నిర్ణయానికి వచ్చి మట్లాడండి అని కోరింది. నన్ను సంప్రదించిన వ్యక్తి తన పేరు శ్రేయాస్ అని చెప్పుకుంటూ సినిమాకి అవకాశాలు ఇస్తానని మాట్లాడిన వ్యక్తి నిజమైనవాడు కాకపోవచ్చని నేను ఆ వీడియోలో స్పష్టంగా పేర్కొన్నానని, ఆ నంబర్‌ను ధనుష్ సర్ టీమ్‌కు పంపించి నిజానిజాలు తెలుసుకుంటానని కూడా చెప్పానని వివరించింది. అందరూ దయచేసి తప్పుడు వార్తలు వైరల్ చేయవద్దని వేడుకుంది..ట్రోలింగ్, వైరల్ చేసే ముందు ఒరిజినల్ వీడియోను చూడండి అని కోరింది. మాన్య గతంలో తెలుగులో జెమిని టీవీలో వచ్చిన భాగ్య రేఖ అనే సీరియల్‌లోనూ నటించింది.

# నిన్న అదితి.. నేడు శ్రియా

## నకిలీ వాట్సప్ క్రియేట్ చేసిన దుండగులు



నటి అదితిరావు హైదరి పేరుతో ఇటీవల నకిలీ వాట్సప్ క్రియేట్ చేసి ఒక వ్యక్తి ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో నటి శ్రియ శరణ్ ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అభిమానులు అప్రమత్తంగా ఉ ండాలని సూచించారు. ఈ వాట్సప్ ఎవరిదో నాకు తెలియదు. దయచేసి ఇలాంటివారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులను నేను కలిసి వర్క్ చేయనున్న వారికి మెసేజ్‌లు చేస్తున్నాడు. అందరూ అప్రమత్తంగా ఉండండి అంటూ శ్రియ తెలిపారు. తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉ ండాలంటూ నటి అదితిరావు హైదరి ఇటీవల విజ్ఞప్తి చేశారు. 'నా పేరుతో పాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకొని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఫొటోషూట్ లాంటి వాటికోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలియజేయండి' అని పేర్కొన్నారు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861